UNIVERSAL
LIBRARY
OU_206066
UNIVERSAL
LIBRARY

Osmania University Library

ıll No. T 80.8 V46S Accession No. T 3230

ıthor [illegible]

:le [illegible]

This book should be returned on or before the dat
arked below. 1946

శారదా పీఠ గ్రంథ మాలిక

సాహిత్య సమాలోచనము

సాహితీ సమితి

నాంపల్లి. హైదరాబాదు. దక్షిణ
మారేడుపల్లి. సికందరాబాదు
రేపల్లె. తెనాలి. గుంటూరు
రాజమహేంద్రవరము. పిఠాపురము.

సాహిత్య సమాలోచనము,

శ్రీ పిల్లలమర్రి
వేంకట హనుమంతరావు, ఎం. ఏ.

1946

సాహితీ సమితి.
నాంపల్లి, హైదరాబాదు.

© సర్వ స్వామ్య సంకలితము

ప్రథమ ముద్రణము 1946

రామా ప్రెస్
సికందరాబాదు

పండితోత్తములు, విమర్శకాగ్రేసరులు

చరిత్రరచనాచతురులు, గురూత్తములు

బ్రహ్మశ్రీ వేదమూర్తి

కురుగంటి సీతారామ భట్టాచార్యుల వారికి

ప్రేమోపహారము

*

సహోదరయుగ కృతజ్ఞత

పరిచయము

శ్రీ హనుమంతరావు గుంటూరు మండలాంతర్గతమైన బ్రాహ్మణ కోడూరు లో 31-12-1918న ప్రసిద్ధ బ్రాహ్మణ కుటుంబములో జన్మించినాడు. సికిందరాబాదు మహబూబు కాలేజిలోను, హైదరాబాదు నిజాం కాలేజిలోను వాల్తేరు ఆంధ్ర విశ్వవిద్యాలయములోను విద్యాభ్యాసము చేసి ఎం.ఏ. పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. చిన్నతనముననే సికిందరాబాదులో సాధనసమితి, గుంటూరులో సరస సారస్వత సమితి, ఆంధ్ర సాహిత్య మండలి, వేమూరులో కవితాశ్రమము మొదలైన సాహిత్య సంస్థలను స్థాపించి యువకులచే కృషి చేయించినాడు. ఇప్పుడు జ్యోత్స్నా సమితికి అధ్యక్షుడు.

సాహితీ సమితి సభ్యుడు. కొలది కాలము నైజాములో ఉద్యోగము చేసినాడు. గుంటూరు హిందూ కళాశాలలో ఇప్పుడు ఆంధ్రాధ్యాపక పదవిలో నున్నాడు. ప్రతిభావంతుడైన హనుమంతరావు గేయములు, కథలు, నాటికలు అనేకము రచించినాడు. ఆకాశవాణిలో అనేక సారస్వతోపన్యాసము లిచ్చినాడు. నిశితబుద్ధి యయిన ఇతని విమర్శలు విషయ వివరణమున విశదములై భావోత్తేజకములై యుండును. శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యులవారికడ శుశ్రూష చేసి వృద్ధిలోనికి వచ్చిన ఈ సాధువర్తనుడు శివానుగ్రహమువలన ఇతోధిక వృద్ధి నొందునని నా విశ్వాసము.

శ్రీ శివశంకర శాస్త్రి

ఈ 'సాహిత్య సమాలోచనము' శ్రీ హనుమంతరావుగారు ఆంధ్ర శారదాపీఠమునకు సమర్పించిన భవ్యనవ్యకుసుమము. సాహిత్యవిషయములను గురించియు, ఆంధ్రసాహిత్యమును గురించియు అప్పుడప్పుడు హైదరాబాదు మదరాసు రేడియోస్టేషనులనుండి 'ప్రసారితము' లైన ప్రసంగములును, వేరువేరు తెలుగుపత్రికలకు వ్రాసిన వ్యాసములును వీని కొక చక్కని క్రమము కుదిరి ఆంధ్రసాహిత్యవికాసము చక్కగా బోధపడునట్లు సాధనముగా రచియించిన యింకొన్ని వ్యాసములను కలియచేర్చి ఈ 'సాహిత్య సమాలోచన' మను గ్రంథము కూర్చబడినది. ఇందలి మూడు భాగములలో మొదటిభాగమునందలి సాహిత్యవిషయములు సిద్ధాంతరూపమైనవి; రెండవ భాగమున గ్రంథకర్త పదకవిత్వ, ప్రబంధవాఙ్మయ, రూపకవికాసాదులను గురించి చేసిన చక్కని పరిశీలనము కలదు. మూడవభాగమునందలి ఆంధ్ర సాహిత్యపరిణామ వ్యాస మొక యుత్కృష్టోపన్యాసము. ఇందు ఆంధ్రసాహిత్య పరిణామము దిఙ్మాత్రముగ సూచితమైనది. పూర్వోక్తవిషయముల ననుసరించి ఇది యొక యపూర్వగ్రంథ మనుటకు సందియము లేదు. ఈ 'సాహిత్యసమాలోచనము' వాస్తవమునకు లక్ష్యలక్షణసమన్వితమైన ఆంధ్ర సాహిత్యచరిత్ర యన్న అత్యుక్తి కాదు. ఆంధ్రసాహిత్య పఠనాభిలాషుల కుపయోగకరముగ నుండునట్లు ఏతద్గ్రంథాంతమున చేర్పబడిన గ్రంథ సూచిక ఈ గ్రంథోపయోగమును విలువను హెచ్చించుచున్నది. నేడిట్టి గ్రంథముల యావశ్యకత ఎక్కువగ గలదు. ప్రాచీనాంధ్రసాహిత్య పరిచయము గలవారిసంఖ్య నాటికినాడు క్షీణించుచున్నది. అందును మనప్రాచీన సాహిత్యసిద్ధాంతములను గురించియు, సంప్రదాయములను గురించియు దెలిసినవారు చాల కొద్దిమంది.

నేటి కాలపరిస్థితులకు దగినట్లు ఆంధ్రసాహిత్య రంగమునను ప్రస్తుతమున గొప్ప గాలిదుమారములు రేగుచున్నవి. సాహిత్యతత్వ, స్వభావ,

ప్రయోజనముల విషయమున ప్రశ్నలింకను నేడు వాద, ప్రతివాదములు సాగుచున్నవి. ఈ వాద ప్రతివాదములను పరిశీలించుచో ఈ ప్రశ్నలు నేడే పుట్టినవా? ఇంతవఱకు సాహిత్యమే లేదా? సాహిత్యసృష్టికి నేటినుండియే యారంభమా యనిపించుచున్నది.

ఒకవిధముగ జూచినయెడల మన తెలుగుసాహిత్యమున పునస్సృష్టికిపుడు మొదలనుట సత్యమే కావచ్చును. 'కావ్యం యశసే౽ర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే, సద్యఃపరనిర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే' అని వందలకొలది సంవత్సరములనుండి ప్రవచింపబడుచు వచ్చిన కావ్యప్రయోజన నిర్వచనము నిన్నటివఱకు పండితలోకమాదరించి గౌరవించినను ఆధునికులు కొందఱు అజ్ఞానమైననేమి, నిజజ్ఞానమైననేమి దీని నతిక్రమించి క్రొత్తనిర్వచనములను జేయుచు క్రొత్తసిద్ధాంతములను ప్రతిపాదించుచున్నారు. రాజకీయ, సాంఘిక, ఆర్థిక సిద్ధాంతములవలెనే ఇవియును నేటి సాహిత్యపరుల హృదయములలో కలకలమును రేపి సంఘమును కల్లోలపఱుచుచున్నవి. కవిత్వమన్న నేమి, ఎందుకు, ఎవరికొఱకు, కవితాప్రయోజనమేమి, ఎవరికొఱకు అను ప్రశ్నలు చాలచోట్ల నేడు తఱచుగ వినవచ్చుచున్నవి. ప్రాచీనులమీద నొకవిధమైన యసంతృప్తి, నవ్యసాహిత్యసృష్టికి ఒకవిధమైన తహతహ అట్లు ప్రశ్నించువారిలో ఒకప్పుడు కాకున్నమఱి వేఱొకప్పుడయినను గోచరింపకపోదు. ఈ ప్రశ్నలు అర్థహీనములైనవని త్రోసిపుచ్చుటకంటె వానిని సానుభూతితో నవబోధము చేసికొని వానికియవలసిన సమాధానములను గుఱించి మననము చేయుట శ్రేయస్కరమును, వివేకలక్షణమును. జాతీయజీవితమునకు సంబంధించిన ప్రతివిషయమునను తర్కవితర్కములకు లోనై ప్రశ్నార్థకముగ పరిణమించుచున్న యీ విషమకాలమున చారిత్రకముగ మన సాహిత్యపరిణామమును పరిశీలించినపుడు కాని సాహిత్యాంగమునందలి నేటి యలజడికి కారణము సుబోధము కాజాలదు

సాహిత్యము ప్రాచీనకాలమున ప్రధానముగ బ్రాహ్మణాధీనము. అధ్యయన, అధ్యాపనములు బ్రాహ్మణుల ప్రధానవృత్తులు. సాహిత్యస్రష్టలును వారే. అటువెనుక కొంతకాలమునకు గాని క్షత్రియులు సాహిత్యరంగమున బ్రవేశింపలేదు. మన యిప్పటి పురాణవాఙ్మయము ప్రధానముగ క్షత్రియోపజ్ఞమని ప్రాచ్యపరిశోధక పండితుల వాదము. క్షత్రియకులజులైన భూనేతలు, కావ్యనిర్మాతలుగను కవిపోషకులుగను వాసికెక్కినవా రనేకులు గలరు. వారెట్టి సాహిత్యమును సృష్టించినను అంతకుపూర్వము భారతలోకవ్యవహారమున నుండిన సాహిత్య ధర్మశాస్త్రముల నతిక్రమింపక గౌరవించి యనుసరించుచునే చేయుచు వచ్చిరి. వారది నేమశీలనగు న్యాయదేశపరివర్తితమైన సాంస్కృతికదృష్టి, ధార్మికదృష్టి. వేదవేదాంగవిదుడును, కవితల్లజుడు నైన బ్రాహ్మణునికి సంఘమునను సాహిత్యరంగమునను గూడ గౌరవోన్నతస్థానము నిచ్చి హిందూసామాజికు లితరవర్ణములవారుకూడ రాను రాను కేవలము కావ్యాధ్యయనమునకే కాదు, కావ్యసృష్టికి ఉపక్రమించి సాహిత్యసృష్టి సాగించిరి. ఇట్టిసృష్టి మనదేశమున అయిదారువందల సంవత్సరములకు పూర్వమే ప్రారంభమయినది. అయినను సాహిత్యరంగమున బ్రవేశించిన బ్రాహ్మణేతరుల సంఖ్య కడుపరిమితము. వారిసంఖ్య వ్రేళ్ళమీద నలెక్కపెట్టదగి యుండుటకు అప్పటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులే కారణము. ఇట్టివారిలో కావ్యరచనమునకు గడంగినవారిసంఖ్య మిక్కిలి స్వల్పము. ప్రాచీన లక్షణకర్తలును, ఆలంకారికులును చూపినత్రోవ ననుసరించి వీరును భారతీయ సాహిత్య సంప్రదాయానుగుణముగ కావ్యము లల్లినవారే. నేటికిని సనాతనులైన సాహితీపరుల సాహిత్యసిద్ధాంతములు నవే; కావ్యములు నట్టివే. అదొక పెద్ద రాచబాట పడిపోయినదేనాడో శతశతాబ్దులకు పూర్వము; కావ్యరచనాసక్తులైన కవులును, పండితులును నలిగి నట్టి మెట్టలేని ధూప్రాతరాచబాటను గతానుగతికముగ పోయినవారే; పోవుచున్నవారే. దానిని కడద్రొక్కి క్రొత్తసృష్టి గావించుటకు ప్రతిభావంతు లనేకులకు సమర్థతయు చాలదు; సాహసమును లేదు.

కాని కాలము మాఱినది. గడచిన రెండువందల యేండ్లుగ దేశకాల పరిస్థితులలో మార్పులనేకము వచ్చినవి. భారతీయులు స్వాతంత్ర్య విరహితులైనారు. పూర్వపు మన విద్యలనాదరించి పోషించు దేశీయప్రభువుల పరిపాలన మంతరించినది విజాతీయ ధర్మసంస్కృతి. సభ్యతలు గల బ్రిటీషు వారు మనకు ప్రభువులైనారు. మనము వారికి దాసుల మయినాము. మన విద్యాపద్ధతులు పూర్వమునకు నిప్పటికి మాఱినవి. ఉన్నత పాఠశాలలలోను, విశ్వవిద్యాలయములలోను గూడ విద్యనేర్పు భాష ఆంగ్లమైనది. ఆంగ్ల విద్యా వ్యాపనము హెచ్చినది. రాజభాష ఆంగ్లము. ఆంగ్లభాషాద్వారమున మనకు యూరోపీయ సాహిత్యములతో సన్నిహిత సంబంధము కలిగినది. భారతీయ విజ్ఞాన పేటికయైన సంస్కృతము ప్రచారమున లేకపోయినను సంస్కృతమునందున్న వేదశాస్త్ర కావ్యలక్షణ గ్రంథాదులు యూరోపీయ దేశభాషా గ్రంథములవలెనే ఆంగ్లమునకును పరివర్తితములై నేడున్నత విద్యాభ్యాసము చేయు నెల్లవర్ణములవారికి నందుబాటులోనికి వచ్చినవి. ఒక్క భారతీయ సంస్కృత విజ్ఞానము మాత్రమేకాక ప్రపంచమున వేఱువేఱు దేశములందలి యుత్తమ సాహిత్య విజ్ఞానములు సైతము సవర్ణ మావర్ణమనక ఉన్నతవిద్య నభ్యసించువారి కెల్లరకు లభించుచున్నది. పొగయోడ, ధూమశకటము, విమానము, రేడియో, వైర్లెస్ వచ్చి నేడు ప్రాత ప్రపంచమునకు, క్రొత్త ప్రపంచమునకు, ఖండములకు ఖండములకు, దేశములకు దేశములకు గల దూరమును గత్తిరించివైచి ఒండొంటిని మనయింటి ముంగిలికి, మన పట్టింటికి తెచ్చిపెట్టుచున్నవి. ప్రపంచమునం దేక్షణమున నెచ్చట మేధావులైన శాస్త్రవేత్త లే క్రొత్త విషయమును గనిపట్టినను క్రొత్త సిద్ధాంతము ప్రతిపాదించినను ప్రతిభావంతులైన సాహిత్య విశారదులు తమప్రజ్ఞ జూపి యే నూతన సాహిత్యరీతులు వెలయించినను, ఏ యపూర్వ గ్రంథము రచించినను మఱుసటిక్షణముననే వానిని వినగలుగుచున్నాము. తెలిసికొనగలుగుచున్నాము చదువగలుగుచున్నాము. దేశభాషలలోనికి శాస్త్రవిజ్ఞానము, ఈ యుత్తమకావ్యవిజ్ఞానము అనూదితమై పత్రికలద్వారా రేడియోద్వారా, గ్రంథములద్వారా జనులకు లభించుచుండుటచేత నేడు కావ్యరచనాధురీణు డొక్కడేకాదు, విద్యాధికు డొక్కడేకాదు, సామాన్య మానవుడుకూడ నఖిలప్రపంచ సంబంధి యగుచున్నాడు. ప్రపంచమున నే

మాయిమూల ప్రచలితములగుచున్న భావములైనను సరే, సిద్ధాంతములైనను సరే, అతనిహృదయము నుద్రేకపఱచుచున్నవి; అతనిమనసులో నూతనభావములను ప్రేరేపుచున్నవి. అతడు అమెరికా సాహిత్యమునందలి క్రొత్తపోకడలను గమనింపగలుగుచున్నాడు. జర్మని సాహిత్యమునందలి జగుబిగులు పరిశీలింపగలుగుచున్నాడు. బ్రిటను, ఫ్రాన్సు, రష్యా దేశములలో బుట్టిన మహాకావ్యములను, నాటకములను జదివి యానందించుచున్నాడు; చైనా జపాను సాహిత్యములను విమర్శించుచున్నాడు; సంస్కృతము నేర్చికయే ప్రాచీనభారతీయ శాస్త్ర కావ్యకళా సిద్ధాంతములను పరామర్శించుకొనుచున్నాడు; తనకు లభ్యమగుచున్న అఖిల ప్రపంచ విజ్ఞానజన్యమగు నూతన దృష్టితో తన పూర్వపు సాహిత్యమును, సాహిత్యరీతులను, సంఘమును, ఆచారములను—సమస్తమును అన్వేషణజ్యోతిని వెలిగించి గుణదోష పరిశీలనము చేసికొనుచున్నాడు. అతనిస్థానము నేడొక్క యాంధ్రదేశమున కాదు, ఒక్క భారతదేశమున నేకాదు. సమస్త విశ్వమానవ ప్రపంచమునను కులములను కులములను, సంఘములను సంఘములను, జాతులను జాతులను మధ్యగల కృత్రిమావరణములు, నడుగోడలు, నడ్డంకులు నన్నియు క్రమముగా సడలిపోయి 'విరిగిపోయి అతని దృష్టి ప్రసారరంగము అత్యధికముగ విస్తరిల్లి అందుచేతను నేడు విశ్వమానవ కుటుంబమున నొక్కడై తత్కుటుంబ కష్టసుఖములలో సమభాగి యగుచున్నాడు. నేడు ప్రపంచమునందలి వేలువేలు జాతులన్నియు గలసి, ఏకైక మానవసంఘముగ ముడివడి యొక్కమూసలో, నొక్కపోతలో నైక్యమై భజించుచు క్రొత్త తీర్పులకు, క్రొత్త మార్పులకు లోనయి ఒక మహావిశిష్ట మానవకుటుంబముగ పరిణమించుచున్నవి. వివిధ జాతుల సాహిత్యతరంగిణులు లొకదాని నొకటి యొరసికొని ప్రవహించుచు, విశ్వమానవ సాహిత్యసాగరమునకు బాటలు దిగ్గుచున్నవి. నూతన ప్రపంచ శక్తి తరంగడోలికల నూయెలలూగుచు నాతనిహృదయ ముద్రిక్తమై విభ్రమము నొందుచున్నది. జాతీయ జీవనమునకు సంబంధించిన ప్రతివిషయము నూతనవిజ్ఞానబల ప్రాభవ వైభవమున రచ్చపడుచున్న యాతనికి ప్రశ్నార్థకముగనే కన్పట్టుచున్నది. జాతీయమా విజాతీయమా, సనాతనమా అధునాతనమా, వైయక్తికమా సాంఘికమా, ప్రాచీనాదర్శమా నవీనాదర్శమా—అంతయు సందేహమే. అంతయు ననుమానమే. ఈ ప్రశ్నములు విమర్శ జిజ్ఞాసాజన్య

ములు. ఎటుకయే విజ్ఞానము విజ్ఞానమే శక్తి. ఈ విమర్శను, ఈ జిజ్ఞాసను, ఈ విజ్ఞానబలమును కాదని త్రోసిపేయుట శక్యమా, యుక్తమా?

నేటిదొక గొప్ప కలబోత, మహాసాంకర్యము. మన ప్రాచీన ఆచారములు మాఱినవి, అభ్యాసములు మాఱినవి, మతవిశ్వాసములు మాఱుచున్నవి, సంఘము మాఱుచున్నది. నూతన భౌతికశాస్త్ర విజ్ఞానాభివృద్ధితో సమస్తమును మాఱుచున్నది. అందునను విప్లవకరమైన మార్పు నేడు కాలస్వభావమే మార్పు ప్రపంచము మారుచున్నది. మనమిపుడు ఒక క్రొత్త ప్రపంచము వీధివాకిట నున్నాము. నూతనప్రపంచ జీవితమున కనువుగ మన సమస్తమును సరదిద్దుకొనవలసిన యావశ్యకత కలదు. అట్లే మనసాహిత్యమునను, సాంఘిక ధర్మాదర్శములందును. అందువలననే నేడు సాహిత్యప్రయోజనమునుగుఱించి సాహిత్యభావమునుగుఱించి, ఇంకననేక విషయములనుగుఱించి గాలిదుమారములు రేగుచున్నవి.

మనజీవితమునకు సంబంధించిన ఇతర రంగములందువలెనే మనసాహిత్యరంగమునను అరాజకము ప్రబలినది; పూర్వపు సిద్ధాంతములు, ప్రాచీనసూత్రములు పనికిరావు; అవలంబనీయములైన నూతనసిద్ధాంతములేవో, నూతన సాహిత్యసర్గములేవో తెలియరావు; పూర్వపువన్నియు శిథిలములైనవి; నూతననిర్మాణ సూత్రములుకాని పథకముకాని విశదముగ గోచరించుటలేదు. నేటి ఆంధ్రసాహిత్య స్వరూపమిది; దానిలో యువజనుల ఉద్రేకహృదయముల లోని భావములు తొణికిసలాడుచున్నవి. నూతన సాహిత్యరచనా ప్రయత్నమున క్రొత్త తీర్పులు తీర్పవలెనని క్రొత్త పోకడలు పోవలెనని రచయితల యుత్కంఠ కానవచ్చుచున్నది. నూతన విజ్ఞానబలమున క్రొత్త సాంఘిక ధర్మసూత్రములను చేయవలెనని రచయితలకుగల కుతూహలమును గోచరించుచున్నది. అయినను ఒక్కటి చెప్పకతీరదు. నేడు తెలుగురచనలు చేయువారిలో అనేకులు ప్రాచీన ఆంధ్రసాహిత్యపు తీరు తెన్నులెరుగని వట్టి యుత్సాహపరులే. ఎంతటి ప్రపంచవిజ్ఞాన సంపన్నులమైనను మనము ఆంధ్రులమే. విజ్ఞానమెక్కుడయినను మన జాతియు మాఱదు; భాషయు మాఱదు. నేటినుండియే మనసాహిత్యము ప్రారంభము కాదు. మనకు సహస్రాబ్దుల కిరబడిగ వచ్చు సంస్కృతియు గలదు, చరిత్రమునుగలదు. ఈ సంప్రదాయములను,

సాహిత్య, శాస్త్రములను మనము చక్కగ దెలిసికొని చేసిన వాడుకాని నూతనసృష్టికి బలము, తేజము, ప్రాభవము ఉండదు. నూతనకావ్యరచన చేయువానికి ప్రాచీనసాహిత్య సంప్రదాయజ్ఞాన మత్యంతావశ్యకము. తెలుగునుడికారము, పలుకులపొందిక, శబ్దముల స్నేహావిరోధములు, రీతులసొగసు, శయ్యలసొంపు — ఈ మొదలగునవి తెలిసినవాడుకాని కావ్యరచనాకౌశలము దొరకదు; నూతననిర్మాణదక్షత కుదురదు. పద్యములల్లుట కవిత్వముకానట్లే జిగి బిగి లేని పట్టి కుప్పపదములకూర్పు సాహిత్యము కానేరదు. నేడు వెలువడు మనకావ్యములు పెక్కింట ఛందఃప్రస్తారపుకూర్పులును, పదములతీర్పులునున్నవి కాని కవితాగుణము, శిల్పము, రసస్నిగ్ధత లేదు.

ఉత్తమకావ్యము ఉత్కృష్టమైన కళారచన. అది సార్వజనీనక, సార్వకాలిక ధర్మవిశిష్టమయినది. అందువలననే ఉత్తమకావ్యములు వందలకొలది యేండ్లక్రింద విరచింపబడినను అవి నేటికిని నవ్యనూతనములై మనలనలరించి మనకానందమును గూర్చుచున్నవి. ఏదేశమునందలి యుత్తమకావ్యమయినను మనభాషలోని కనూదితమై వచ్చినపుడు అది దేశ, జాతి, మత విభేదముల కతీతమై మన కానందపారవశ్యమును గలిగించుచున్నది. ఏదేశమునగాని, ఏకాలమునగాని ఉత్తమసాహిత్యధర్మ మిట్టిదే. ఈదృష్టితో జూచినపు డుత్తమసాహిత్యమునకు ప్రాచీన, నవీన భేదములును లేవు. స్వజాతి, విజాతి భేదములును లేవు. అట్టియుత్తమ సాహిత్యసృష్టియే పరమలక్ష్యముగ నుండవలెను. నవ్యసాహిత్యప్రయత్నము లట్టియుత్తమ సాహిత్యసృష్టికి దారితీయగలవనియే నాయాశ. హృదయము విశాలమై, విజ్ఞానసంభరితమై పరిపక్వస్థితిపొందిన కళానిపుణు డెప్పటికైన నట్టికావ్యసృష్టిలో సిద్ధినందగలడు.

నూతన సాహిత్యసృష్టికి గడంగుచున్న ఆంధ్రయువకులకు ప్రాచీన సాహిత్య సంప్రదాయరీతులను దెలిపి శ్రీ పిల్లలమర్రి వెంకట హనుమంతరావుగారి 'సాహిత్య సమాలోచనము' ఉపకారకము కాగలదని నాతలంపు. శ్రీ హనుమంతరావుగారు ఇంకను అనేకగ్రంథములను రచియించి సాహిత్యకృషిచేసి యశస్సు సముపార్జింతురుగాక యని కోరుచున్నాను

శ్రీ పుల్లంపల్లి సోమశేఖర శర్మ.

విషయానుక్రమణిక

మొదటి భాగము : సూత్ర గ్రథనము

సాహిత్యోద్దేశము	1
భావార్థములు	7
కవి - సమాజము	17
విమర్శకుడు - కళోపాసకుడు	24
కవి - చిత్రకారుడు	35

రెండవ భాగము : వికాసము

• పద కవిత్వము	43
ప్రబంధ వాఙ్మయము	56
*వచన స్వరూపము	
౧ సూత్రగ్రథనము	68
౨ అన్వయము	86
అభినవ కవిత	108
రూపక వికాసము ౧	131
" " ౨	142

మూడవ భాగము : అర్చనము

సాహిత్య పరిణామము	150
సాహిత్యార్చనము	167
అనుబంధము	175

• సాహితీ సమితి రజతోత్సవ సభలో చదివిన వ్యాసము.

* హైదరాబాదాంధ్ర సాహిత్యపరిషత్ప్రథమ సమావేశములో చదివినది.

కొన్ని సవరణలు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
7	8	కావ్యేషువా	కావ్యేవా
27	5	thy be not	thou be
34	18	వర్ణ్యకము	వర్ణ్యకులు
37	11	కావ్యైకస్థ	కాదివ్యవస్థ
47	2	పూఫల	పుష్పఫల
47	4	కేరికా	కారికా
65	5	లోనె	లోనె
66	22	నుంచిన	చూచిన
68	7	గద్యాత్మకమనియు	గద్యాత్మకమనియు పద్యాత్మకమనియు
73	10	వణలెను	వరలవలెను
76	7	వదలినది	వరలినది
84	12	మిడ	మిటు
111	18	సాక్షిక	పాక్షిక
127	2	రాణించు	క్షీణించు
128	19	సార్థక్య	పార్థక్య
133	7	చాటించు	ఛాటించు
133	11	సత్ఛ్రా	సతచ్ఛా
135	7	దృశ్య	శ్రవ్య
136	19	నాగర	అనాగర
141	6	కరుణము	కరుణకము
143	8	నాటకమయు	నాటకీయ
143	9	ధర్మ	ఆదర్శ
167	19	సహిత్య	సహితస్య
169	8	సాధువుల	సాధుత్వముల
169	24	expresses complete	expressed by them

మొదటి భాగము

[సూత్ర గ్రథనము]

సాహిత్యోద్దేశము

○

లోకవ్యవహారములో సాహిత్యము - సారస్వతము- వాఙ్మయము- అను పదములు సమానార్థకపదములుగా ద్రష్టవ్యమగుచున్నవి. కాని యీమూడు పదములు లక్ష్యములో నంతరము కలవిగా పరీక్షపై తెలిసికొనగల్గుదుము. సాహిత్యమనునది దేశకాలపరిమితముగాక, సర్వకాల సర్వజనీనముగానుండి విశ్వశ్రేయస్సునుగోరి నిర్మింపబడిన కావ్యసంచయమునకు చెందును. సారస్వతమనునది యక్షర రూపమైన సకల విద్యా శాస్త్ర కళాదులకు వర్తించును. వాఙ్మయమనగా వాక్కుయొక్క వికారము; అనగా లిఖితసంభాషణాది సమస్త వాగ్వ్యవహారమునకును వాఙ్మయమనుపదము చెల్లును. ఇది సర్వసాధారణమైన పదము. సాహిత్యము- సారస్వతము- వాఙ్మయము: ఇవి యుత్తరోత్తర విశాలములైనవి. ఈ మూడు నొకే కేంద్రముగల మూడు వలయములవంటివి. సాహిత్యము పరిమిత వలయము; దీనిని సారస్వత వలయము చుట్టినది; ఈ రెంటిని చుట్టినది వాఙ్మయవలయము. సాహిత్యమును, సారస్వతమును వాఙ్మయమని పిలువవచ్చును. కాని సారస్వత వాఙ్మయములనునవి సాహిత్యమునకు వర్తింపవు.

ఇక ఉద్దేశమను పదము: ప్రతివస్తువునకు కార్యకారణ భావమున్నది. ఘటమునకు మృత్తిక కారణము; అట్టే మాన

సిక సంబద్ధ విషయములకును. మానవు డేకార్యము నిర్వహించినను వెనుక నొక యాలోచన యుండితీరును. ఈ యాలోచనమునే యుద్దేశమని, కారణమని యననగును. ఇది పునాది వంటిది. ఒక యుద్దేశమును పురస్కరించుకొని మానవుడొక కార్యము నిర్వహించును. అతడాశించిన యాయుద్దేశముపరిణామఫలముగా తిరిగి ప్రతిఫలించును. ఉద్దేశము- కార్యము- పరిణామము; ఇది క్రమము. వీనిలో నుద్దేశము లోపించినను పరిణామపరిశీలనముచే దానిని గుర్తింపవచ్చును. కాని కార్యమునుబట్టి దాని నెఱుగవచ్చును. ఇవ్విధముగా నుద్దేశ కార్య పరిణామము లన్యోన్యాశ్రయములు.

కాగా, సాహిత్యోద్దేశ మిపుడు ప్రసక్తము. సాహిత్యము 'సత్యం, శివం, సుందరం' అను పరమాశయముల నిమిడ్చికొనినది. సాహిత్యమునకు కవి - విమర్శకులు ప్రవక్తలు. సౌందర్య ద్రష్టయు స్రష్టయు కవి. దీననే యాతని 'కవిబ్రహ్మ' యనినారు. విమర్శకు డేతద్వ్యాఖ్యాత. సాహిత్యమొక మధుర దర్శనము. తదితర దర్శనముల నవలోకించుటకెంతటి యధికారము వలయునో సాహిత్యదర్శనమున సాక్షాత్కారమున కంతటి యధికారము వలసియున్నది. సహృదయత్వము, రసజ్ఞత, వ్యుత్పన్నత సాహిత్యారాధనమున కుపకరణములు.

సహృదయత్వ మనగా హృదయము కలిగియుండుట యని సామాన్యార్థము. ప్రతివానికి హృదయ మున్నది; కాని యది యున్నటుల తెలియువాడే సహృదయుడు. అనగా

'నాత్మ వేదనోన్ముఖమైన యంతరంగము' కలవాడు. సహాను భూతికముగా, నిష్కళంకముగా సానుభూతితో నాయా వాతావరణములయందు సంచరింపగలిగి యాయా పాత్రలనుగాని, విషయములనుగాని యవలోకించి తత్తదనుగుణముగా స్పందించు హృదయము కల్గియుండుట.

రసజ్ఞత యనగా రసము నెఱుగుట యని వాచ్యార్థము. అనగా విభావానుభావ సాత్త్విక వ్యభిచారీభావ సంయోగ ఫలితముగా పర్యవసించు రసస్వరూపమును దెలియుట. విభావాదికముల నెఱుగకయే యాయా భావములకు తత్తదనుగుణముగా సంచలనము పొందువారును రసజ్ఞులే. లక్షణాదికము నెఱిగియు రసజ్ఞులు కానివా రున్నారు.

ఇక వ్యుత్పన్నత యనగా లోకశాస్త్రానుభవముతో కూడిన పాండితి. పరిజ్ఞానము సమకూర్చుకొనుటలో దేశాటనము, బహుకావ్యపఠనము, సంప్రదాయజ్ఞులైన మహాత్ముల సాంగత్యము మున్నగునవి తోడ్పడవలెను. ఇన్నిటితో నుదయించిన సంస్కారమే వ్యుత్పన్నత యగును. ఇన్ని కల్గియు సంస్కారము పొందనివా రున్నారు.

✓ఈ యుపకరణములతోడనే సాహిత్యారాధనకు పూనుకొనవలెను. అప్పుడే సాహిత్యోద్దేశమును గ్రహింపవచ్చును.✓ ఎంతవరకీ యుపకరణములు లేక పరిశీలించుచుందుమో యంతవరకు సాహిత్యోద్దేశము ప్రశ్నారూపముననే యుండి యనేక యపోహలకు తావిచ్చును. నేడు లోకమున వ్యవహరింపబడుచున్న సాహిత్య మనునట్టిదిగాని,

సాహిత్యోద్దేశ మనునట్టిదిగాని నిత్యమైన సాహిత్యపదములు గావు. సార్వజనీన, సార్వకాలీనత లందు మృగ్యము.

సాహిత్యోద్దేశ మన్ని కాలములందును, అన్ని దేశ ములందు నొకటే యయియుండును. జీవితోద్దేశ మెట్లు బ్రహ్మానందానుభవమో, అట్లే సాహిత్యోద్దేశము సైతము బ్రహ్మానంద సహోదరమగు రసానందానుభవ మగును. 'రసో వై సః' అను శ్రుతివాక్యము జీవితమునకు, సాహిత్యము నకు చెందినది. ఋషిప్రోక్తమైన వాక్యము బ్రహ్మానంద సాధకులకు ప్రమాణము. రసానంద పిపాసులకు కవివాక్య మట్లే ప్రమాణము. కవి ఋషితుల్యుడు. కావుననే 'నానృషిః కురుతే కావ్యం' అనినారు.

మోక్షగాముల కెట్లనేక పథము లనుగమ్యమానములై ప్రతీయమానము లగుచున్నవో యట్లే సాహితీదర్శనాలక్ష్య మును గడించుట కనేక మార్గము లాయాయుగములలో ననుగమ్యమానములైనవి. ఆయా మార్గములే యాయా కాలానుగుణముగ నుద్భవించినయుద్యమములపరిణామములు.

వైదిక వాఙ్మయముయొక్క గహనతయే పురాణ గ్రంథరచనోద్యమమునకు హేతువు. శైవ వైష్ణవ సంఘర్ష ణమే వీరశైవవైష్ణవోద్యమములకు కారణము. అనుకరణ బాహుళ్యమే స్వతంత్రరచనోద్యమమగు ప్రబంధప్రక్రియకు దారితీసినది. కర్మసిద్ధాంతాచరణాశక్తతే భక్తిమార్గావలంబ నమునకు కారణము. ప్రాచ్యసాహిత్యసూత్రములపై ప్రత్య యము లేకపోవుటవలననేమి, కాలాభావమువలన నేమి

సామాన్యజనుల కందుబాటులో సాహిత్యము నుంచవలెనను ఉద్దేశమే నవ్యసాహిత్యోద్యమమునకు మూలము. ఈ విధముగా నుద్యమములు బయలుదేర సాహిత్యము ననేక గతుల నడిపినవి.

ప్రాచీన లాక్షణికుల సాహిత్యోద్దేశమును గమనింతము. సప్తసంతానములలో కావ్యము శాశ్వతమైనది. 'విశ్వశ్రేయః కావ్యం' అనినారు. అనగా సార్వజనీనత యుండవలెనని సూచ్యార్థము. 'వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే' అనుటలో విశ్వశ్రేయ స్సెట్లు కలుగవచ్చునో లక్షీకరించినాడు! కావ్యాత్మ మీమాంస యొనరించి లాక్షణికులు రసానందానుభవమునకు కావ్యమందలి వివిధాంశలను పృథక్కరించినారు. అవే రస, అలంకార, గుణ, రీతి, ధ్వని, వక్రోక్తి, అనుమాన, ఔచితులు. లక్ష్యమొక్కటే. నాటికినేటికి దానిని సమీపించు మార్గములు మాత్రము భిన్నములు.

జీవిత లక్ష్యమును సాధించుటకు కర్మ, జ్ఞాన, భక్తి మార్గము లుద్దేశింపబడినవి. ఆత్మానందమే పరమోత్కృష్టమైన జీవితధర్మము. తదానంద సంధానమునకే యీ మార్గములు. సాహిత్య మీ త్రిమార్గాశ్రయము. ప్రభు, సుహృ,త్కాంతాసమ్మితములని లాక్షణికుడు వ్యపదేశించినాడు. వేదములు కర్మను విధించునవి. పురాణములు ధర్మపథముల నడచినవారిని గూర్చి నివేదించి, కర్తవ్య ధర్మముల నిరూపించి, ఫలాపేక్షలో మనుజునికి నుత్సాహము కల్పించునవి.

కావ్యము లోకమును మరపించి మురిపించునది. అది కాంత వాక్కువలె సున్నితముగ, సుకుమారముగ, లలితముగ, వ్యంగ్యమాత్రవిలసనముతో సంస్కరించునది.

సాహిత్యము సౌందర్యమూర్తి. సౌందర్యావిష్కరణాస్వాదనములు సహృదయ వేద్యములు. సాహిత్యోపాసనమే యీశ్వరోపాసనము. ఇదే సౌందర్యోపాసనము. రససిద్ధి లేక సౌందర్యసాక్షాత్కారమే ఫలము. ఇయ్యది యలౌకికానందస్వరూపము. అతీంద్రియమైనది. ఇట్టి యానందమును సశరీరముగ ననుభవింపదగినది.

సాహిత్యము రాజసతామసవృత్తులను లీనమొనరించి శుద్ధసత్వమును ప్రకాశింప జేసి తద్వారా సౌందర్యాలోకనమున కర్హత నిచ్చునది. సాహిత్యము నిరంతర భావనావిశేషముచే పరబ్రహ్మానంద సహోదరమగు నానందము నాస్వాదింప జేయునది. నిత్యచైతన్యము గలిగినట్టి, శుభప్రదమైనట్టి రసానుభవమును కల్గించి మనోనేత్రమునకు దివ్యసాక్షాత్కారము కల్గించునది సాహిత్యము.

ఇట్టి పరమోత్కృష్ట ఉద్దేశము గలది సాహిత్యము. అందుచేతనే యిది మధురదర్శనమైనది.

O

[6-6-44 తేదీన హైద్రాబాదు రేడియోనిలయమునుండి ప్రసారితము]

మాటలలో భావార్థములు

ఇద మంధం తమః కృత్స్నం జాయేత భువనత్రయమ్
యది శబ్దాహ్వయం జ్యోతి రా సంసారం న దీప్యతే.

అని శబ్దమునుగూర్చి లాక్షణికుడైన దండి వచనము. శబ్ద మను జ్యోతి లేకున్న నంధతమస్సులతో ముల్లోకములు నిండి యుండెడివని శ్లోకార్థము. శబ్దమున కంతటి విలువయున్నది. నాదప్రతిమార్థములని శబ్దము త్రిగుణాత్మకమైనది.

భావః కవేరభిప్రాయః కావ్యేషు వా సిద్ధ సంస్థితః అని భావమునుగూర్చి యాతని నిర్వచనమే. కావ్యగతమైన కవి యభిప్రాయము భావ మని నుడివినాడు. భావ మను పద మనేక పదార్థములకు చెందుచున్నది. స్థితి, మత, తాత్పర్య, ఇంగితాది వివిధావస్థల కీపదము వర్తిలుచున్నది. ఇట్లే యర్థ మను పదము హేతు, ఇచ్ఛ, ప్రయోజన, ఆకూతాది వివిధావస్థలకు సరిపోవుచున్నది.

కాగా, భావార్థములు శబ్దము నాశ్రయించినవి. శబ్దము లేనిదే యర్థము లేదు; భావ మంతకన్నను లేదు. అట్లే భావము లేక శబ్దమునకు స్థితి లేదు; అర్థము కాకపోయిన భావము స్ఫురింపదు. ఇవ్విధముగా శబ్దార్థభావము లన్యోన్యాశ్రయములు. శబ్దార్థములు ప్రకృతిపురుష సంబంధము కలవిగా కవి కాళిదాసుని సూక్తి.

కాని భావార్థముల కంతర మున్నట్లు సూక్ష్మపరిశీలనమువలన దెలియును. అర్థము శబ్దగతము; అది శబ్దము నర్థించిన వచ్చునది. శబ్దము భాషాశాస్త్రసంబంధి కనుక నర్థము భాషాతత్త్వముమీద నాధారపడినది. అర్థజ్ఞానమునం దధికారము గలవానిని పండితుడందురు.

భావ మనగా నర్థమే కాక యర్థాంతరముకూడ. ఇది సందర్భపురస్కృతము. మానవుడు తాను భావించిన యంశమును పదజాలముద్వారా యందించును. ఒక్కొక్కప్పుడాతని భావమును సంపూర్ణముగా నాపదములు వ్యక్తీకరింపకుండుట యనుభవసిద్ధము. భావము పదములను నిమిత్తముగా గైకొని సందర్భమును స్మరింపజేయుచు విహరించునది. సందర్భశుద్ధి, సన్నివేశ ప్రాధాన్యము, పాత్రముల పౌర్వాపర్యములు, శబ్దార్థములతో సమన్వయించుకొని సమూహన విచారించినపుడు వచ్చు విశేషము భావము. భావమునకు పదము కేంద్రము వంటిది. సందర్భాదిగుణములు వర్తులములవంటివి. ఉదాహరణమునకు భారత సభాపర్వములో భీష్ముడు ధర్మజునితో శిశుపాలునిగూర్చి యనిన వచనము నారయుడు :

“పాలిత దుర్ణయుండు శిశుపాలుడు బాలుడు వీనివేల భూ
పాలక నీకుఁ బట్టినయుపక్ష మఱి ధర్మ మెఱుంగ వీక్షిం
బోలునె రాగకోప పరిభూత మనస్కున కల్పరాజ్య ల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్త మహాత్పరివాదశీలికి౯.

సాహిత్య

అచ్యుతు నర్చితు జేయగా శిశుపాలుడు ధర్మరాజు నాక్షేపించుట, అందులకు ప్రియవచనములతో శిశుపాలుని ధర్మరాజు డనునయించుటలు తెలియవలయును. పిమ్మటగాని భీష్ముని వచన మన్వయము కాదు. పద్యములో 'శిశుపాలుడు బాలుడు' అనినపుడు శిశుపాలు డమాయకు డనియు, అల్పు డనియు, సదసద్వివేకజ్ఞానశూన్యు డనియు నర్థాంతరమగు భావము 'నీవు' అనినపుడు, సర్వధర్మకోవిదుడు, నీతి విచక్షణుడు, న్యాయపరిపాలకుడు నగు సంతతికి గొప్పవాడైన ధర్మరాజునకు-అని భావము. అంత ఉదాత్తగుణపూర్ణుని కింత యవినీతిపరునితో మాటలతో నిమిత్తమేమి? అని అన్వయము. తుది రెండు పాదములకు-ఎంత విశదీకరించినను ధర్మపరిశీలనాశక్తి యట్టి నీచున కలవడునా యనియు, ఏల యీ కాలయాపన మనియు భావము. ఈవిధముగా భావ మర్థాంతరము.

భావము హృదయగతము. కవి హృదయము సహృదయుడైన రసజ్ఞునకే వేద్యము. కవి హృదయసదృశమైన హృదయము కలవాడు సహృదయుడు. కావున భావము సాహిత్యతత్త్వముపై నాధారపడినది. ఉత్తమభావాధికారము కలిగినవానిని సాహితీపరు డందుము.

కవి భావించినది భావమని తెలిసికొంటిమి. భావించుట యనగా నిరంతరాలోచనముచే సాధితమైన ఒకానొక క్రియావిశేషము. 'ఆత్మతో సంభాషించుటయే భావించుట' యని యొక పాశ్చాత్యుని నిర్వచనము. కవి యాలోచనముచే

మథించి, గ్రహించి దర్శించిన యొక రసమయ గోళము భావము. మహోన్నతభావము లన్నియు హృదయాంతరాళములనుండి ప్రవహించును. హృదయమార్ద్రితమై, రసగ్రహణ గుణసమన్వితమై, నిగ్గును దేల్చు సున్నితయంత్రమై వర్తిల్లును. సమస్త కలుషములు హృదయములో స్వచ్ఛఫలకమందువలె ప్రతిఫలింపగలవు. సుసంస్కృతమై, శ్రేయోదాయకమై, సమగ్రమై, సుందరమై, సత్యమై భావము పరిష్కృతమగుట హృదయమందే.

ఇక నర్థములు మువ్విధములుగా లాక్షణికులు నిరూపించిరి. శబ్దమునకున్న అభిధ, లక్షణ, వ్యంజన వృత్తులను పురస్కరించుకొని వచ్చునవే వాచ్య, లక్ష్య, వ్యంగ్యార్థములు. వాచ్యార్థ మనగా శబ్దము నర్థించినపుడు సూటిగా వచ్చు అర్థము. శబ్ద మర్థమున కుపలక్షకము. శబ్దోచ్చారణము వలన తద్గతమైన వాచ్యార్థము మన కొక వస్తువిశేషము నెదుట సాక్షాత్కరించును. ఉదాహరణమునకు 'గోవు' అనినంతనే శబ్దమునకున్న ప్రతిమాగుణము ద్యోతకమగును గదా! ఇట్టిదే వాచ్యార్థము.

వాచ్యార్థము నతిక్రమించి, యామద్భిన్నమైన అర్థమును ప్రసాదించునది లక్ష్యార్థము. ఉదాహరణమునకు 'మీరు వెళ్లు మార్గములో చెఱువున్నది' అనినపుడు మార్గ మధ్యప్రదేశములో గమన నిరోధము కల్గించుచు చెఱు వున్నట్లు వాచ్యార్థము. 'మార్గములో' ననగా 'మార్గము ప్రక్కన' యనిగదా వక్తృభిప్రాయము! ఇట్టిదే లక్ష్యార్థము.

 సాహిత్య

వాచ్యార్థములవల సూటిగానుండక, లక్ష్యార్థము నటె సామాన్యముగాక, వాచ్యార్థమునకు వ్యతిరేకార్థ స్ఫురణము కలిగించునది వ్యంగ్యార్థము. ఉదాహరణమునకు కళాపూర్ణోదయములో సుగాత్రికి సఖు లుపాయములు జెప్పు సందర్భములో—

'దంపతు లిపుడును వివేకు లేను చెప్ప'

అను పాదములో 'వివేకు' లనగా 'అవివేకు' లనిగదా సఖుల యుద్దేశము! ఇదే వ్యంగ్యార్థము. ఈ వ్యంగ్యముందే భావ సౌకుమార్యమును గమనించుటకు గాని, నిశితబోధనా విధానమనుగమించుటకుగాని శక్తియున్నట్లు కనిపెట్టి కాబోలు దీనికి కావ్యమునందు ప్రాధాన్య మిచ్చినారు లాక్షణికులు.

ఇట్లే భావ మను పదమునుగూడ నానారీతుల లాక్షణికులు ప్రయోగించినారు. వ్యాకరణములో భావ మనగా ధాత్వర్థము. రసప్రకరణములో విభావ, అనుభావ, సాత్త్విక వ్యభిచారభావము లని కన్పించుచున్నవి. ఇవి యన్నియు పరస్పర భిన్నము లనియు, నన్నియు క్రమావస్థల కుపకరించుననియు, తుదకు రసములో పర్యవసించుననియు తెలియును. ఈ రసభావమునకే లాక్షణికులు గౌరవమిచ్చినారు.

ఈ విధముగా భావార్థముల కన్యోన్య సంబంధము, సూక్ష్మాతిసూక్ష్మమైన యంతరములు గలవు. మాటల నాశ్రయించినవి యర్థభావములు. మాటలలోని యింద్రజాలమనినపుడు కారణము కన్పింపక ఫల మభివ్యక్తమైనట్లు తత్ఫలముగా చక్కిలిగింత కలుగుచున్న ట్లభిప్రాయము.

ఇంద్రజాలములో ఫల మభివ్యక్తమగునుగాని కారణజాతము బుద్ధి కందదు.

మాటల యింద్రజాలము మాటలలోనే లేదు. వాని ప్రయోగములోనున్న వైవిధ్యములో, సామర్థ్యములో, వైచిత్రిలో నున్నట్లు గమనింతుము. ఆయామాటలకు వాని ప్రత్యేకత యుండనే యున్నది. వేని యర్థము వానిదే. మాటల ఇంద్రజాలము కవిత్వమునకు చెందినదే కాని సుష్ఠుమగు వచనమునకు దాని నాపాదించిన దాని గతి కస్తూరిగిలి నట్లగును. నిత్య వ్యవహారములో మాటల యింద్రజాలము కల్పించినచో నది కవిత్వసంబంధమే యగును.

శ్రవణపేయముగా కొన్ని మాటల కూర్పులుండును. 'కీర్తన పాత్ర చిత్ర మృదుగీత కలాకలన ప్రవీణతన్' అని నపుడు రేఫ పౌనఃపున్యమును, 'చెందొవ విందు మందువలె జిందు రుచిందగ' అనినపుడు బిందుపూర్వక దకార పౌనఃపున్యమును శ్రవణానందమును కలుగజేసినవి. ఇట్టివానినే గుణాలంకారములక్రింద పరిగణించినారు లాక్షణికులు.

కాలగతిలో పడి శబ్దము స్వరూపములోను, నాదములోను, అర్థములోను మార్పు చెందుచుండును. ఆచారవ్యవహారముల కనుగుణముగా శబ్దములు పూర్వ మెన్నెన్నో యర్థములలో ప్రయోగింపబడినవి. కాలపరిణామములో నవి కొన్ని యర్థములలోనే రూఢి చెందినవి. చీర యను శబ్దము సామాన్య వస్త్ర విశేష మను అర్థమునుండి స్త్రీ ధరించు వస్త్రవిశేషములో, 'కైంకర్య' మను పదము 'స్వామి సేవ'

యను అర్థమునుండి 'సంగ్రహించుట' యనుదానిలో 'కంపు' అను మాట 'గంధ'మను అర్థమునుండి దుర్గంధ మనుదానిలో రూఢ మగుచున్నవి.

శబ్దస్వరూపము తెలియనివారిచేగాని, విద్యాగంధము లేనివారిచేగాని ఉచ్చరింపబడి కొన్ని శబ్దములు నాదమును గోల్పోవుచుండును. 'నెల్లు' అనుటకు 'ఎల్లు' అనియు, 'గొప్పవారు' అనుటకు 'గొప్పోరు' అనియు, 'ఐన' అనుటకు 'ఏన' అనియు, 'ఏమది' అనుటకు 'ఏంది' అనియు పూర్వ నాదములను గోల్పోయి విన్పించుచుండును.

భిన్నప్రాంతములలో నొకే వస్తువును సూచించు పదములు భిన్నములుగా నున్నవి. 'తాళము' నకు 'కప్ప' 'పచ్చడి' కి 'తొక్కు' 'ఆగుట' కు 'సైసు' 'గురువుగారు' నకు 'అయ్యవారు' మున్నగు ప్రయోగము లిట్టివే.

వక్త్ర భావోద్వేగమును సూచించుట కుపయుక్తము లగు పదములు విచిత్రములుగా నుండును. 'మహాచెడ్డ యిష్టము' అనినపుడు 'మహాచెడ్డ' అను పదములు వ్యస్తార్థములలో నిష్ప్రయోజనములు. కేవల ముద్వేగము, ఇచ్ఛలో పరాకోటి తెలుపుటకు ప్రయోగింపబడినవే కాని వేరు ప్రయోజనము వానికి లేదు. లోకములో 'పడిచస్తాడు' అనినపుడు కావ్యములో 'ఈ వెడమాటల నను నేటికిఁ జంపెదరు' అనినపుడు 'చావు' అను శబ్దమునకు ద్వైవిధముగనే పృథక్త్వము సున్న.

శబ్దములు కొన్ని యితర శబ్దములతో కూడినపుడు వింతయైన నూతనార్థముల ప్రసాదించును. 'పిడత మొహము' అనినపుడు విఫలమనోరథుడై దైన్యదశను పొందినవాని ముఖ నైఖరి సూచింపబడినది. ఇట్టివే 'చట్టిముక్కు' 'ఏనుగుకాలు' 'మట్టిబుఱ్ఱ' మొదలైనవి. వీనిని క్రమముగా నలంకారముల క్రిందజేర్చినారు మన లాక్షణికులు.

ఇట నలంకారములగూర్చి స్వల్పముగా చెప్పవలెను. అలంకారములు, శబ్దార్థాలంకారము లని రెండు విధములు. శబ్దాలంకారములో నాదమునకు గౌరవము. అర్థాలంకారములో భావమునకు గౌరవము. కవి తన కుపలభ్యమానము లైన పదముల నన్నిటిని వివిధావస్థలలో సంఘటీకరించి తన మనోగతమైన యభిప్రాయము వ్యక్తీకరించును. ముందు మనవిచేసినట్లుగా నాతని భావమును సంపూర్ణముగా నందించుట కా పదములు సరిపోవు. అపు డాతి డలంకారముల చెంతకు బోవును. సాదృశ్యకల్పనము, ఇతర సన్నివేశ స్ఫురణము మున్నగునవి యాలంకారిక సామగ్రి. స్వీయానుభూతాంశమును తనతో సమానముగా, సమగ్రముగా, సహృదయ సాక్షాత్కారము కల్గించుటయే కవియొక్క నిరంతర సాధనము. కనుక భావవ్యక్తి కుపకరించునవే అర్థాలంకారములు. నాదవ్యక్తి కుపయోగపడునవి శబ్దాలంకారములు. రెంటికి పరమాశయ మానందసంధానమే. ఒకటి హృదయగోచరము. రెండవది శ్రవణగోచరము.

కావ్యమునకు ముఖ్యాంగము లనదగు భావ, వస్తురచనలలో రచనము శబ్దార్థసమన్వితమైనది. వస్తువు లోక కావ్యములలో సిద్ధమైనది. భావము కవి మనోగతమైనది. మానవుని కొక్కనికే జంతుకోటిలో భావనాశక్తియున్నది. ఇది యనంతము పెరిగిన కొలది, లోకకావ్యాది పరిశీలనము చేసిన కొలది యభివృద్ధిపొందుచు నైశిత్యము బడయుచుండును. ప్రతి మానవుని కభిప్రాయము లుండును. కాని బంగారము పుటములోవలె వాని నాలోచన మను అగ్నిగుండమున ప్రేల్చిన గాని భావములుగా పరిణమింపవు. ఆలోచనాశక్తికలిగి యనుభవము లేకపోయినచో గాలిలో కత్తిసాముచేయుట వంటి దగును. బుద్ధిభావములు రథ్యనాభి సంబంధముకలవిగా నెంచవలెనని పెద్దల యభిభాషణము.

ఆ యుత్కృష్టభావమే, ఆ విశ్వసత్యమును ప్రకటించు కవితాభావమే ప్రపంచమును పాలించునది. మనోహరమైన మాటల నేరికొని, స్ఫుటమైన యర్థములను బోసి సమముగా జేసి, సుసంపన్నమైన భావమును పొదిగి కవి విశ్వమును పరిపాలించువాడు. నాదబ్రహ్మ సాక్షాత్కారమొందని పదసంపుటులు వ్యర్థము. అట్లే యర్థములేని శబ్దములు పశికట్టురాళ్ళవంటివి. భావములేని శబ్దార్థములు 'భావజుడులేని పాడుమేడ' వంటివి. కావున శబ్దము-అర్థము-భావము, ఇవి ఉత్తరోత్తర ప్రధానములు. భావము ప్రథమము ప్రభవించును. పిమ్మట సార్థకమైన శబ్దావతరణము జరుగును. కవి భావమునుండి యర్థముమీదుగా శబ్దమునకు

ప్రయాణము చేయుచుండును. సహృదయుడైన విమర్శకుడు శబ్దములనుండి భావమునకు ప్రయాణమొనర్చును.

భావప్రకాశమే కవిప్రయత్నము. తన్నిజస్వరూప ప్రకటనమే విమర్శకుని బాధ్యత. శబ్దములోని నాదప్రతిమార్థముల కంతరమైన భావముచేతనే ముల్లోకము లంతే తమస్సులనుండి విడివడునది. అట్టి భావోదయమే జ్ఞానోదయము. ఐంద్రజాలికుని మాయలోబడక నిజతత్త్వ మెఱుగుటకై సంస్కారము బడసినవాడే మహాత్ముడు. శబ్దములో భావార్థముల నాత డెరిగి బ్రహ్మతత్త్వము నెరుగగలడు. అట్టి జ్ఞానోదయమే జ్యోతిరావిర్భావము. అదే విశ్వము నేలు పరంజ్యోతి.

'తమసో మా జ్యోతిర్గమయ'

○

[మద్రాసు రేడియోనిలయమునుండి ప్రసారితమైన ప్రసంగము 2-8-45]

కవి - సమాజము

ఏ యుగములోనైన, నేదేశములోనైన కవి మాన నీయుడే. కవి ప్రజాపతితో సమానుడే కాక యొక్కొక సమయమున నాతని మించునుగూడ. కవి తాను ప్రతిభా వంతుడై, త్రికాలవేదియై, సమస్త చరాచరప్రకృతిని నిశిత ముగా పరిశీలించి, తానందుంఁజీ విడిపోయి, దాని నాత్మతత్త్వ ముతో సమన్వయించుకొని యాధికారిక వచస్సును మధుర ముగా వెలువరించును. ఆతడు క్రాంతదర్శి. కావుననే కర్మ సాక్షినికూడ త్రోసిపైచి 'రవి గాననిచో కవి గాంచునేకదా' అనెడి లోకోక్తి పొసగినది. వర్తమానములో భూతభవిష్య త్తుల సమన్వయించుట ప్రతిభావిశేషమేకాని వేరుకాదు. దూరదర్శనములో లౌకికములైన, నిత్యనైమిత్తికములైనవిష యములను శోధనముచేసి యుత్తమోపదేశముచే సంస్కరిం చుటలో కవి ఋషితుల్యుడు.

కవికూడ లోకసంబంధియే. సామాన్య మానవు డే విధముగా నాహార విహారాదులలో పాల్గొనునో యట్లే కవి యును. కాని కవి లోకానుభవమును పొంది, యా లోక ములో తాను చూచిన సన్నివేశమును తన ప్రతిభచే నుదా త్తముచేసి, యందలి తాత్కాలికచేతనను శోధనముచేసి శాశ్వత స్పందనము నాపాదించును. కవి కార్యము విచిత్ర

మైనది. అసత్తునుండి సత్తునకు, తమస్సునుండి జ్యోతిర్లోకము నకు నడిపించు శక్తిమంతుడు కవి. సమాజములో సామాన్యులు చూచు దృశ్యమునే తాను దర్శించును. కాని సామాన్యులవలెగాక యత డందలి పాత్రములతో లీనమొందును. ఆ దృశ్య మాతని యంతరంగాభిత్తికయందు సంపూర్ణముగా ముద్రిత మగునట్లు సాధనము చేయుచుండును. పునర్దర్శనముచేసి దాని నంతరంగమందు భావనిగ్రహముచే నిలుపుకొనును. తనకు కలిగిన సంతోషము నానందముగను, దుఃఖమును కరుణముగను సంస్కారవిశేషముచే పరివర్తనము చేయును. అనగా కవి ప్రథమదశలో సాక్షియై, పిమ్మటద్రష్టయగునన్నమాట. సామాన్య మానవులు సాక్షులుమాత్రమే.

కవి తాను దర్శించి నిగ్రహించి భావనచే దాని నొక రసగోళముగా పునర్దర్శించిన తరువాత యితరుల కా రసానందానుభవమును భాసింపచేయుటకు ప్రయత్నించును; ద్రష్టయైన పిమ్మట స్రష్టయగును. అనగా కవిత సృష్టియన్నమాట. ఉక్తివిశేషమే కవిత్వ మన్నాడు ప్రాచీనుడు. ఉక్తివైచిత్రి పొసగుటకు కవి వ్యుత్పన్నుడు కావలెను; చూచిన సన్నివేశమును తిరిగి శబ్దార్థకల్పనముచే సృజింపవలెననిన నెంతటి శబ్దాధికారము వలయునో యూహింపుడు. శుద్ధమైన వచస్సుతో సమగ్రవస్తుచిత్రణముచేసి తా నెంతటి సానుభూతి పొందెనో యంతటి యనుభవము సామాజికునకు కూడ నందించినపుడే కవి కృతార్థుడగును. కావున కవి క్రాంతదర్శియై నిశితగ్రథనాకౌశలముచే స్ఫుటవ్యక్తికలిగి యుండవలెను. వ్యక్తిలేని ద్రష్ట ప్రయోజకుడు కాడు.

నాడు, కవి మానవ సమాజము నుత్తమమార్గమున తన పవిత్రవచస్సుతో నడిపించువాడు. జాతి సంస్కృతికి నుపాధ్యాయు డెంతటి బాధ్యత వహింపవలెనో యంత బాధ్యత మానవకల్యాణమునకు కవి వహించును. కవి సమాజమును తనతో తీసికొనిపోయి యాదర్శమూర్తులను చూపి, యలరించి, యనుసరింపజేయును. అట్టిచో సమాజముకూడ కవి నాదరింపవలెను. సామాజికులు కేవలము పామరులై కవి విశిష్టత యెఱుగక యాతని దూషింపరాదు. విద్యావంతులై వివేచనాజ్ఞానముకలిగి, సహృదయత్వ మలవరచుకొని సామాజికులు కవిని సమీపించుట కర్హత సంపాదించుకొనవలెను. కవి సామాజికు లీవిధముగా పరస్పరానుభూతి కలిగియుండిన గాని శోభ లేదు.✓ •

పూర్వకవులు చిత్రించిన సన్నివేశములు సమాజమునకు సహజములు కావనియు, వాస్తవిక జగత్తు నతిక్రమించి, భావాంబరవీథులలో విహరించుట దోషమనియు, యథాదర్శనముగా చిత్రింపవలెగాని సమాజమునకు దూరముగా నుండరాదనియు నిటీవల కొందరు వాదించుచున్నారు. కవిదృష్టికిని సామాన్యుని దృష్టికిని భేదమున్నట్లు తెలియవలెను. వాస్తవిక కథనముకన్న నుదాత్త కథనమే బోధనమున కనుకూలించును. లౌకికమునుండి యలౌకికమునకు పాత్రముల నడిపించుచు కవి సమాజమును స్వర్గమును కలిపి ముడివేయును. ప్రవరునివంటి యింద్రియ నిగ్రహము కలవాడును, సీతవంటి పతివ్రతయు లోకవిరుద్ధములని శంకిం

చువా రున్నారు. లోకమునకు కవిత్వము దర్పణమైనందు వలన ప్రయోజన మేమి? ఉన్నది యున్నట్లు వర్ణించుచో కవి యేల మనకు? అట్లు కవిత్వము దర్పణమైన, నుపదేశమునకు బదులు ల్రదేకమును, సంస్కరణమునకుబదులు జుగుప్సను కవి కలిగించునేమో! కవి కేవల సామాజకుడైపోయిన ప్రయోజనము లేదుకదా. 'దేశకాల పరిస్థితులను గమనించియే ప్రతి యుగమున కవి ప్రవర్తయై ప్రవర్తిలుచుండును.

ఈ సిద్ధాంతమును మరచి సమాజమునకు కవి దూరముగా వర్తిలుచున్నాడను ప్రవాదము కొందరు లేవదీసినారు. ప్రజావాఙ్మయము పూర్వము లేదని వివదించుచున్నారు. ప్రజావాఙ్మయ మనగా ప్రజల కొరకు వాఙ్మయమని యర్థము. పూర్వమున్న వాఙ్మయము ప్రజలకొరకే కాని పశువులకు కాదుగదా యుద్దేశింపబడినది? ప్రజ లన్న పామరు లని యర్థము చెప్పుకొనినచో పామరునికి వాఙ్మయ మాతని సంస్కరించి సన్మార్గవర్తనుని చేయుటకేగదా? విశ్వశ్రేయః కావ్య మనినపుడు పూర్వులు దీనినే యుద్దేశించినారు. కాని పూర్వకావ్యములు ప్రజల కందుబాటులో లేవని యందలి భాషాభావ జటిలత్వమును దూషించుచున్నారు. నేడు వ్యావహారికభాషలో కవులు తమ భావముల నందించినను ప్రజాసామాన్యమున కర్థమగుట లేదను వాక్యములు వినబడుచునే యున్నవి. సామాజికు లధికారానుగుణముగ విషయ గ్రహణము చేయవలెనే కాని కవిని దూషించి ప్రయోజనము లేదు. అన్ని కాలములలోను కవి

కిని పామరునికిని మధ్య సహృదయుడైన వ్యాఖ్యాత యుండవలెను; ఉండితీరునుగూడ. సామాజికుడు శిక్షపొందవలెను. అట్లు కాక కవిని పామరుని వద్దకు దిగిరమ్మనుట పొరపాటు. దీనినే రస్కిన్ పండితుడు—

"We neither feign nor interpret; you must rise to the level of our thoughts" ★

అని, సామాజికులే కవి వసించు నున్నత పథమునకు వెళ్ళవలెనుగాని కవి దిగిరాలేడని చెప్పినాడు. ఈ సిద్ధాంతమునకు విపర్యాసము కలిగినచో సమాజము తమోలోక మందుండుట తటస్థించును. జాతివ్యవస్థ క్షీణించిపోవును.

కవి భావోదాత్తతతో నే విధమైన వివాదము పనికిరాదు. కవితాభావమున కక్షర రమ్యత నాపాదించి దాని కథామయము చేయుటలో సజ్జాద్ జహీర్ కూడ తన సమ్మతిని

The people demand of their artists to present these in artforms to clothe these sacred emotions...

అను వాక్యముద్వారా తెలిపినాడు; కాని వివదించలేదు. భావ చిత్రణములో కావ్యరూపము నంగీకరించితీరవలసిన దే.

కవికిని సమాజమునకు నవినాభావసంబంధము. కవి తానున్న దేశకాలపరిస్థితుల నాకళించుకొనియే కావ్యము రచించినాడు పూర్వము. నన్నయ కవితలో ధర్మనిష్ఠయు, పాల్కురికి వారి కావ్యములలో శైవమత ప్రాబల్యమును, తిక్కనార్యుని గంటములో దేశీయప్రభావమును, శ్రీనాథుని

★ Ruskins Lectures— Sesame.

క్రీడాభిరామములో సంఘవ్యవస్థ, రాయలనాటి కావ్యము లలో సమాజసౌఖ్యమును, వీరేశలింగము రచనలలో ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతీ సంఘర్షణము ముద్రితములైనవి. కావు ననే సాంఘికచరిత్ర వ్రాయుట కాసంఘవాఙ్మయము తోడ్పడు నను సూత్రము వచ్చినది. సంఘజీవితము ప్రతిబింబించని రచన యుండజాలదు.

నేడు ప్రబోధవాఙ్మయము వచ్చుచున్నదనిన, నది యీనాటి జాతియొక్క నిద్రాణావస్థను తెలుపును. ప్రబోధ వాఙ్మయమే సాహిత్యమని తలచుట యవివేకము. ప్రబోధ వాఙ్మయము తాత్కాలిక ప్రయోజనము గలది. ప్రజలను ప్రబోధించి యెన్నిదినములు కార్యశూరులుగా నిలువబెట్ట గలము? విజ్ఞానవ్యాప్తి విరివిగా జరుగవలెను. ప్రజ లందరు తమ విజ్ఞానపాదములపై తాము నిలువగల శక్తి యలవరచు కొనిననాడు కవి సందేశ మర్థమగుటయే కాక యుత్తమసాధ నములో శాశ్వతఫలము లందగలుగుదురు. విద్యావ్యాప్తికై పాటుపడక కేవల ప్రబోధము సాగించిన ముక్తి లేదు. విద్యా వంతునికి సాహిత్యము సమధికమైన జ్ఞానము నిచ్చి పరమా నంద సంధాన మొనగూర్చును. ప్రబోధము మనుజునిలో సహజమైన యాకాంక్షను పొడమనీయదు. కావున దాని ప్రభావ మల్పకాలపరిమితము. అయినను సాహిత్యసృష్టియు ప్రబోధవాఙ్మయ రచనయు నేకకాలావచ్ఛేదకములుగా జరుగవలసియేయున్నది.

ఈనాడు మన సంఘము దుస్థితిలో నున్నది. తుచ్ఛ కామమునకు గురియై జంతుప్రాయమగుచున్నది. వర్గవైమ

నస్యములు మిక్కుటములై యైకమత్యము లేకయున్నది. అసూయాహంకారములు హద్దుపద్దులేక పెరుగుచున్నవి. ధైర్య పౌరుషము లడుగంటినవి. సమాజములో శాంతిలేదు. స్వేచ్ఛాకాంక్ష ప్రబలినది. కాని ఫలవంత మగుటకు పరిస్థితులు ప్రతికూలములుగా నున్నవి. ఇట్టి సామాజిక దుస్థితిని సమగ్రముగా పరిశీలించి, విశ్వమానవకల్యాణము చేకూర్చునట్టి, శాంతిని నెలకొల్పునట్టి, సంఘైకమత్యమును ప్రబోధించునట్టి యుత్తమ కవి యీనా డవతరింపవలసియున్నాడు. అతడు ప్రపంచ కవి కాగలడు. అతని అధికారికమగు ప్రవచనములతోడనే యీనాటి సామాజిక దుస్థితి తొలగిపోవును. ఆమహాకవి కొరకై నిరీక్షింతముగాత.

O

(5-6-1945 తేది హైద్రాబాదు రేడియోనిలయమునుండి ప్రసారితము)

విమర్శకుడు - కళోపాసకుడు

○

విమర్శక కళోపాసకుల కర్తవ్యతాబాధ్యతలను వారి వారి ముఖ్యోద్దేశములకుఁ దోడగు వివిధోపాయములను, వారి యుత్కృష్టాదర్శములకు మార్గదర్శకములగు విషయములను తదితరవిషయముల నవగాహన చేసికొనుటకుఁ బూర్వము విమర్శనమనఁగ నేమియో, కళయనఁగ నెట్టిదో, యెట్టివాఁడు విమర్శకుఁడని, కళోపాసకుఁడని పిలువంబడెడినో యెఱుంగుట మన కవశ్యకర్తవ్యమై యున్నయది.

సూక్ష్మరీతిని బరిశీలించిన విమర్శకునికిని, కళోపాసకునికిని సన్నిహిత సంబంధ మున్నటుల దెలియనగును. నిజముగ కళోపాసన, కళాదృష్టి, కావ్యాదులయందుఁ ప్రవేశమును గలిగియుండి, గొప్ప రసికుఁడైనవాఁడే విమర్శనాకార్యమునకుఁగాని, కళారాధనకుఁగాని గడంగుట కర్హుఁడగును. దీనిఁబట్టి విమర్శకునికిని, కళోపాసకునికి నొకే విధమగు పరికరము లుండవలయునని మనము దెలిసికొందుము. ఒక్కొక్కతఱిఁ గళోపాసకుఁడే విమర్శనకుఁ గడంగుట సంభవించును. కళోపాసకుఁడు కావ్యాదులం దగురీతిని బరిశీలించి, యందలి లోపాలోపములను గుర్తెఱుంగుట కెక్కుడవకాశమున్నది. తాను గుర్తెఱింగి, యితర జనంబుల కెఱుకచేయుటయే విమర్శనాదర్శకము. ఈ విధంబున విమర్శన కళోపా

సమని కలముపై నాధారపడినదో గుణాగుణపరిశీలనముగా నెంచవచ్చును.

ప్రత్యేకముగా నీ రెంటినిఁ బరికింతముగాత! ఈ కార్యాచరణకుం గడంగుటలో రెంటికిని సాధర్మ్యవైధర్మ్యముల సులభమార్గముగఁ గన్గొన వీలగునను నాశయము ప్రబలియున్నది.

మున్ముందుగ 'విమర్శన' మన్న నెట్టిదో విపులముగఁ పరిశీలింతము. ఈ పదము ననేకు లనేక విధముల నిర్వచించి యున్నారు. ఎవరికిఁ దోఁచినటులు వారు వాక్రుచ్చుచుండ నేఁటికి విమర్శన మను పదమునకు భిన్నాభిప్రాయము లేర్పడి, విమర్శకుఁడన్న కేవలముఁ గావ్యములపట్ల రక్కసుఁడుగ భావించునంతటి భీతిని నెలకొల్పినది. నేఁడు ప్రతి విమర్శకుఁడును 'విమర్శన' మను పదమునకు భిన్నమైన నిర్వచన మొసంగుచున్నాఁడు. లక్ష్య మేదియు లేక, నోటికి వచ్చినటులు, కలము నడచిన రీతిని వ్రేలుచుండు విమర్శకు లనేకులఁ గాంచుచున్నారము. సంప్రదాయార్థములో విమర్శకుఁడు దోషాన్వేషిగా నెంచఁబడుచున్నాఁడు. కొందఱు కావ్యాదికళలయందలి గుణదోషవిశేషములను బరికించి, యున్నదియున్నట్లు దెలుపువాఁడు విమర్శకుఁడని యూహించుచున్నారు. మఱికొందఱు కృతియందలి విశేషములనే హెచ్చరించుచు, కవిని, కృతిని యథోచితముగ నభినందించుట విమర్శన మనుచున్నారు. ఒక వస్తువును గైకొని యందలి కవితామాధుర్యమునుగాని లేక రసోత్కృష్టతనుగాని,

చమత్కృతులను, తదితరాన్వయములను సహాయముగఁ గాని యితర వస్తువులను వీనితోఁ బోల్చి యేది మిన్నయో నిర్ణయించు తత్త్వమే విమర్శకతత్త్వ మని కొందఱు నుడువుచున్నారు. దీనికి సంబంధించిన వాక్యమే 'విమర్శన మొక యానుషంగిక పరీక్ష' యనునది.

విమర్శకుఁడు నిజముగా నిష్పక్షపాతబుద్ధితో నద్దేని పరిశీలింపవలెను. లేదేని యట్టిది విమర్శన మనిపించుకొనక, కేవలము కవిపైనున్న యభిమానమువలనఁగాని లేక యాతనిపై నిరసనభావమువలనఁగాని పురస్కరింపఁబడిన కలముయొక్క నడకగా నెంచఁబడును. బాగుగ పరికించిన నేఁడు వెలువడు విమర్శనములలో చాలవరకు నీ నిర్వచనమునకుఁ దోడగునవే యని గ్రహింపఁగల్గుదుము! ఒకానొకఁడు తన విమర్శనమం దొక కవిని, ఆతని కృతిని ఖండించినచో, నా కవిపైనున్న యభిమానముచే వేరొకఁడు దానిని తిరిగి ఖండిచుచు, మఱియొక విమర్శన మా విమర్శపై వ్రాయబూనుకొనుట సామాన్యముగ మనము గాంచుచున్న విషయమే. తుదకీ విమర్శనలు వ్యక్తిగతమగు కక్షల వెలిబుచ్చు మార్గములుగా నుపయోగింపఁబడుచున్నవి. క్రమముగ వ్యక్తిద్వేషమునకుఁ గారణభూతమై విషమపరిణామము నొందుచు ముఖ్యోద్దేశమునకు దూరమగుచున్నవి. ఈ సందర్భమున నొక విషయము చెప్పవలసియున్నది. విమర్శనము కృతుల కనువర్తించునదికాని కృతికర్తల కనువర్తించునది కాదని ప్రతి విమర్శకుఁడును గ్రహింపవలెను. కృతిలోనున్న గుణదోషములఁ గాంచుటేకాని కృతికర్తల గుణదోషముల నెంచుట

విమర్శనాపద్ధతికి విరుద్ధము. నేఁటి విమర్శకులలోఁ గొందఱు దీనినే గ్రహింపలేకున్నారు. విమర్శకుఁ డెన్నటికిని కృతికర్తపై తన కున్న యభిప్రాయము ననుసరించి యాతని కృతిపై తదభిప్రాయమే ప్రతిబింబించునటులు వ్రాయఁబూనుకొనఁడు. 'Judge not others that thy be not judged' అను వచనము ప్రతి విమర్శకుఁడును గమనింపఁదగినది.

నిజమైన విమర్శనలోఁ గలహాములకుఁ గారణంబులగు విషయంబు లుండక 'విషయ విభజన, వ్యాకరణార్థపరిశీలన, నిరుక్తము, భావవ్యాఖ్యానము, పరిష్కరణ' మున్నగు నితర విషయములు చేరుచున్నవి. వీని నన్నింటియెడను గౌశలము వడసియుండువాఁడే సరియైన విమర్శకుఁడు. అనఁగ విమర్శకుఁడు సర్వతోముఖుఁడై విజ్ఞానసర్వస్వసాధకుఁడై యుండవలెనన్నమాట!

విమర్శనమందు చారిత్రక, శాస్త్ర, కావ్య విమర్శనము లని ప్రత్యేక విభాగము లున్నవి. విమర్శకులలో నిరు తెగ లున్నారు. ౧. ఉన్నదాని నున్నటులు విపులీకరించి యర్థమును (కవి తలంచిన రీతి) చెప్పువారు. ౨. ప్రత్యేక వాక్యములను, సందర్భములఁ గైకొని ఖండించువారు. విమర్శకులకు గర్వము హెచ్చఁగ నహంభావముతోఁగూడి, యున్నదాని విపులీకరించుటే యేమి ప్రయోజకత్వ మని తమ యభిప్రాయములఁ జొనిపి, పాండితీప్రకర్షకుఁ బ్రయత్నములు సల్పుచు ఘర్షణలలోనికి దిగుదురు. అట్టిచో వీరు రెండవ తెగలోనివారుగాఁ బరిగణింపఁబడెదరు. విమర్శనో

చమత్కృతులను, తదితరాన్వయములను సహాయముగఁ గాని యితర వస్తువులను వీనితోఁ బోల్చి యేది మిన్నయో నిర్ణయించు తత్త్వమే విమర్శకతత్త్వమని కొందఱు నుడువు చున్నారు. దీనికి సంబంధించిన వాక్యమే 'విమర్శన మొక యానుషంగిక పరీక్ష' యనునది.

విమర్శకుఁడు నిజముగా నిష్పక్షపాతబుద్ధితో నద్దేని పరిశీలింపవలెను. లేదేని యయ్యది విమర్శన మనిపించు కొనక, కేవలము కవిపైనున్న యభిమానమువలనఁగాని లేక యాతనిపై నిరసనభావమువలనఁగాని పురస్కరింపఁబడిన కలముయొక్క నడకగా నెంచఁబడును. బాగుగ పరికించిన నేఁడు వెలువడు విమర్శనములలో చాలవరకు నీ నిర్వచనము నకుఁ దోడగునవే యని గ్రహింపఁగల్గుదుము! ఒకానొకఁడు తన విమర్శనమందొక కవిని, ఆతని కృతిని ఖండించినచో, నా కవిపైనున్న యభిమానముచే వేరొకఁడు దానిని తిరిగి ఖండి చుచు, మఱియొక విమర్శన మా విమర్శపై వ్రాయబూను కొనుట సామాన్యముగ మనము గాంచుచున్న విషయమే. తుదకీ విమర్శనలు వ్యక్తిగతమౌ కక్షల వెలిబుచ్చు మార్గ ములుగా నుపయోగింపఁబడుచున్నవి. క్రమముగ వ్యక్తిద్వేష మునకుఁ గారణభూతమై విషమపరిణామము నొందుచు ముఖ్యోద్దేశమునకు దూరమగుచున్నవి. ఈ సందర్భమున నొక విషయము చెప్పవలసియున్నది. విమర్శనము కృతుల కనువర్తించునదికాని కృతికర్తల కనువర్తించునది కాదని ప్రతి విమర్శకుఁడును గ్రహింపవలెను. కృతిలోనున్న గుణ దోషములఁ గాంచుటేకాని కృతికర్తల గుణదోషముల నెంచుట

విమర్శనాపద్ధతికి విరుద్ధము. నేఁటి విమర్శకులలోఁ బలువురు దీనినే గ్రహింపలేకున్నారు. విమర్శకుఁ డెన్నటికిని కృతికర్తపై తన కున్న యభిప్రాయము ననుసరించి యాతని కృతిపై తదభిప్రాయమే ప్రతిబింబించునటులు వ్రాయఁబూనుకొనఁడు. 'Judge not others that thy be not judged' అను వచనము ప్రతి విమర్శకుఁడును గమనింపఁదగినది.

నిజమైన విమర్శనలోఁ గలహములకుఁ గారణంబులగు విషయంబు లుండక 'విషయ విభజన, వ్యాకరణార్థపరిశీలన, నిరుక్తము, భావవ్యాఖ్యానము, పరిష్కరణ' మున్నగు నితర విషయములు చేరుచున్నవి. వీని నన్నింటియెడను గౌశలము వహసియుండువాఁడే సరియైన విమర్శకుఁడు. అనఁగ విమర్శకుఁడు సర్వతోముఖుఁడై విజ్ఞానసర్వస్వసాధకుఁడై యుండవలె నన్నమాట!

విమర్శనమందు చారిత్రక, శాస్త్ర, కావ్య విమర్శనము లని ప్రత్యేక విభాగము లున్నవి. విమర్శకులలో నిరు తెగ లున్నారు. ౧. ఉన్నదాని నున్నటులు విపులీకరించి యర్థమును (కవి తలంచిన రీతి) చెప్పువారు. ౨. ప్రత్యేక వాక్యములను, సందర్భములఁ గైకొని ఖండించువారు. విమర్శకులకు గర్వము హెచ్చఁగ నహంభావముతోఁ గూడి, యున్నదాని విపులీకరించుటే యేమి ప్రయోజనకత్వ మని తమ యభిప్రాయములఁ జొనిపి, పాండితీప్రకర్షకుఁ బ్రయత్నములు సల్పుచు ఘర్షణలలోనికి దిగుదురు. అట్టిచో వీరు రెండవ తెగలోనివారుగాఁ బరిగణింపఁబడెదరు. విమర్శనో

ద్దేశ్యము గుర్తెఱింగి, తత్ప్రకృతుల నరసి, దాని కనువగు పరికరముల సమకూర్చుకొని తదుద్యమమునకుఁ బూనుకొనిన విమర్శనము సార్థకనామముతోఁ బరఁగుననుట నిస్సందేహము. ఇట్లు సర్వాంగీణలక్షితుండై సకల పరికర సమన్వితుండై పరఁగు నాతని విమర్శన ముదాహరణగాఁ గైకొన సాహసింపవచ్చును.

విమర్శనమే ప్రత్యేక వాఙ్మయస్వరూపము దాల్చిచున్నది. గూఢార్థమును ప్రకాశింపఁజేయుట, ప్రజలకు కళాసౌందర్యమును వెల్లడించి, కావ్యాదులయందు, కళోపాసనలందు నభిరుచి యాదరణాభిమానము లేర్పఱచుట, విమర్శనయొక్క ముఖ్యాశయములు. కనుక విమర్శకుఁడు పైనుదాహరించిన పరికరములతోడను, మహదాశయములతోడను, నిష్పక్షపాత బుద్ధితోడను, విషయవ్యక్తీకరణమే ప్రధానకర్తవ్యముగా నెంచుచుండాఁ గైకొనిన దానిలోని లోపాలోపముల నవలోకించి చదువరులకుఁ జూపుచుండవలెను. విమర్శనమని నామంబిడుట కట్టితఱిగాని సమంజసముగాదు. లేనియెడల 'ప్రశంస' యనియో, లేక 'రంధ్రాన్వేషణ' మనియో, వారి వ్రాఁతలకు నామంబిడిన ఘర్షణకుఁ దావుండదు!

ఇఁక కళనుగూర్చి కళోపాసకులగుఱించి తెలిసికొనవలసియున్నది. ప్రథమమున 'కళ' యనుపదమును నిర్వచించి పిదప దాని వివిధశాఖలు, వాని నారాధించు పద్ధతులను గ్రహింతముగాక!

'Art is the presentation of real in its mental aspect'

అనఁగా జీవనసాదృశ్యముయొక్క మానసికరూపమును ప్రదర్శించుటయే కళ-అని యొక మహామహుఁడు సెలవిచ్చియున్నాడు. చతుష్షష్టి కళలున్నటులు మనకు తెలియుచున్నవి. కాని వాని నన్నింటిని గ్రహింపఁగల్గునంతటి యవకాశము మనకిచ్చుటలేదు. ఈ అఱువది నాల్గు కళలలోను లలితకళలుగా నెంచఁబడుచున్నవానిఁ గైకొని తగురీతిని బరిశీలింతము:-

కవిత్వము, చిత్రలేఖనము, తక్షణము, సంగీతము, శిల్పకళ, లలితకళలుగా నెంచఁబడున్నవి. మన భారతదేశమున లలితకళలపైనున్న యాదరము, తత్కళౌన్నత్యము, నాటియేయితర దేశమందును గానుపించదు. హిందూదేశము శిల్పశాస్త్రములో నద్వితీయము, సంగీతములో సాక్షి, కవనమందుకన్నెఱ్ఱ. చిత్రలేఖనమందు చాతురీధురీణ. తక్షణములో తార. ఇట్టి యైశ్వర్యము లభింపఁజేసిన విశేషనైపుణీ ధురంధరు లెందఱో మన భారతదేశము నాదర్శప్రాయముగాఁ జేసినందులకు వారు వందనీయులు. అధునాతన యుగమున పాశ్చాత్య దేశములందు లలితకళల కెట్టి యాదరము కలదో యుఁచుఁ గమనించినవారు, విదేశములందే వీనిజననమనియు, నచ్చటనే కళయౌన్నత్యము గడించినదనియు సరియైన పరామర్శలేక. యభిప్రాయపడుచున్నారు. యథాతథముగ, నే విజ్ఞానమును గైకొనినను పూర్వము భరత దేశమందు వరలినదేకాని యన్యముగాదు. సంస్కృతము, గణితశాస్త్రము, ఖగోళశాస్త్రము, సాముద్రికశాస్త్రము, ప్రకృతిశాస్త్రము, వేదాంతము, తర్కశాస్త్రము, వైద్యశాస్త్రము, తదితర

శాస్త్రములును- పైనుదాహరించిన లలితకళలు మొదలుగా గల వన్నియు, భారత భూమిలో జననమందిన వే! నేటికి వాని నితర దేశంబులనుండి నేర్చుకొనుచుంటిమని, సర్వవిజ్ఞానము వారి ధనమే యని తలంచునంతటి దౌర్భాగ్యము కలుగు టెంతయు శోచనీయము. ప్రాచీన విజ్ఞానమును విస్మరించు విన్యాసము వెల్లివిరియుట విచిత్రము గా కేమున్నది? మన ప్రాచీన శాస్త్రములను,సంప్రదాయములను,మరచియితరుల శాస్త్రముల నభినందించుచు, ''పొరుగింటి పుల్లకూర రుచి'' యన్న సామె తను నేటి భారతీయులలో నవనాగరకులమని గర్వపడువారు సార్థక పఱచుచున్నారు. నిజము గ్రహించిన మనము మన శాస్త్రములను నిల్పుకొనలేక, పఠింపలేక, యితరుల కందఁ జేసి, నేఁడుతిరిగి వానినే యితరులచేతను బోధింపఁబడవలసిన స్థితిలోనుంటిమికదా! ఏమి యీ వైధర్మ్యము!

ఇఁక నొక్కొక లలితకళను గ్రహించి ఒకనాఁటి తమ న్నతిని సంస్మరించి పరికింతముగాత!

౧. కవిత్వము: మనభారత దేశము కవనములోక న్నెఱ్ఱ యంటిమి. నిజమున కంతియే. భావగాంభీర్యములందుఁ గాని భావార్థ ప్రకర్షణమందుఁగాని, రసికత్వమునఁగాని, నవీకపొం దికలోఁగాని, యలంకారపు టందమునఁగాని యితర దేశ ముల కవులు మన కవులతో సాటిరారు. శృంగార రసవర్ణ నలలో మన కవుల కవనములు సోపాన మెక్కినవి. కవిచమ త్కృతు లపూర్వములు. నవరసము లొక్కపరి చిప్పిలఁజేయు సమర్థతలో మనవారగ్రగణ్యులు. ప్రబంధరచనలు. ద్వ్యర్థి

 సాహిత్య

కావ్యరచనలు మన కవివర్యుల మనంబులనే మొలకలెత్తి షేక్స్పియర్ వ్రాసిన 'మిడ్‌సమ్మర్ నైట్సు డ్రీము' 'కామెడీ ఆఫ్ ఎరర్స్' లను చూచి మన కవులను నిరసింపనక్కరలేదు. వానికి దీటుగ పింగళి సూరన మన కొసంగిన 'కళాపూర్ణోదయ' మున్నది. వర్డ్సువర్తునే ప్రకృత్యుపాసకుఁడని మన దేశపు నవనాగరకులు తలంపనవసరము లేకుండ, మన కవు లందఱు నట్టివారని నుడువుచున్నారు. ఇందులకు మనవారి ప్రబంధములలోని ప్రకృతి వర్ణనములే ప్రమాణములు. అంతవర కేల? వేదములయందే ప్రకృత్యుపాసనలు కుప్పతిప్పలుగ నున్నవి. కాళిదాసకవి ప్రకృత్యుపాసనమందేమి వ్యంగ్యప్రధానమగు శృంగార పోషణమందేమి యసమానుఁడు. కనుక ప్రాచీన కవుల కవనము లెల్ల నీతిబోధకములై, వర్ణనాపూర్ణములై; భగవద్భక్తినిఁ బురిగొల్పు విషయములతో వరలినవో, నేఁటికవులుగూడ ప్రాచీన సంప్రదాయముల వదలక క్రొత్త నడవడికి సులభమార్గమున, నుత్తమాశయములతో వ్రాయుచున్నారు. ఇహపరముల సాధించు సాహిత్యము భారతీయులదే కాని తదితరులది కాదు.

౨. చిత్రలేఖనము : హిందూదేశము చిత్రలేఖనమందు చాతురీధురీణ యంటిమి. ఈ వచన మూరక వ్రాసినదికాదు. నిజముగ నీ కళౌన్నత్యమును గమనింపవలెననిన నిజామురాజ్యము నందలి ఔరంగాబాదుజిల్లాలోఁ జేరిన 'అజంతా' చిత్రములే యుదాహరణంబులు. ప్రాచీనకళౌన్న

త్యమును, నైసర్గ్యమును ప్రజలు విస్మరించునట్టి దినంబు లేతెంచినను, ఆ చిత్రములు నేఁటికిని సజీవములుగ నుండి చెక్కుచెదరక నూతనము లేమో యని భ్రమింపఁజేయు చున్నవి. నిజముగఁ జిత్రరచన మనిన నానాఁటి చిత్రకారులదే! చిత్రకళాపోషణ మనిన నాఁటి మహీశులదే! కళోపాసనమన్న నాఁటిదే! నిజముగ మనుష్యుని వర్ణించినంత, నా వర్ణనను విని చిత్రించునట్టి కళాకౌశలముగల చిత్రకారులుండువారలు. చిత్రకళకు కావలసిన వస్తుసామగ్రిని సైతము వారే నిర్మించుకొనెడివారు. ఆనాఁడుపయుక్తములైన వర్ణరచనానైపుణికి నేఁటిశాస్త్రవేత్తలు విభ్రాంతి చెందుచున్నారు. ఆ వర్ణములు నేఁటివరకు ప్రత్యక్షముగనుండుట వారిని చకితులఁ గావించుచున్నది. భారతీయ చిత్రరచనము ప్రపంచ విఖ్యాతి నందినది. అంగాంగీభావ నిర్వాహణమందు, వివిధభావ చిత్రణమందు, వెలుగునీడలయందు, అవయవసౌష్ఠవసౌకుమార్య వైశిష్ట్యవేదనమందు, సంవిధాన కల్పనమందు భారతీయ చిత్రకారులప్రతిమానమై ఔత్కృష్ట్యమును ప్రకటించి చరిత్రలో శాశ్వతస్థాన మలంకరించినారు. ఆనాఁటి చిత్రకారుల కళౌన్నత్యమును వెల్లడిజేయు 'అజంతా' చిత్రములు నేత్రోత్సవదాయకంబులు. ప్రాచీనకళౌన్నత్యమును ప్రజలకందఱకును జూపుటకొఱకై తగు సౌకర్యము లేర్పఱచిన మ. ఘ. వ. శ్రీనిజాంప్రభువుగారి నిప్పట్ల నభినందింపవలసి యున్నది.

3. తక్షణము: ఇందలి నైపుణ్యమును గ్రహింపవలె ననినఁ బ్రాచీన కట్టడములనే గమనింపవలెను. ద్వారము

లందును, జాతి స్తంభములమీఁదను గానగు చెక్కడము లిప్పుడేరు ననుకరింపఁజాలరు. ఆనాఁటి యుద్ధములలో నుపయోగింపఁబడిన ఖడ్గముల పిడులపైనను, డాలులమీఁదను, కవచములపైనను గొప్ప తక్షకులచేఁ జెక్కఁబడిన పనితనము నేఁటికిని మనము వస్తుప్రదర్శనశాలలలోఁ గాంచగల్గుదుము. ఫిరంగిగొట్టములమీఁదను నాఁటి తక్షకుల నైపుణ్యము మెఱయుచున్నది. ఆ గొట్టముల ముఖములు ఏ సింహతలాటముగనో, ఎద్దుతలగనో చెక్కినట్లు గానఁబడుచున్నవి. ఎల్లోరా గుహాలు మొదలైనవి మన తక్షకుల కళావైభవమును ప్రకటించునవి.

౪. సంగీతము: 'గీతం వాద్యంచ నృత్యంచ త్రయం సంగీత ముచ్యతే' యను శాస్త్రజ్ఞుల వాక్యానుసరణముగ సంగీతము గీతవాద్యనృత్యసమ్మేళనము. సంగీతమునే 'భరత' మని నుడువుటకూడ వినుచున్నారము. అనఁగా భావ, రాగ, తాళయుక్తమైనది సంగీత మని భావము. సంగీతము మన దేశమునకుఁ గ్రొత్తదికాదు. ఇది వేదకాలమునాఁటినుండి యున్నట్లు సామవేదమువలనఁ దెలియునగును. సంగీతమును తరణోపాయంబున కనువగునదిగా నెంచి, త్యాగరాజు, దీక్షితులు మున్నగువారు దానిం జేపట్టి స్థిరకీర్తిం బడసిరి. కర్ణాట సంగీత మని పేరుగన్నది భారతీయుల సంప్రదాయసిద్ధమగు సంగీతము. కర్ణపేయముగ నుండునదిగాన దానికీ పేరు సిద్ధించినదని పెద్దలనుచున్నారు. సంగీతమునకు దక్షిణ భారతదేశము ప్రఖ్యాతి నందినది. నాదబ్రహ్మ నుపాసించి యీ కళద్వారా మోక్షసాధనము జరిపిన యోగులున్నారు.

ఇష్టార్థములగు భగవత్సన్నిధిని జేర్చు నుపాయ మీ సంగీతకళ యందున్నట్లు మహానుభావులు దర్శించి ప్రతిపాదించి యున్నారు. త్యాగయ్య కీర్తనలు, కృతులు నేటికిని రసజ్ఞుల నలరించుచు నేయున్నవి

౫. శిల్పము: దీని యౌన్నత్యము ప్రాచీన దేవాల యాదులయందుఁ గానఁబడును. ఇందులకు మన దక్షిణదేశమే పేర్కొనదగినది. అమరావతి, నాగార్జునకొండ యిత్యాది చారిత్రకస్థలములలో నద్భుతమగు శిల్పసంపద కనుగొన నగును. ఆంధ్రశిల్పకళా వైదగ్ధ్యము వేనోళ్ల చాటునట్టి శిల్పము లవి. శిల్పహృదయము నెఱిఁగి సానుభూతితోఁ దిల కించువారికి వీని ప్రత్యేకత పొడగట్టును. ఒక్క స్తంభ ములో శిల్పి చూపు పనితనమునకుగాని, ఒక కొండను శిల్ప భవనముగా చిత్రించుటలోని కౌశలమునకుగాని యెవ్వరైనను జోహారు నర్పింపవలసినదే. ఇంతటి ఘనమైనది భారతీయ శిల్పము !

కళోపాసనముయొక్క ముఖ్యతత్త్వ మీశ్వరోపాస నమే. కళయొక్క పరమావధి భగవంతుని నిరూపించుటే. మనకు కళాపోషకు లత్యావశ్యకము. ప్రాచీన సంప్రదాయ ముల విస్మరింపక, యుదాత్తాభిప్రాయములతోఁ బ్రాచీ నులు చూపిన పథములనే పోవుచు నొకప్పటి భారతీయ ప్రతి భను, విజ్ఞానమును, కళౌన్నత్యమును సంస్మరించి వానిని పునరుద్ధరించుట యావశ్యకము.

○

[దివ్యవాణిలోను, ఏప్రిల్ 1940 భారతి లోను ప్రచురితమైన వ్యాసము]

కవి - చిత్రకారుడు

౧

వస్తుస్వరూప నిరూపణమందు గుంచెను బహు జాగరూకతతో నుపయోగించి, రేఖలు సరిగా వ్రాసి యెంతయో తబ్బిబ్బుపడుచుండుట చిత్రకారునకు సహజము. వర్ణముచే జీతము సద్దవలెనన్న బహుసూక్ష్మముగా వానియెడ లోపము గానరాకుండునటుల కుంచెచే నద్దివ్రాసి సమముగ జేయును. వస్తునిర్దేశమందు ప్రవీణుడే నిజమైన చిత్రకారుడు. ఈ వస్తుస్వరూపనిరూపణ మెరయుటకు బుద్ధికుశలతయే ప్రధమ సోపానము. గార్దభాకారము గీచి, దానిని ఘనకముగా గ్రహింపుమనుట కేవలము చిత్రకారుని యసమర్థతను సూచించును. ఒక చిత్రకారుని చిత్రము మెప్పును బడసినదని నాతడు గొప్పవాడనియే తలంపవచ్చును. కవి యాశయమును వ్యక్తీకరించుటలో చిత్రమందు రౌద్రమును జూపిన సమంజసముగాదు. కొందఱు చిత్రకారులు వారి చిత్రపటముల ప్రక్కన నామం బిడుచుందురు. కాని వాని నామములు వ్యక్తీకరించు భావము లప్పుడపుడు గానరావు, నామం బిడుచుండుట యాచారమైనది. కాని 'నామము నా కొంపదీసె' నను లోకోక్తియు వినుచుందుము.

చిత్రకారు డెంతటి జాగరూకతతో మెలంగునో యదే విశేషముగ, లేక యంతకన్న నెక్కుడుగ శ్రద్ధ వహింపు

చుంచును కవి. ఈతని ముఖ్యాశయముగూడ వస్తునిర్దేశమే! కవి - చిత్రకారు లిరువురు నొకే యాశయమునకై బనిచేయు చుందురు. ఒకరు గ్రహణశక్తిని నేత్రరూపమున గలుగ జేయును. వేఱొకరు శ్రవణరూపమున గలుగజేయును. ఇరువురును హృదయానందమును జేకూర్పవలెనను నభిమతము తోడనే కృషి సల్పెదరు. చిత్రకారుడు వ్రాసిన గీతలలో జీవరేఖ యంతర్వాహినిగా బ్రవహించును. ముఖ్యముగ భావనలతో నవస్థావస్థలను గనిపెట్టి, రసానుభూతి పొంగి పొరలియుండుటకు జిత్రకారుడు పాటుపడును. కవి సుమతి మౌచితి యను వెలుంగు కరమున నిడికొని, యవస్థను తన్మ్య తిచే గమనించి, భావనాయంత్రముచే వస్తునిర్దేశము గావించును./ సాధారణముగా తాము లిఖించిన గీతములనుగాని, చిత్రములనుగాని జనావళిగాంచి, తా మేవిధములగు భావములందు వ్యక్తీకరించిరో యవే భావములను గ్రహించి, తా మే విధములగు నూహాలను చదువరుల - లేక - చూపరుల మనంబులందు జనింపజేయ సమకట్టిరో యా యూహాలే ప్రజల మనంబుల బ్రతిబింబితములైనయెడల గవియొక్కయు చిత్రకారునియొక్కయు నభిమతములు సఫలీకృతములయ్యె నన్నమాట!

కవి యొక పాత్రను ధీరోదాత్తునిగ బోషించుచు, తుదకా భావమునుండి తొలగింపజేసి రసాభాసము గలుగ జేసిన నాతని పాత్రపోషణ మనౌచితి యను మృత్యువాత బడినదాను. చిత్రకారుడు సైతము సింహమును దానితోకపై నక్కయున్నటుల జిత్రించిన నసంభావ్యమగును! రెండవ

విషయ మనస్థానుగుణముగ లిఖించుట. ఉదాహరణముగ కవి యవస్థానుగుణముగా లిఖింపనిచో నెట్లుండునో చూతము: రాముడు సీతను విపినంబుల డించిరమ్మని లక్ష్మణుని కాజ్ఞాపించుచు, మరల జానకితో కలియుటయో, 'అయ్యో! విడవలసివచ్చెనే' అని విలపించుటయో చేసినట్లు చిత్రించినచో నది కేవల మనవస్థానుగుణము.

తదితర లలితకళలకువలెనే కవిత్వ చిత్రలేఖనములకు కూడ ప్రజల నైతికాధ్యాత్మికాభ్యున్నతియే లక్ష్యము. అందుచే కవి యెల్లకాలము నొకేవిధముగ నుల్లసిలుననుట యసంగతము, అవి దేశకాల పరిస్థితులబట్టి వివిధములై, యా యా దేశీయుల నైతికాధ్యాత్మికావస్థలనుబట్టి మారుచునే తదభ్యున్నతిని కలుగజేయును. అట్లే ప్రాచీనయుగములందు ప్రజల విజ్ఞానావస్థ వ్యక్తమానటుల సంస్కృతకావ్యములకు ప్రాముఖ్యతయుండెడిది. ఆంధ్రులలో రానురాను సంస్కృతకావ్యములపై నభిరుచి సన్నగిల సంస్కృతపద భూయిష్ఠములగు తెలుగు కావ్యములు బయలువెడలెను. మఱికొంత కాలమునకు జాను తెనుగు కావ్యముల కాదరము మెండయ్యెను. కడపట నధునాతనయుగమున వ్యవస్థాంతరమును తెలుప దేటలగు చిట్టిపొట్టి కైతలకును, ఛందోనియమ మంతగా లేని భావగీతములకును ప్రాముఖ్యత ప్రబలెను. అది యీనాటి వారి విజ్ఞానావస్థను దెల్పును. వారు మహత్తర కావ్యములలోని (ఛందోబద్ధ) మహదాశయముల నర్థము చేసికొనలేకపోయినప్పటికి 'ఎంకి పాటలలో' సువ్యక్తములగు మధురాశయముల నవగతము చేసికొనగల్గుదురు. భాషా

రోష శాస్త్రచోదితాచారముల నతిక్రమించి, 'విటురాలి విధమున నెడలె' ననుట కవితలోని యుత్కృష్టభావముల, నున్నతాశయముల గ్రహింప నేరమికి దార్కాణము. పతితులగువారిని బైకెత్త కవితావధూటి చేయూతనొసంగుటకె నడుము వంచిన మాత్రమున నామె గౌరవహీన గానేరదు. ఆమెను పతిత యనువారు భాషాబహిష్కారమున కర్హులు.

అవ్విధముగనే ప్రాచీనయుగముల వర్ణచిత్రముల యున్నతాసన మీనాడు రేఖాచిత్రముల కొసగబడినది. ఇది భావవిహీనములనిగాని, నియమరహితములనిగాని యనుట సమంజసముగాదు. వర్ణచిత్రములకు వర్ణములు, కుంచె ముఖ్యలగు పరికరములు గావలె. కాని, రేఖాచిత్రములకు లేఖిని, ఫలకము లుండినజాలును. ఒక వర్ణ మొక్కొక తావునందు దద్దిన నెంత గంభీరముగానుండునో యటులనే నవయౌవనుడౌ పురుషుని చిత్రమునం దొక రేఖచే ముదుసలిగా జేయగల శక్తి రేఖలో నున్నది. కనుక ప్రాచీన కవిత్వమందును, చిత్రలేఖనమందును మార్పు కలిగినది. ఇది కేవలము కాలానుగుణమగు మార్పని మనము తెలిసికొనియే యున్నాము.

దేశీయులకు రాను రాను కాలముయొక్క విలువ తెలియుచున్నది. పెద్దపెద్ద ప్రబంధములుగాని, గ్రంథములుగాని, చూచి చదువునంతటి వ్యవధియున్నటుల గానరాదు. కనుకనే భావగీతముల కాదరణము గలుగుచున్నది. ప్రజలకు సౌకుమార్యము ప్రబలినది. గంభీరములగు వానిని జూచునంతటి - లేక - ఎదుర్కొనునంతటి ధైర్యము లేదు. పెద్దన

వ్రాసిన మనుచరిత్రము నామూలాగ్రముగ చదివి యానందించిన మానవులెందఱో చూచిన నొకలెక్కకురాదని చెప్పవచ్చును. ఎందుచేత? రసార్ద్రములైన ఘట్టములవలనకే జనుల యానము! అప్పటికిని మధ్యలో 'అటజని కాంచె భూమిసురుంబరచుంబిశిరస్సరఝరీ, పటలముహుర్ముహుర్'' అని వచ్చి వదలి వేయుటయే! వదలివేయుటయే కాక, 'నారికేళ పాక మేమిటోయి' అను మాటలతో తూలనాడెద రాకవిత్వమును కొందఱు. అట్టి పరిస్థితులలో భావగీతము లుత్పత్తిలి వీరి లోటును దీర్చి మెప్పును బడసినవి. అటులనే ప్రాచీన చిత్రముల నుండు వర్ణములను జూచి యసహ్యపడునట్టి నూతనమార్గ మేర్పడినది. దీనిబట్టి కవి, చిత్రకారులు కాలానుగుణముగ, ప్రజాభిరుచినిబట్టి ప్రజల నైతికాధ్యాత్మికాభ్యుదయమునకై పాటుపడుచుందురని గ్రహింపవలయును.

కవియు చిత్రకారుడు నొకే యాశయముపై ద్వివిధములగు కార్యముల నెరవేర్చుచున్నారని యెఱింగితిమిగదా! కవియొక్క కథలనైనను, గీతములనైనను చిత్రరూపమున వెలిబుచ్చు. చిత్రకారుడు గ్రహణశక్తికి తోడ్పడును. అట్టి తఱి కవియు చిత్రకారుడైనచో వస్తునిర్దేశ మెక్కుడుగ రాణించునుగదా! అనగా కవితా చిత్రలేఖనము లను రెండు కళలొకేవ్యక్తికి కలవడినచో దాను చెప్ప దలచిన దాని రెండు విధముల నాతడే వ్యక్తీకరించును. దీని కుదాహరణములను చూచినచో కవితకును చిత్రలేఖనమునకును సన్నిహిత సంబంధ మెంత యుండునో గ్రహింప వీలగును. కవికిని చిత్రకారునికి తోడ్పడు ప్రకృతికిని కవితా చిత్రలేఖనములకునట్టి

సంబంధ మున్నదో యూహింతురుగాత. అరుణోదయమును కవివర్ణించును; చిత్రకారుడు చిత్రించును. ఈ చిత్రము నిక్కనే గీతము నుంచిన పరస్పర సోహదభూతములై కవి భావమును సులభముగ వ్యక్తమగుటకు వీలగును. ప్రకృతి కవి కుమారునికి చిత్రకారునకు నెంత సహాయకరమగు వస్తువో తెలియును. సాధారణముగా కవి చిత్రకారులకు నగిసర దృశ్యములు తమ కృతుల ప్రేరకములుగా పరిణమించుచుండును. కావున లలిత కళోపాసకులు ప్రకృత్యుపాసనము ప్రథమ కర్తవ్యముగా నెఱుగవలెను. ప్రకృతి ప్రభావ రహితమైన చిత్రకావ్యములు నిర్జీవములే.

(10-8-38 తేదీ ఆంధ్ర వారపత్రికలో ప్రచురితము)

రెండవ భాగము

(వికాసము)

పదకవిత్వము *

కవిత్వము లలితకళ లన్నిటిలో నగ్రస్థానము వహించుచున్నదని పండితుల సిద్ధాంతము. సంగీతములో నున్న హృదయద్రవీకరణశక్తిని, చిత్రలేఖనమందలి రూపకల్పనము, నాట్యమందలి చేష్టావైచిత్రుల నిముడ్చుకొని భావనాత్మకమై కవిత యొప్పారును. కవితలో చిత్రితములైన పాత్రములు చిత్తరువులలోవానివలె గాక సచేతనములు. అవ్యక్త మధురగీతి యంతర్వాహినిగా కవితలో ప్రవహించుచుండును. దీనిని గమనించియే కార్లైలుపండితుడు కవిత గీతాత్మకమైన భావమని నిర్వచించినాడు. 1 ఇట్టి కవిత్వమునకు భావ వస్తు రచనలు ప్రధానాంశములు. వీనిలో దేని ప్రభావము మిక్కుటమైన దానిపేర కవిత్వము బరగుచుండును. అట్లు వచ్చినవే భావకవిత్వ, వస్తుకవిత్వములు. రచనలో శబ్దార్థములే ప్రధానములు. మధురమంజులగానయోగ్యమైన యక్షరములకు మైత్రికల్పించుట రచనమందలి విశిష్టగుణము. రమ్యాక్షరాపచయము, శ్రవణానంద కల్పనము లొనర్చుట కవికార్యము. ముఖ్యముగా పదకవిత్వమం దీవిధమైన రచనా

---

* జూన్ 1945 లో రచితము.

1 Poetry we will call, musical thought.

సౌందర్య మొలుకుచుండును; శ్రవణసుఖమునిచ్చుచు, హృదయమును ద్రవీభూత మొనర్చి మానవుని సంస్కరించును.

పదకవిత్వము మాత్రాఛందము కలిగి, శబ్దకాఠిన్యము లేక సరసమగు పదములతో కూడి, గానయోగ్యమై, రాగరంజితమై, జాతీయాచార వ్యవహారములకు ప్రతిబింబమై, చక్కని నానుళ్లకు బలుకుబళ్ల కాశ్రయమై, మానవుల కష్టనిష్ఠూరముల మరపించునదై, పండిత పామరరంజకమై వర్తిలునది. జాతిప్రబోధమునకు నుద్దీపనమునకు నీ పదకవిత తోడ్పడుచుండును. ఇట్టికవిత ప్రతి భాషావాఙ్మయములో నుండును. కాని తెలుగు పదకవిత కొక విశిష్టత యున్నది. సహజసారళ్య సంశోభితమును, మృదు మధురగాన యోగ్యము నగు తెలుగు పదములలో నాదసౌందర్య మున్నట్లు తెలిసికొందము. పాశ్చాత్యులు సైతము మన భాషను మెచ్చుకొనిన కారణ మిదియే ![1]

మన దేశములో పద కవిత్వ మనాదిగా, ననుస్యూతముగా వర్తిలుచునే వచ్చినది. ప్రాక్తన మానవుడు ప్రకృతి శోభకు పరవశుడై యనిర్వచనీయమగు నానందమును పొందియుండును. తన మనో భావమును ప్రదర్శించుట కాతడు చిందులు త్రొక్కి చప్పట్లను చరచి, శబ్దరహితమైన నాద మాలపించియుండునని భావింపగలము.[2] అజ్ఞాతావస్థలోని మానవుని మనసుపరిశీలించిన శిశుమానసమువలె, నవనీత

---

1 Telugu is the Italian of the East.

2 Moulton's Theory.

సదృశమైన దని తత్త్వజ్ఞులు చెప్పెదరు. శిశువు కూడ లయ యానందమును పై విధముగనే ప్రదర్శించునట్లు ప్రత్యక్షముగా చూడగలము. సృష్ట్యాదినుండియు నిశిత నిర్భరమా మానవుని భావానుభవము లయాన్విత మైన భాషలోనే వ్యక్త మగు చుండుట తథ్యము.★ ఈధర్మానుగుణముగనే వాల్మీకి శోకము శ్లోకత్వ మందినది. ఈ విధముగా నుద్భవించిన గీతి యుద్రేక పూరిత మై యుండి రాగ రంజిత మగును. ఇట్టిగుణము పద కవిత్వములోనే యుండుట కెక్కుడవకాశమున్నది కాని పద్యములో నుండుటకు వీలులేదు. పదకవిత్వ ముద్రేకోత్సాహ ప్రేరితములగు కర్తృభావములు కలదగుటచే పఠితృ శ్రోతృ హృదయములలో నాభావములు సూటిగావెడలి, నిశితముగా నాటుకొని, వేగముగా నుద్దిష్ట రసానుభూతి పొందించును. ఇంత త్వరితముగా బోధించు గుణము మాత్రా ఛందముల కున్నంతగా గణఛందముల కేలనో లేదు. ఇది పదకవిత్వమున కున్న విశిష్టగుణము.

ఈ విధమైన పదకవిత్వము రాజాస్థాన గౌరవము పొందదు. పొందలేదని విచారమక్కరలేదు. రాజసభలలో నంతయుకృత్రిమవాతావరణము. అందాదరముపొందుకవులు, కవిత్వము కూడ స్వేచ్ఛారహితమై రాజుల కనుసన్నల మెలగుచుందురు. కాని పదకవిత్వము ప్రజాసామాన్యము పాలిటి పెన్నిధి. రాజాదరణముతో దీనికి నిమిత్తములేదు.

★ Ever since man has been born, all deep and sustained feeling is seen to express itself in rythmical language.
— S. Mill.

ప్రజలకానందముచేకూర్చి, వారిచేమన్ననలు పొందుచు, వారిని నిరాడంబర జీవులుగా, తేజో మూర్తులుగా, నుత్తమ శీలురుగా సంస్కరించుటే దాని యుద్దేశము. ఈపదకవితానిర్మాతలుకూడ ప్రజాదరణమునే వాంఛించిరిగాని రాజాజ్ఞలకులోబడి నట్లు గాన్పించరు. అట్లు కానిచో వారికవితలో నంతటి యుద్ధృతముస్వచ్ఛతస్వతంత్ర భావములుండుట కవకాశమెట్లు పొసగును? ఈపదకర్తలు కీర్తికాములు కారనియు, స్వేచ్ఛా జీవులనియు, సున్నిత హృదయులనియు, ముముక్షువులనియు, వారి వారి రచనలనుబట్టి తెలిసికొందుము. అనేక ప్రాచీన పదములకు కర్తలెవరో మనకు తెలియుటలేదు. కాని యా పాటలుమంచి ప్రచారము నందినవిగా చూతుము. ఇందు వారి స్వార్థరహిత బుద్ధిని, పరార్థ సేవనుమనము చూడ గల్గుదుము. ఈ పదకవిత్వ మింత కాలము ప్రజల నాలుకల పైననే వర్తిలుచు ప్రాచుర్యము పొందుచున్నదనిన నా కవితా ప్రభావ మెంతటిదో గదా!

తదితర దేశములవలెగాక భారతదేశము ప్రధానముగా వ్యావసాయిక దేశము. పనిపాటలవా రీదేశమం దెక్కువగా నున్నారు. యంత్రయుగము రాకపూర్వము పనివారల కలసట కలుగకుండ నీ పదకవిత వారికి నుత్సాహ మిచ్చుచుండెడిది. మన కీనాటికిని పల్లెలలో నీ విధముగా పదకవిత యుపయోగపడుచుండుట గాంతుము. పాశ్చాత్యదేశములలోవలె గాక మన దేశములో పారలౌకిక చింతయే ప్రముఖమై యొప్పారునది కావున మన దేశ కవిత్వములో

[illegible]
లలో ప్రవహించు నదీనదములు పూ ఫల లతాదులతో శోభితమగు వనములు, సముద్రతీరములు, ఉద్యానములు, పర్వతశ్రేణులు, కీరకోకిలాది విహంగరుతములు భారతీయ ప్రకృతిలోనివి. పాశ్చాత్యులకీవిధమైన సహజ ప్రకృతిశోభ లేదు. ఈ ప్రకృతిశోభ భారతీయ కవిత్వములో ప్రతిబింబించుచుండును. పదకవిత్వములో శృంగారగీతములు ప్రకృతి ప్రభావములే. ధైర్యపౌరుషములలో భారతదేశము ప్రశస్తి జెందినది. అనేక వీరు లసమానముగా రణరంగమున పోరాడి మృతిజీవులైనారు. కవితలో నీ విషయమును స్థానము గొన్నది. ఈవిధముగా భారతదేశము సార్థక్యము కలది. తదనుసారిగా కవితకూడ తదితర దేశముల కవితకన్న విలక్షణమైనది. ప్రకృతి సౌందర్యము, తత్త్వజిజ్ఞాస వీరగాథలు భారతదేశపు స్వత్వములు. ప్రాచీన పదములను పరిశీలించినచో వీర, శృంగార, తత్త్వపరములుగా నున్నట్లు కన్పించును.

మన పదకవిత్వములో నుపాదేయమగు మాత్రా ఛందస్సు దేశీయమైనది. తదితర గణ ఛందస్సులవలె సంస్కృత లక్షణానుసారి కాక యిది విలక్షణమైన తెలుగువారి సొమ్ము. ద్విపదలు, త్రిపదలు, చౌపదులు, షట్పదులు, రగడలు, అక్కరలు మొదలైనవి దేశీయ ఛందస్సులు. ప్రాచీన పదకవిత్వ మంతయు నైవానియందే చెప్పబడినది. కీర్తనలు, దరువులు, పాటలు, పదములు, గేయములు, గీతములని యీ పదకవిత్వములో ననేక తరగతులకు చెందిన రచన లున్నవి. వీనిని పాడుటకు ప్రత్యేక ఫణితులు, నియమ

మిత సమయములు, కొన్ని వృత్తిసంఘము లుద్దేశింపబడినవి. అనాదినుండి యీ పదకవిత్వమును మన దేశీయులు తమ తమ వంశపారంపర్యముగా నందించుకొనుచు వేదములవలె భద్రపరచినారు.

ఆంధ్రసాహిత్యచరిత్ర నవలోకించుచో నీ పదకవితా ప్రశంస యందందు కన్పించుచున్నట్లు తెలియుచున్నది. పండ్రెండవ శతాబ్దమునాటికి మన సాహితీప్రపంచములోనికి శైవకవులు ప్రవేశించినారు. వీరు భాషావిప్లవము తెచ్చిపెట్టినారు. ప్రజలలో వీరశైవమత వ్యాప్తి కలిగించుటకు కావ్యమును చేపట్టినారు. సంస్కృతపదభూయిష్ఠ రచన ప్రజల కందుబాటులో నుండదని 'జానుతెనుగు' భాషలో వ్రాయ మొదలిడినారు. వృత్తములకు బదులుగా దేశీయఛందమైన ద్విపదలో కావ్యముల వ్రాసి, మతప్రచారమునకు దేశీయ ఛందస్సు, వ్యావహారికభాష లత్యంతోపస్కారములని కని పెట్టినారు. ★ శైవపరములైన గీతము లనేకము లల్లబడి శ్రీశైలము వెళ్లు యాత్రికులవలన, భక్తులవలన ప్రాచుర్యమొందినట్లు పండితారాధ్యచరిత్రలో వ్రాయబడినది. తుమ్మెదపదములు, నివాళిపదములు, వాలేసుపదములు, ప్రభాతపదములు, పర్వతపదములు, ఆనందపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు, సెజ్జవర్ణనపదములు మున్నగునవెన్నియో భక్తులచే పాడబడుచుండెడివట!

★ 'ఒప్పదు ద్విపద కావ్యోక్తి నా జనదు, ఆయూఢ గద్యపద్యాది ప్రబంధ, పూరిత సంస్కృతభూయిష్ఠరచన, మానుగా సర్వసామాన్యంబుగామి, జానుతెనుగు విశేషము ప్రసన్నతకు'

తరువాతకాలములో రంగనాథుని రంగనాథరామాయణము ద్విపదకావ్యముగా వెలసి 'తోలుబొమ్మలాట' ద్వారా ప్రజల కందుబాటులోనికి వచ్చినది. ఇట్లేగౌరన రాఘవార్యుల హరిశ్చంద్ర, నలోపాఖ్యానములు ద్విపదకావ్యములుగా నవతరించినవి. శ్రీనాథుడు పదకవితను ముదిలంజతో [1] పోల్చి హాస్యించినను పల్నాటివీరచరిత్రమును ద్విపదకావ్యముగా నిర్మించి పదకవితావాఙ్మయములో శాశ్వతస్థానము నలంకరించినాడు. సమాజములో భావావేశము ప్రేరించు సన్నివేశములు పదకవితావస్తువుగా పరిణమించి జాతి నుద్బోధించుచుండును. ఇట్టివే కాటమరాజుకథ, బాలనాగమ్మకథ, కామమ్మ కథ మొదలైనవి.

పదునారవ శతాబ్దమునాటికి ప్రబంధప్రక్రియకు గౌరవము హెచ్చినను పదకవిత వర్ధిలుచునే వచ్చిన ట్లాకాలమునకు జెందిన తాళ్లపాక చిన్నన రచించిన వేంకటేశ్వర స్తుతి పదములు, ద్విపదరచనలు [2] ఋజువుపరచును. కందుకూరి రుద్రకవి [3] కూడ నష్టపదులు రచించి పదవాఙ్మయమునకు నివాళిపట్టినట్లు తెలియుచున్నది. ఇట్లే రాయలకాలమందును పదకవిత వరలినట్లును, ప్రబంధమం దాదరముచేనది మరుగుపడుచు వచ్చినట్లును కన్పించును.

---

1 'ముది' విటులు విధవలంజలు
పదకవితలు..............

2. దీని నంతటిని సంపుటములుగా శ్రీ తిరుపతి దేవస్థానమువారు ప్రచురించుచున్నారు.

3. కొందరీతనిని నాయకరాజుల కాలములోనివా డని చెప్పుచున్నారు.

పిమ్మట పదునేడవ శతాబ్దములో నాయకరాజుల పరిపాలనక్రింద గీతికి నాదరము మెండాయెను. గేయవాఙ్మయము విరివిగా పెరిగినది. యక్షగానము లుద్భవించి మాత్రాఛందస్సున కవకాశము మిక్కుటముగా నిచ్చినవి. సంగీతమునకు రాజాస్థానములలో నత్యంత గౌరవము లభించిన దినములవి. శహాజీకాలములో తిమ్మయ ద్విపద భారతమును రచించినాడు. తరువాత శరభోజీకాలములో (1711-28) త్యాగరాజు భక్తిపారవశ్యమున కీర్తన లనేకము రచించియున్నాడు. విజయరాఘవనాయకుని కాలమునకు జయదేవుని గీతగోవింద పద్ధతిని క్షేత్రయ తన పదములను రసవంతముగా నల్లినాడు. ఇవి రాధాకృష్ణుల శృంగారమును వర్ణించునవై నేటికిని ప్రచారములో నున్నవి. తరువాత దీక్షితులు, శ్యామశాస్త్రులు మొదలైనవారు త్యాగరాజు ననుసరించి, తరంగములను, కీర్తనలను రచించినారు. ముద్దుపళనికూడ రసవంతముగా సప్తపదులను వ్రాసినది. మొత్తముమీద తెలుగుతీయదనము, నాదగౌరవములు నాటికవులు తిన్నగా తెలిసికొని తమపదములలో దిద్దినారని చెప్పవలెను.

తరువాతకాలములో పదకవిత్వ మపరిమితముగా వృద్ధి పొందినది. అధ్యాత్మరామాయణ కీర్తనములు, రామదాసు కీర్తనములు, స్త్రీలపాటలు, భజన కీర్తనములు, తత్త్వగీతములు మున్నగునవి యెన్నియో రచింపబడినవి. పదకవిత్వములో స్త్రీల పాటలు విలక్షణమైన స్థానమును వహించును. మన జాతిజీవనమంతయు నందు ముద్రితమైనట్లు గ్రహింపగలము. జోలపాటలు, తలుపుదగ్గర పాటలు, మంగళహారతులు మేలు

కోలుపులు, వరసపాటలు, లాలిపాటలు, నలుగుపాటలు, బూజంబంతిపాటలు, చెండాటపాటలు, ఒప్పగింతలపాటలు, మొదలైనవి జాతీయ జీవనమునకు ప్రతిబింబములు. ఇవిగాక అక్కలపాటలు, నాగారుబొమ్మపాటలు మొదలైనవి తెలుగు వారి యాచార వ్యవహార నమ్మకములను చాటుచుండును. వీనిని పురుషులేకాక స్త్రీలుకూడ నెందరెందరో రచించినారు. ఊడుపుపాటలు ,నూర్పిళ్లపాటలు, దంపుళ్లపాటలు, పడవ పాటలు మొదలైనవి నేటికిని ప్రచారములోనుండి వ్యావసాయిక జీవితమును చాటుచున్నవి. పోతులూరి వీరబ్రహ్మంతత్త్వ ములు, 'జీవా' అనియు 'మనసా' అనియు 'చిలుకా' అనియు మకుటముగల తత్త్వగీతము లనేకము లున్నవి. తులసిపాటలు దండకములు, గోవిందనామాలు మొదలైనవి భక్తిపరము లైనవి కలవు. బుడుబుక్కలపాట, గంగిరెద్దుపాట, గొబ్బిపాట, బతకమ్మపాట మున్నగునవి కొన్నికాలములందే పాడుట విన్పించుచుండును. దాగుమూతలు, వెన్నెలకుప్పలు, చెమ్మ చెక్కలు, గుడుగుడుగుంజం, కాళ్లాగజ్జ,కోలాటము మొదలైన యాటలాడుచు పాటలుపాడుకొనుట యాంధ్రబాలికా సంప్ర దాయము. ఊర్మిళాదేవి నిద్ర, సీత సీమంతము, లక్ష్మణదేవర నవ్వు, లంకాయాగము, కుశలాయకము, సత్యభామ సరసము, ద్రౌపది వస్త్రాపహరణము మొదలైనపాటలు మన పురాణాది గ్రంథములలోని విషయములను పురస్కరించి వ్రాయబడినవి. ఇవి స్త్రీలను విజ్ఞానవతులుగా జేయు తలంపుగల యిటీవలవారి యత్నఫలము. దాసు శ్రీరామపండితుడు జావళీలు, కీర్తనలు రచించి ఖ్యాతి వడసినాడు. తురగా వెంకటరామయ్య,

గాలి సుబ్బారాయుడు, పుసులూరి సుబ్బారాయుడు, వెంకమాంబ, నరసమాంబ, రామలక్ష్మమ్మలు ఇటీవలి పదకర్తలలో కొందరు.

ఈ శతాబ్దములో పదకవిత్వమున కెన్నడు లేని యాదరము చేకూరినది. ఆంగ్లసాహిత్యావలోకనము వలన మొదట మన సంప్రదాయమును నిరసించినను, తరువాత క్రమముగా స్వీయసంస్కృతిపై ప్రత్యయము హెచ్చినది. దేశీయవస్తువులపై నభిమానము జనించినది. ఆంగ్ల జాతీయమైన మాత్రాఛందమునకు, జాతీయ నుడికారము కలిగిన వ్యావహారిక భాషకును గౌరవ మభివృద్ధిజెందినది. తత్ఫలితామమే గేయకవితావిర్భావము. మన ప్రాచీన కవితాచరిత్ర, జాతిజీవనము, సంప్రదాయములను తెలిసికొనవలె ననెడి యాకాంక్ష పొడమినది. తన్నిమిత్తము పరిశోధనలు జరుగుచున్నవి. ఇది శుభసూచకమే! ఈ శతాబ్దములో కవులు గేయములు వ్రాయుచున్నారు. దేశభక్తి ప్రబోధకగేయములను వ్రాసినవారిలో శ్రీయుతులు గరిమెళ్ల సత్యనారాయణ, మంగిపూడి వెంకటశర్మలను పేర్కొనితీరవలెను. ప్రణయపరముగా శ్రీ నండూరి వెంకటసుబ్బారావు రచించిన "ఎంకిపాటల" కున్న గౌరవ మింతింతని చెప్పలేము. భక్తిగీతములు హరినాథ సాయిబాబాల పరముగా వెలువడుచున్నవి. శ్రీ పెండ్యాల సీతారామయ్య పేర్కొనదగినవాడు. నవ్యులలో అడివి బాపిరాజు, కీ.శే.బసవరాజు అప్పారావు, కవికొండల వెంకటరావు, చింతా దీక్షితులు ప్రభృతులు పదములను రచించి ఖ్యాతి గడించుచున్నారు.

సాహిత్య

పదకవిత్వ మీవిధముగా మన సాహిత్యములో ననాదిగా వర్తిలుచు ప్రజల సానుభూతి పొందుచున్నది. దీనిని పిచ్చుగుంటలవారు, జంగములు, గొల్లలు, చెంచువారు, పగటివేషధారులు, దాసరులు, మున్నగువారు వృత్తిసంఘములుగా చేసి పదకవిత్వమును శ్రావ్యముగా పాడుచు నేళ్ల తరబడిగా భద్రపరిచినారు. పూర్వులకున్న జ్ఞాపకశక్తి, యవధాన గుణము లీనాటివారికి లేవు. అదియునుగాక ముద్రణాదిసౌకర్యములు వచ్చినందువలన మౌఖిక మొనర్పవలసిన యావశ్యకత తప్పిపోయినది. మానవునికి నాగరకత వృద్ధియై పల్లెవేయుట న్యూనతగా భావించునంతటి సౌకుమార్య మబ్బినది. ఇవియన్నియు కారణములుగా పదకవిత్వమే బ్రతుకు తెరువుగా చూచుకొనుచున్న పై వృత్తి సంఘముల కాదరము క్రమముగా క్షీణించినది. తదితర వర్గములవా రేవిధముగా నీ పాశ్చాత్య నాగరకతా సంపర్కమువలన తమ తమ ధర్మముల విడచి 'సర్వం జగన్నాథం' అనె సాంకర్యమునకు లోనైరో యట్లే యీ వారసత్వమును గూడ భరింపలేక క్రమముగా నా వృత్తుల మాని యాంగ్లవిద్యాభ్యాసము మొదలిడి యందరిలో కలిసిపోయిరి. అంతతో పదకవిత్వ మడుగంటినది. విద్యార్జనమునకు పల్లెలనుండి ప్రజలు పట్టణముల కెప్పుడు వచ్చిరో యప్పుడే పదకవిత్వమునకు ప్రచారము నాశమైనది. నేడు ప్రాచీన పదకవితా వైభవము నరయుటకు సరియైన యవకాశములు లభించుట లేదు. ఆ ప్రాచీన సంప్రదాయము వదలలేక యెచటనైన నీవృత్తిసంఘము లున్నను, పదకవిత్వ సమగ్రస్వరూపము దాటిపోయినట్లే. ఒకజాతి పదకవిత్వము

నశించిపోయినచో నాజాతి సంస్కృతికూడ నాశమైనట్లే భావింపవలెను.

కావున సాహితీసేవకులు మన ప్రాచీనపదకవిత్వమును సేకరించుటలో వారికాలము వ్యయింపవలసియున్నది. శ్రమకోర్చి యూరూరు తిరిగి, ప్రాచీనపదములను, కీర్తనములను పాటలనాయా స్థలములందున్న వృద్ధులనుండి, పనిపాటల వారినుండి గ్రహించి వ్రాసికొని యొకచో గూర్చుట మన జాతికర్తవ్యము. అనగా ప్రతివాని బాధ్యతయని తలంపవలెను. ఇట్టి సంకలనము సంఘజీవితమును చిత్రించు చరిత్రకారుని కత్యంతోపయుక్తమగుటయే కాక, స్వచ్ఛమై జాతీయమైన తెలుగుభాషాస్వరూపమునందించినదగును. ఈపదకవిత్వమును సేకరించి ప్రచురించినను వానిని పాడవలసిన ఘణుతులలో పాడువారుండకపోయిన ప్రాచుర్యము లేకపోవును. ఇందులకాయా వృత్తిసంఘములను పోషింపవలెను. అప్పుడుగాని సంపూర్ణము గాదు. కావున నిట్టిపదకవితా సంపుటమొకటి కూర్చి ప్రకటించి ప్రాచుర్యము కల్గించుట మన ప్రజమీద నున్నది.★ పదసాహిత్యమునకు నివాళి పట్టుడి సాహిత్యార్చకులు రావలసియున్నారు. శ్రీయుతులు దేవేంద్రసత్యార్థి, నేదునూరి గంగాధరము, టేకుమళ్ల కామేశ్వరరావులు చాలవరకీమార్గములో కృషిచేయుచున్నారు. ఇటీవల విద్యలేని ప్రజలపై సానుభూతి

★ నీచక్కని సాంప్రదాయమును—కమ్మని పలుకుబడిని—విశిష్టమైనభాషాన్యాయము - చవులూరు జాతిచ్ఛందస్సులను - నీ జన్మహక్కుగా పోరాడి రక్షించుకోవలసిన అవసరముమాత్ర మున్నది. శ్రీఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి ఆంధ్రకుగాది - బహుధాన్య.

హెచ్చుచున్నది; ప్రజావాఙ్మయము వ్రాయవలయు ననెడి యభిప్రాయము కల్గినది. దేశభాషాభిమానములుమిక్కుటమైనవి. ప్రజలలో విజ్ఞానవ్యాప్తికై దీక్షవూనినవారు కాలయాపనము చేయక యీ పదకవిత్వమును సేకరించుచో ప్రాచీన పదకర్త లిచ్చిన సంపద యొక్క విలువను గుర్తించి సేవచేసినట్లగుదురు. ఇట్టికార్యమునకు ప్రస్తుతకాల మత్యంత మనుకూలించును. సాహితీసేవకు లుత్సాహముతో నీకాలమును సద్వినియోగ మొనర్తురని యాశపడుచున్నది.

ప్రబంధ వాఙ్మయము*

○

వాఙ్మయముయొక్క స్వరూప నిర్ణయ సందర్భమున ననేక ప్రమాణములఁబట్టి యనేక భేదములను మన యాలంకారికులు నిర్ణయించినారు. ఛందోలక్షణము ననుసరించి కావ్యములు గద్యాత్మకము లనియు, పద్యాత్మకము లనియు, గద్యపద్యాత్మకము లనియు మూఁడు విధములుగాఁ బరిగణింపబడినవి. ఈ గద్యపద్యాత్మకమను కావ్యజాతిలోఁ జేరునదే ప్రబంధము. కాని గద్యపద్యాత్మకమైన ప్రతికావ్యము ప్రబంధము కానేరదు. చంపువులు నాటకములు, పురాణములు, ఇతిహాసములు- గద్యపద్యాత్మకమైన కావ్య ప్రక్రియను జెందినవే. కాని భిన్నలక్షణములు గలిగిన వీని నధిగమించి, విశిష్టమైనస్థానము నందుకొనినది ప్రబంధము.

కావ్యమునకు భావ వస్తు రచనలు ప్రధానమైనవిగా పెద్దలు ప్రతిపాదించినారు.[1] ప్రబంధమం దితర కావ్యభేదముల కన్న వస్తువు నాలంబనముగాఁ జేసికొని, భావరచనల కెక్కుడు స్థాన మొసంగినట్లు గమనింతుము. ప్రబంధోచితమైన వస్తువును గ్రహించుటలో విశిష్టత లేకపోలేదు. అట్టి

★ నవంబరు 1943 లో వ్రాయబడినది.

1. శ్రీయుతులు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, కురుగంటి సీతారామయ్యగార్లు.

వస్తువుయొక్క యునికియేకాక తద్దేహమున కావశ్యకమగు సంధిసామగ్రి, సౌందర్యప్రసాదితమగు నితరావయవ సౌష్ఠవము లుండవలెను. అపుడే ప్రబంధ మగును. కావ్యము దంగాంగిభావము లేనిదే సౌందర్యము పూర్ణము కాదు. కావ్యమందలి ప్రత్యేకయవయవములకును, వస్తువునకును, ప్రకృష్టమైన బంధముండుటను గనుకనే యీ శిల్పమూర్తికి ప్రబంధమను పేరు వచ్చినది. 'ఈ ప్రబంధ మాంధ్ర వాఙ్మయ వనములో నుద్యానమువంటిదిగ సాహిత్యవేత్త లుపరిగణించినారు.

(కావ్యమీమాంస జేసిన పూర్వాలాక్షణికుల మతములన్నియు, నింపుమించు ప్రబంధములే' కన్వయించునవియే చెప్పవచ్చును. 'రమణీయార్థప్రతిపాదక శబ్దః కావ్యమ్' అను జగన్నాథుని నిర్వచనము నిలచియున్నదిగదా! పూర్వాలెనరెవ రేయే యంశములకు ప్రాధాన్య మిచ్చి నిర్వచించినను కావ్యములోని బీజభూతమగు నభిప్రాయము నేకీభవించియే యున్నారు. కావ్య సామాన్యలక్షణము లేకాక ప్రబంధమను మహాకావ్యమునకు లక్షణము వేఱుగ నిర్వచించిన విధ మారాయుదము. పురాణేతిహాసములలోని యుపాఖ్యానమును జేపట్టి స్వకపోలకల్పనలచే దానిం బెంపుచేసి, యష్టాదశ వర్ణన లందరమునం జొప్పించి, రసాభివ్యక్తికిని, పాత్రచిత్రణమునకు నెక్కుడు ప్రాధాన్య మొసంగి, శబ్దార్థాలంకార సహితముగా సాగించిన రచనను ప్రబంధమనినారు. ఈ వచనమునకుం దగినట్లుగాం బూర్వలాక్షణికోదాహృత శ్లోకముల నిట నుదాహరింతును. అష్టాదశ వర్ణనల నుగ్గడించుచు —

సంధ్యా సూర్యేందు రజనీ ప్రదోష ధ్వాంత వాసరాః
ప్రాత ర్మధ్యాహ్న మృగయా శైలర్తు వన సాగరాః
సంభోగ విప్రలంభౌచ, మునిస్వర్గ పురాధ్వరాః
రణ ప్రయాణోపయమ మంత్ర పుత్రోదయాదయః
వర్ణనీయా యథాయోగం సాంగోపాంగా అమీఇహ

అని పేర్కొనినాఁ డా లాక్షణికుఁడు. సర్వ ప్రబంధ సామాన్యలక్షణముగా—

"ఆదౌ నమస్క్రియాఽఽశీర్వా వస్తునిర్దేశ ఏవ వా
క్వచిన్నిందా ఖలాదీనాం సతాంచ గుణకీర్తనమ్"

అనియు నిర్దేశించిరి. పాత్రనిర్మాణ సౌకర్యార్థమై యుదాత్త నాయకుని చరిత గ్రహింపవలయునని—

"సర్గబంధో మహాకావ్యం తత్రైకో నాయకస్సురః
సద్వంశః క్షత్రియోవాఽపి ... ...
ఏకవంశ భవా భూపాః కులజా బహవోఽపివా"

అను శ్లోకమందు వచించెను.

అప్పకవియుఁ బైశ్లోకార్థములనే తన లక్షణ పద్యమందుఁ జొప్పించెను. కాని, యష్టాదశ వర్ణనములకు మాఱుగాఁ నిరువది రెండువర్ణనలను చెప్పవలయునని సంఖ్య బెంచినాఁడు.

పురమును ఋతుషట్కమును బ్రయాణంబును
శైలంబు వేఁటయు సాగరంబు
మౌనీంద్ర పుణ్యాశ్రమంబును మంత్రంబు
ద్యూతంబు పిదప నద్భుత రణంబు

విజయంబు మద్యపానజవికారంబును
వనవిహారంబును వారికేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
భ్యుదయంబు విప్రలంభోదయంబు
శస్త్ర మిత్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహృదంబును సుతజననము
ననగ నిరువదిరెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయుఁ బ్రబంధంబు శ్రీనివాస")

'ప్రబంధ' పదము మనకుఁ [illegible] ప్రాచీనముగా నుండినను తిక్కన ప్రయోగము సార్థకమగుచున్నది. 'ప్రబంధ మండలి' అను ప్రయోగము నొక [illegible] యగ్రప్రమాణము గ్రహించుట యిట నవసరము. భారతమును ప్రబంధమండలి యనుటలోఁ దిక్కన దృష్టి యితఃపూర్వము మనము నిర్వచించిన ప్రబంధ శబ్దమునకుఁ [illegible]గునదిగా నున్నట్లు స్పష్టము. తిక్కన యొక్కొక పర్వమును[1] బ్రత్యేక ప్రబంధముగా నొనరింపవలెనను దృష్టితో రచించెను. ప్రబంధోచితమైన పాత్ర చిత్రణము తిక్కన రచనలో సువేద్యము. మనుచరిత్రములో వరూధిని పాత్రమును చిత్రించుటకు తిక్కన ద్రౌపది పాత్ర చిత్రణమే పెద్దనకు కౌశల్యము నిచ్చినదన వలెను. పాత్రచిత్రణమున నాంధ్రులలోఁ దిక్కనయే ప్రథమ శిల్పి! కనుక, ప్రబంధ [illegible]తామ్నాయక్షేత్రమునఁ దిక్కనచే నాటబడినట్లు కనబడుచున్నది.

1 విరాటపర్వము 'కీచకవధ' ప్రధానముగా నొక ప్రబంధ మగును.

శంభుదాసుని గ్రంథములో నైతము ప్రబంధశబ్దము గాన్పించుచున్నది. అదియునుంగాక, యెఱ్ఱాప్రెగడకు ప్రబంధపరమేశ్వరుడను బిరుదనామము గలదు. ఇతని నృసింహపురాణము పేరునకు పురాణమేకాని సత్యమునకు ప్రబంధ మగును. ప్రబంధోచితమైన ప్రాత్రచిత్రణము నెట్లు తిక్కన సాధించినాడో యెఱ్ఱాప్రెగడ వర్ణనల నట్లు తన రచనలందు మిక్కుటముగా వెలయించినాడని గ్రహింపగల్గుదుము.

ఇవ్విధముగా ప్రబంధ బీజము కవిత్రయ కాలమునాటికే నాటబడినట్లు తెనుగు సాహిత్యక్షేత్రజ్ఞులు తెలిసికొనగల్గుదురు. శ్రీనాథుని యుగమునందు పెరిగిపెద్దదై ప్రబంధ వృక్షము పెంపువహించినది; తర్వాత శ్రీకృష్ణరాయలపోషణమున చిగిర్చి శాఖోపశాఖలు వేసి పూతపూచి ఫలవంతమై విలసిల్లినది.

పూర్వోక్తమగు ప్రబంధశబ్ద నిర్వచనమున కెల్లెడల సరియగు కావ్యము శ్రీనాథుని గ్రంథములలో లేకపోలేదు. అతని శృంగారనైషధము ప్రబంధమగును. ఇందలి యితివృత్తము లోకప్రసిద్ధమైనది. దీనికి మాతృక భారతములోని నలదమయంత్యుపాఖ్యానమును కావ్యముగా నిర్మించిన హర్షకృత నైషధము. స్వకపోలకల్పనలతో శ్రీనాథుడు శృంగారనైషధము నపూర్వముగా నిర్వహించెను. వస్తూన్మీలనమందేమి సంభాషణా చాతుర్యమందేమి, పాత్రనిర్మాణ పోషణాది కార్యములందేమి, వర్ణనాకౌశల్యమందేమి శ్రీనాథు డప్రతిమాన నైపుణ్యమును ప్రదర్శించినాడు కాని, ప్రబంధతారోపణము పూర్తిగా జేయుటకు శృంగారనైషధ మను వాదము

గుట తిలిచ్చినదిగాదు. ప్రబంధములు సర్వధాస్వతంత్రములై యుండవలెనుగదా!

శ్రీనాథ రచితేతర గ్రంథములను బరిశీలించినచో హరవిలాసమునందు వస్త్వైక్యము లేకయు, భీమ, కాశీఖండము లందలివస్తువు స్థలపురాణ మగుటయు, సమగ్రప్రబంధలక్షణము నకు నిలువనివిగా నున్నవి. ఇవ్విధముగానే శ్రీనాథయుగ మందలి యితర కవికృత గ్రంథములను గైకొన్నను, కొన్ని యనువాదములగుటవలన, కొన్ని చిత్రాఖ్యానములగుటవలన, మఱికొన్నింట కోచితమైన సంభాషణాదికమే కలిగియుండుట వలన, నేవియు సమగ్రప్రబంధమున కుదాహరణములు కాలేక పోయినవి. ప్రబంధాంగములలో గొన్నికొన్ని ఆయాగ్రంథము లలో గన్పించుచుండునే కాని సర్వాంగ పరిపూర్ణస్వరూప సంధానము వీసియెడ గన్పించదు.

ఆంధ్రులు గర్వింపదగిన కాలము కృష్ణరాయల పరిపాలనా సమయము. అది స్వర్ణయుగ మనవచ్చును. రాజకీయములో, సాహిత్యములో నత్యున్నతస్థానము గడించిన యుగము. ప్రబంధ సుందరికి సకలాభరణభూషలు రాయల పోషణమందే లభించినవి. కృష్ణరాయలే స్వయముగా నీసుందరి నలంకరించినాడు. తన యాస్థానమందలి రసజ్ఞులైన కవి సత్తములచే నలంకరింపించినాడు. ఆ సంపూర్ణకళావిశేషమును జూచి మురిసిపోయినాడు.

శ్రీ కృష్ణరాయల పోషణమున సర్వలక్షణసమన్వితమైన ప్రబంధమూర్తి విలసిల్లినది. అష్టాదశవర్ణనముల శోభ జెందె.

శృంగారరస ప్రధానమై అర్థాతిశాయి యైన శబ్దరచనకలిగి, యాలంకారిక సాంకేతికములకు విధేయమై, యనతివిస్తృతమగు నితివృత్తముతో, భాషాంతరీకరణమునకు భిన్నముగా నుండి, పాత్ర సంపోషణమును బరిగణించు స్వతంత్ర గ్రంథము ప్రబంధమని పెద్దలనిర్వచనము 1/ ఈనిర్వచనమునకు సరితూగు గ్రంథము పెద్దనకృత మనుచరిత్రము. మనుచరిత్రమే పెద్దన కగ్రతాంబూలము సాహిత్యలోకమున లభింప జేసినది. వస్త్వైక్య మందేమి, వర్ణనములందేమి, అంగాంగి రస పోషణ మందేమి, సన్నివేశకల్పనమందేమి, పెద్దనామాత్యుడు పెద్ద గాకపోలేదు. వరూథిని సాహిత్యలోకములో స్థిరనివాస మేర్పరుచుకొన్నది; ప్రశాంతమూర్తియగు ప్రవరుడు పవిత్ర స్థానము నలంకరించినాడు. పాత్రచిత్రణములో నల్లసానివాని నల్లిబిల్లిగొను వాడితనము లేదనవలసివచ్చును. పాండితిలో నితనిని దలదన్నినట్లుగనిపించు వసుచరిత్రకారుడు సైతము పెద్దన ననుసరించినవాడేగదా! పెద్దన కైతకు మెరుంగులు దిద్ది సెబాస్ అనిపించుకొనినాడు రామరాజభూషణుడు. కవులను గిలిగింతపెట్టు కవితాభావములను ప్రదర్శించినాడు పెద్దన; పండితులను పట్టిచూచు శబ్దచమత్కృతి సర్వత్ర ప్రయోగించినాడు రామరాజభూషణుడు. ప్రబంధము పరకోటి వసుచరిత్రమందే 2 యందినదని నిశ్చయముగ జెప్పవచ్చును. కల్పనా జాతము హెచ్చుగ నుండుటచే కళాపూర్ణోదయము ప్రబంధ మనజాలము. పాండురంగమహాత్మ్యము కాళహస్తి

1 శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారి వచనము.

2 వసుచరిత్ర సంస్కృతీకరింపబడుట గర్వకారణము.

మాహాత్మ్యములు స్థలపురాణములగుట సమగ్ర ప్రబంధములు కాజాలవు. అయినను వానిలో నిగమశర్మోపాఖ్యానము, తిన్నని వృత్తాంతములు ప్రబంధోచిత వస్తు తత్వముగలవి; పాత్రపోషణమునకు నెక్కుడవకాశము గలిగియున్నది. రామాభ్యుదయము, పారిజాతాపహరణములు ప్రబంధములేయగును. పారిజాతాపహరణమున ప్రథమాశ్వాసము ప్రాధాన్యము వహించినట్లు కన్పించును. రామాభ్యుదయము సంస్కృతములో కావ్యప్రక్రియను నడచినది: సుందర ప్రబంధతాయోగ్యత లనేకము లింకున్నవి. ఇవ్విధముగా శ్రీకృష్ణదేవరాయల పోషణమున ప్రబంధసుందరి సర్వాలంకార భూషితమైనట్లు తెలిసికొంటిమి.

వసుచరిత్రవంటి శిఖరప్రాయమైన ప్రబంధము వెలసిన పిమ్మట, దానిఁ దీకొను కావ్య మింకొకటి యుద్భవింప లేదు. తరువాత వెలసిన ప్రబంధములన్నియు, మహావృక్షము క్రింద మొలచిన చిన్న చిన్న మొక్కలవలె గాంతివిహీనము లాయెను. వసుచరిత్రతత్వాలి నట్టి ప్రబంధము జన్మింప లేదు. తరువాత వచ్చినకవులకిది యాదర్శప్రాయమైనది. ఆదినములలో ప్రబంధమార్గమున రచించిన నే కావ్యముల కాదరణకలిగెడిది. అందుచే ననుసరణము లనివార్యము లాయెను. ఇట్టి గ్రంథములు కుప్పతిప్పలుగ నున్నవి. గ్రంథ నామములందును దాస్యము తప్పలేదు. కవిజన రంజనము, రసికజన మనోభిరామము, కవిరాజ మనోరంజనము లొకే విధమగు నామములుగదా!

ఈ యనుసరణములందు పెద్దననుండి వచ్చుచున్న కవిసమయములు, వర్ణనాక్రమము, పద్యముల యెత్తుగడలు,

సన్నివేశకల్పనములు, యథాతథముగ దిగుమతి యైనవి వంటి తిమ్మయ మూర్తికవులట్లుగాక మూలములకు మెఱుగు పెట్టిగాని యీవర్ణనాదికమును తమ గ్రంథములం దొప్పింపరు. సమర్థులైన కవులు జేయుపద్ధతి యట్టిది. కాకవులనుకరణముల తోడనే నామము గడించుటకై కడంగుదురు. ప్రబంధమే చర్వితచర్వణమైనపుడు తద్గతవర్ణనలు నట్టివైన, వినూత్నానందము ప్రసాదించుట దుర్లభమే కదా! కావున నీయనుసరణల వలన ప్రబంధములందు క్షీణదశయొకటి వచ్చినదని చెప్పవలెను. ఈ దశ యాంధ్రసారస్వతములోఁ బదునెనిమిది, పందొమ్మిది శతాబ్దములలో వరలినది.

నాయకరాజుల ప్రాభవమున వెలసిన సారస్వతములో విశిష్టప్రబంధములు లేకపోలేదు. అనంతభూపాలుని కకుత్స్థవిజయము, సవరము చినానారాయణప్ప నాయకుని కువలయాశ్వచరిత్రము లెన్నదగినవి. వీనిలో సైతము పెద్దన సూరనల భావరచనల కనుకరణములు ద్యోతించును. అయినను వీనికి ప్రత్యేకస్థాన మీయవలసియేయున్నది. ముద్దుపళని రచించిన శృంగారప్రబంధమగు రాధికాసాంత్వనము నెన్నక నాయకరాజయుగమును ముగించుటకు వీలులేదు. శృంగారప్రబంధములలో నిది మేలుపూస. కాని యేహ్యమగు భావచిత్రణ మీ గ్రంథమున నుంటయే దీనికి సరసులిచ్చిన దోషము. ఏతత్కారణముచే నిది క్షీణదశకు నాందివంటి ప్రబంధమైనదిగా భావింతుము.

*చూ: 'వసుచరిత్ర విమర్శనము': అనుబంధము — శ్రీ వఝ్ఝల పండితులు.

ఈ కాలమునకు జెందిన ప్రబంధముల నసభ్య శృంగారమే మిక్కుటమై వరలినది. విజయనగర సామ్రాజ్య మంతరించిన తరువాత దాని క్రింద నున్న సామంతు లందరు స్వతంత్ర ప్రభువులైరి. వీ రహంభావముతో విఱ్ఱవీగి విషయ లాలసకు లోనై కాలముగడపిరి. వీరి ప్రాపువడసిన కవులు రాజుల చిత్తవృత్తుల ననుసరించి కావ్యముల వ్రాయవలసి వచ్చినది. ఈ కారణమువలననే పచ్చిశృంగారము నాటి కావ్యములలో వర్ణితమైనది.[1] అటువంటి ప్రబంధములు తారాశశాంక విజయము, బిల్హణీయము, హంసవింశతి మొదలైనవి.

శ్రీనాదశయని పేర్కొనిన నెన్నదగిన ప్రబంధము లీ కాలమందుద్భవించలేదు. కాని వానిని మహోన్నతమైన కృతులుగా నెన్నలేము. కాని ఆంధ్రసాహిత్యములో వానికిని స్థానమున్నట్లు చెప్పవలెను. అవి విజయవిలాసము, ఉత్తర రామాయణము, మొల్ల రామాయణములు. విజయ విలాసము నాయకుడొక్కడే కాని నాయికలు పల్వురు. వస్త్వైక్యము లేనట్లుద్యోతించినను ఏకనాయకాశ్రయముగుటచేనొకింత ప్రబంధ చిహ్నమున్నట్లు చెప్పుకొనవచ్చును. ఉత్తరరామాయణము లోని వస్తువు ప్రబంధమునకు సుకుమారమైనను నందలిరచనలో కంకంటి పాపరాజు ప్రబంధోచిత బీజముల నాటినాడు. పాత్ర చిత్రణములో సన్నివేశ కల్పనలలో సంభాషణాది నిర్వాహణములో నడుమట ప్రబంధమూర్తి ప్రతిబింబించు నట్లు రచన నల్లినాడు. కథాకథనాత్మక మగు రామాయణము

1. A Hand Book of Telugu Literature P- 52

ప్రబంధముగా నవతరింపజేసినవారిలో అయ్యలరాజు రామభద్రుడు, కంకంటి పాపరాజు లగ్రస్థాన మలంకరింతురు. కుమ్మరిమొల్ల కవయిత్రులలో నున్నతస్థాన మాక్రమించునని చెప్పవలెను. చారిత్రకప్రబంధ మీ కాలములోనే తలయెత్తినది. కుమారధూర్జటివ్రాసిన కృష్ణరాయ విజయము, రంగాజమ్మ వ్రాసిన మన్నారుదాస విలాసము లుదాహరణములు.

ఇక నాధునిక కాలములో ప్రవర్తిలుచున్న సారస్వతమందు ప్రబంధ రచన మటుమట గోచరించుచునేయున్నది. ప్రబంధమూర్తిపై నేవ జనించుచున్నను, ఒకప్రక్క ప్రబంధ రచనము సాగుచునేయున్నట్లు గమనింతుము. పింగళి కాటూర్లు వ్రాసిన సౌందరనందన మొక విలక్షణమైన నవీన ప్రబంధము. ఈ నూతన యుగమున ప్రబంధమూర్తి కొక నవ్యాభరణము సేకూర్చినారు కవులు. చారిత్రక ప్రబంధములీ యుగముననే సర్వాంగసుందరముగ వెలయుచున్నవి. దుర్భాక రాజశేఖర శతావధాని రచించిన 'రాణా ప్రతాప సింహ చరిత్ర'యు, గడియారము వెంకటశేషశాస్త్రికృత 'శివభారతము' నుత్కృష్ట ప్రబంధముల కుదాహరణములు. పాణిని, పతంజలి, కాత్యాయనుల చరిత్రములను, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి 'మునిత్రయ చరిత్ర' మను పేర రసవత్ప్రబంధమును రచించి యందజేసినారు. చరిత్ర నింత రసవంతముగా ప్రబంధప్రక్రియలో నిమిడ్చి చిత్రించుట ప్రశంసనీయము. వీని ప్రాచుర్యము నుంచిన నీ నాటికిని ప్రబంధ ప్రక్రియకు సహృదయ సానుభూతి యున్నట్లు స్థిరమగుచున్నది.

ప్రబంధ వాఙ్మయము నొక్కమా రవలోకించిన, సంస్కృతవాతావరణమును బాగుగజీర్ణించుకొనబడిన ఆంధ్ర వాఙ్మయములో, దిక్కన ప్రబంధబీజమును నాటినట్లును, దానికి బాదుచేసి నీరువోసినవాడు శంభుదా సన్నట్లును, ఎరువుపోసి పెంచినవాడు శ్రీనాథు డన్నట్లును, పూత పూయునట్లు చేసినవాడు పెద్దన యన్నట్లును, ప్రబంధ వృక్షము బహుశాఖాయుతమ్మై శోభిలి ఫలవంతమైనది రామ రాజభూషణుని వలన నన్నట్లును గమనింపగల్గితిమి. తదుపరి చిన్నిచిన్ని మొక్కలు జనించినను తదున్నత వృక్షచ్ఛాయ వాడిపోయినట్లు, కొన్నిమాత్రము గిట్టినట్లును తెలిసితిమి. ఆంధ్రులు కవితారచనలలో నింతవఱకు ప్రత్యేకించి సాధించిన కావ్యప్రక్రియలలో నొక్క 'ప్రబంధము'ననే సిద్ధహస్తులైరనుటలో సందేహము లేదు. ఇది గర్వసూచకముగదా!

ఆంధ్రవచన స్వరూపము

సూ త్ర గ్ర థ న ము

★

మొదటి భాగము

కావ్యముయొక్క స్వరూప, జాతీయయోజనఁ జేసి నపు డనేకప్రమాణములనుబట్టి యనేక భేదములను (types) పాశ్చాత్యులును, మన యాలంకారికులును నిర్ణయించినారు. ఆప్రమాణములలో ఛందస్థితి, కావ్యములోఁ గద్య సంబంధము, వస్తుతత్త్వములు ముఖ్యములు. ఇందాద్యప్రమాణమగు ఛందస్థితి ననుసరించి కావ్యము త్రివిధములుగా విభజించినారు; గద్యాత్మకమనియు, నుభయాత్మకమనియు నివి చెలగుచున్నవి.

ఇఁకఁ బద్యమునకును *గద్యమునకు నున్న భేదము నారయుదము. ఇవి రెండును కావ్యశబ్దవాచ్యములే. ప్రాచీనాలంకారికులు నిర్వచించిన కావ్యత్వమీరెంటను బ్రవర్తిల్లును. అయిన భేద మెచట? పద్య మావేశపూరితమై, యుదాత్త విషయాన్వితమై, వ్యంగ్యమర్యాదాశ్రయమై, రసప్రధానమై వఱలుచుండును. గద్యమట్లుగాక, వస్తుస్వరూపయాథార్థ్యము

* ఇట గద్యమనఁగా వచన మని వాడుక. (Prose)

గలిగి, స్వభావోక్తి ప్రధాననియమముగా గలిగి, అన్వయ సౌలభ్య సహితముగా నపేక్షమాత్రమునన్ చెప్పు ప్రకృతానుసారియై భాసిల్లును. ఈ భేదమునే వివరించుచు 'ఆర్నాల్డు'

"The Rhythm and measure of poetry elevated to a regularity, certainity, and force very different from the rhythm and measure, which can pervade prose, is a part of its perfection."
అని వచించెను.

గద్యము పద్యముకంటె భిన్నమైనది; అది బాహిరముగాను యంత్రవత్తుగా నుండునది. పద్యమట్లుగాక హృద్గతభావమును నియమబద్ధముగా, లయాన్వితముగా (Rhythmical)నుంచునది. గద్యముదీనికిభిన్నమై, ఛందోనియమములు లేక, విరామాదులు లేక, యనేకగతుల నడచును. ఈ రెండింటికి భూజలధులకున్న భేదమున్నది. అనగా నొకటి ద్రవరూపముగలిగి చలనశక్తి కలిగినది. రెండవది ఘనీభూతమై స్థిరత్వమును బొందునది. గద్యపద్య భేదము కేవలము భౌతికభేదమే కాని వేఱుగాదు. అనగా, మనము పర్యాలోచించునవి మానసికసంబంధ విషయములుగనుక, నీ భేదము మానసికతత్త్వ సంబంధమైన భేదముగా నున్నది, చిత్తప్రవృత్తి ననుసరించు నొక ప్రక్రియ పద్యము. వేఱొక ప్రక్రియ గద్యము.(పద్యము సృష్టిస్వరూప పరిణామము. గద్యము నిర్మాణస్వరూప పరిణామము.) సృష్టి యనగా ప్రతిభాసమన్వితమైనది. భావావేశములోఁ బదములు పుట్టుచుండును. పదములకు నిర్దేశింపబడిన యర్థములు గాక, ఛాయాభేదములతో నవి నూత్న పదములగుచుండును.

భావమునకును, పదమునకును మధ్య నెట్టివిరామమునుండదు. భావమే పదముగను; పదమే భావమును సూచించును. ఇట్టి యవినాభావ సంబంధ మీ పద్యరచనలో భావపదములకు వర్తించును.

వచన రచనలో బదము లన్నియు యథాతథములుగా నిలిచియుండును. వానికున్న యర్థములోనే యవి వర్తిలును. నిర్మాణకార్యమునకు గడంగినపు డుపకరణము లన్నియు సిద్ధముగా నున్నట్లు, పదము లన్నియు యంత్రితవత్తుగా సకాలమున కవి తమ స్థలముల నాక్రమించుచుండును. వచన సృష్టికార్య మొక ప్రణాళిక ననుగమించునది. (దాని కొక క్రమ మున్నట్లు (logic) స్పష్టము.)

పద్యమందు భావోద్రేకమున కనుగుణముగా బదములు భాసిల్లునుగాని యొక నియమముగా నుండవు. కావున వచనములో నిట్టిభావావేశమున కనుగుణముగా వచ్చు పదములు దొరలినచోట నావచనము వచనముగాక, కవిత్వమే యగును. కార్లైలు వచించిన—

'Poetry is musical thought'

అను వచనానుసారిగా రసభావమును పొందు శబ్దార్థ స్వరూపమును ప్రదర్శించునట్టిదైన నది కావ్యమే యగును. విశ్వనాథకవిరాజు—

'వాక్యం రసాత్మకం కావ్యమ్'

అనిన వచనముగూడ(దుల్యమైనది. వచనరచనలలో శబ్దస్వరూపము నెఱింగి, దాని శక్తి (force) లేక వ్యాప్తిని

దెలిసి, యథాస్థానములో, సముచితమైన సందర్భములోఁ బొందగవలెను. వచనరచనకు శబ్దార్థస్వరూపజ్ఞాన మావశ్యకము. (రచయితకు శబ్దాధికారము లేనిదే వచనరచన రాణింపదు.)

(పద్యమెట్లు భావప్రధానము గలదియో, గద్యము టర్థప్రధానము గలది.)

(పద్యము సయితము గద్యముయొక్క లక్షణముకలిగియుండవచ్చును. అట్లు గద్యపద్యలక్షణముల (ఒక గణబద్ధత యందుగాక) గ్రహింపనగును.) ఇట్టి ప్రక్రియావిశేషద్వయములో నాద్యంబగు పద్యము లనేకములు గలవు. అట్టి పద్యములు నామమాత్రములే కాని వేఱుగావు.

ఉదా॥ ధర్మనిధియైన మీతండ్రి దశరథావ
నీశుఁ డొకనాఁడు నిజపురోహితునిఁ జూడఁ
దలఁచి రథమెక్కి సూతకృత్యంబు నేను
బూనగ వశిష్టముని వనంబునకుఁబోయి. (ఉ. రా.)

ఇట్టివి యనేకములు గానగును.

కవితావస్తువు లేక రసభావము లేకయే రచింపఁబడిన ఛందోనువర్తియైన రచన కవిత్వ మనిపించుకొనక, ఆత్మలేని శరీరమువలె నుండును. (కాబట్టి కవితయనునది భావమందున్నదిగాని, రచనలో లేదని చెప్పవచ్చును.)పద్యమందలి గణ నియమము శబ్దాలంకారమువంటిది. గద్యమందట్టిలోపమును బోనాడుటకై దానిని శబ్దాలంకార సహితముగను సమాస గుంఫితముగను రచించినట్లు కన్పించుచున్నది.)(వృత్తఘటిత

స్మృతులు, వైద్యగ్రంథములు కూడ మహాకావ్యములు కావలెను. కావుననే "గద్యం నికషం కవీనాం వదంతి" అని ప్రాచీనులు నిశ్చయించిరి. గణనియమము లేని లోపమును బోనాడుటకై రచించినదే-'ఓజస్సమాస భూయస్త్వమేతద్గద్యస్య జీవితమ్' అను వాక్యము. ఈ లక్షణము ననుసరించిన గద్యకావ్యములు సంస్కృతమున నున్నవి. పద్యరచనలో నున్నది. ఆ కవితాభావమున కొక గూడవు నమర్చుటయే.

> "Verse is apparelled only being
> but on ornament"
>
> —Sir Phillip Sidney.

కావ్యసృష్టికి అనుభూతి ప్రధానము. కవి తానుజూచిన వస్తువులోని సౌందర్యాదికములను అనుభవించి, అభివ్యక్తీకరించును. ఈవాక్కే 'రసభావము' తనచెంతాల్చుకొని శబ్దార్థస్వరూపము. (ప్రాక్పశ్చిమ మానవులు ప్రకృతిసౌందర్యమునకు ముగ్ధులై గంతులువేసి, పదము పాడి గ్రహింపగల్గినాము. వాల్మీకిశ్లోకము శ్లోకరూపమునే ధరించినది; కాని గద్యరూపముగాదు, కావున నానందానుభూతి బొందినపుడు లయాన్వితమైన గీతియే వెలువడును. ఇందలి సూక్ష్మధర్మమేమన, గీతిహృదయజన్యము. గద్యము బుద్ధి (Reason) జన్యము. హృదయప్రదీకరణము కళవలన గల్గును. బుద్ధినైశిత్యము శాస్త్రమువలన బొడమును. పై ప్రకరణమునుబట్టి, బుద్ధికంటె పూర్వము హృదయవికసనము సహజముగాన, గీతియే ముందు పొడసూపినది.

10

It is a sort of common place of literary history that verse is always older than prose, and in the case of most literatures—especially modern ones—it is almost demonstrably so —Saintsbury.

సారస్వతము వివిధశాఖా విరాజితము. ప్రతిశాఖయుం బరిపూర్ణత నందినగాని సారస్వతముయొక్క సమగ్రస్వరూపము ద్యోతకము కాదు. అభివృద్ధియనునది యెంత దేనైనను, క్రమముగా జరుగక లేక పోవునను గుర్తింపుము. అందుచే నే విభాగములు స్వయం వ్యాప్తమై, క్రమాభివృద్ధిని పొంది, సమగ్ర సారస్వతమునకు దోహదభూతములవలెను. గద్యపద్యము లను ప్రక్రియాద్వయములో గద్యమునకు చాలదినములవఱకు నాదరణముకలుగ లేదు. అందుచే వచనరచన యెక్కుడుగా నేవిషయమును విస్తారము కాలేక పోయెను. వచనము విషయబోధ నానువర్తి. ఇం దలంకారములకు ప్రాధాన్య ముండజాలదు. ఉద్దిష్ట విషయ మెప్పటను హృదయమునకు సూటిగాం దెచ్చుటకు వచనరచయిత ప్రయత్నించును. ఈ రచనములో వాచ్యార్థమే ప్రధానము. లక్ష్య వ్యంగ్యార్థములప్రధానములు. (లక్ష్య వ్యంగ్యార్థములు వచ్చిననా దది గద్యములో నున్న కవిత్వ మనిపించుకొనునేమోకాని, కేవల వచన మగుటకు వీలులేదు.) అట్లే విషయస్వరూపబోధకై సదృశవస్తువుల నెన్నినప్పుడట్టివి యలంకారము లనిపించుకొన్నను, అలంకార బాహుళ్యముండదని మాత్రము చెప్పవలెను. శబ్దచిత్రములు అర్థచిత్రములు శైలిభేదములలో వచనమందు కల్పించినను, కేవల వచనస్వరూప మది కాదని ప్రాజ్ఞులు తెలిసికొందురు. అను

స్ఫూర్తముగా వచ్చు భావములను యథాతథముగా గ్రహించి కాపాడునది వచనము.

వచనము సారస్వతమున ముఖ్యమైన శాఖ. భావమును నిగూఢము గావించి తికమకలం బెట్టుటకును, చెప్ప దలంచిన భావము నా పదజాలములో నా ఛందో విరామములోం జెప్ప లేకుండుటకును పద్యమున్నది. వచనరచనలో స్వేచ్ఛగలదు; రచయిత తన భావమును విస్తరించి బోధింప నగును. (విషయప్రధానమైన రచన వచనమే.)

(వచన మెక్కువగా శాస్త్రరచనములం దుపయోగపడును.) మానవజీవితమును సరిగా తెలియవలెననినగాని, తెలుపవలెనిననగాని వచనమే చక్కని వాహిని. ఈ భావములకే పూంతపూసి కావ్యకర్త పద్యములద్వారా వానిని కళయను రసాయనముగా తయారుచేయును. శాస్త్రకళల కున్న విభేదమే గద్యపద్యముల కున్నట్లు గ్రహింపనగును.

'When life is the criterion and not art, the prose of a nation is far more important than its poetry.'

—Evans.

చరిత్రలందుగాని, తత్త్వవిషయిక మీమాంసలందు గాని గద్యమే యుపాదేయముగాని పద్యము రాణింపదు. కావున వచనరచన తత్త్వవేత్తలకు, చరిత్రకారులకు నుపయోగపడునుగాని కవుల కంతగా నుపయోగకారి కాదు. పద్యస్వభావ లక్షణములం జొన్పి, గద్యమును కవులు తమ నవలలయందు, వ్యాసములందు, నాటకములందు వినియో

గించుకొననగును. అచ్చటచ్చట ననేక కావ్యభేదములలో నుపయోగింపబడుచు వచ్చిన వచనమును పర్యాలోచించుట కిష్టమే.

In literature prose embraces all forms of oratory and of representative discourse and the prose drama.

— New Standard Dictionary.

ఇందు ప్రతిపాదితమైన సంప్రదాయ మాంధ్ర వాఙ్మయములో నతి ప్రాచీనమైనదిగా గ్రహింపగల్గుదుము.

ఆంధ్రసారస్వతము నవలోకించుటకు పూర్వము ముఖ్యముగా రెండుభాగములుగా కాలమును భాగించుట యవసరము. ఆంధ్రమునకు సంస్కృతభాషవలన వచ్చిన ప్రాబల్యము, ఆంధ్రమున కాంగ్లభాషాప్రాబల్యము. ఇట్టి విభాగమువలన నేవిషయమునైన చక్కగా సమున్మీలింప వీలగును.

పదునెనిమిదవ శతాబ్ది తుదివఱకు సంస్కృతభాషా ప్రాబల్య మాంధ్రమున నింతింతని చెప్పరాదు. సంస్కృతానుసరణము, అనుకరణము, అనువాదములే తప్ప ప్రత్యేక ప్రతిభను చాటు సమగ్రప్రక్రియ యొకటైనను ఆంధ్రమున నవతరింప లేదు. ఒకింత యత్నము జరిగినదనిన 'ప్రబంధము' పట్ల నేమేని జరిగియుండును. అంతియే. అచటను మాతృకలు సంస్కృతములోనివే. ఇట్లు సంస్కృతములోని ఛందశ్శాస్త్రము, కావ్యములు, వైదికవాఙ్మయము — ఇవి యననేల — ఆంధ్రములోనికి యథాతథములుగా నవతరించి

నవి. కావ్యభేదము లన్నియు (నాటకము తప్ప) సంస్కృతము నుండి తెలుగులోనికి దిగుమతియైనవి. కావున సంస్కృత సంప్రదాయములు (భాషాశాస్త్రములు) తెలియని మానవునకిం దెలుఁగుసారస్వతపు దర్శనము కష్టకార్యము తోచుచుండినది. కానుగాను, ఆ పరిభాష, సంప్రదాయములు కేవల మాంధ్ర భాషకుఁజెందనవను భ్రాంతికూడ గలుగుచున్నది. ఇక్కారణముగా నాంధ్రభాషపై సంస్కృతభాషయొక్క ప్రభావము నడచినది.

ఇప్పటికి రెండుశతాబ్దములనుండి మనభాషపై నాంగ్ల భాషాచార్యులు, సంప్రదాయములు ప్రబలి వ్యాపించినవి. సంస్కృతము మనభాషపై నెట్టి యధికారము మున్ను పూనెనో యట్టియధికారమునే యాంగ్లభాష వహించినది. క్రమక్రమముగా నాంగ్ల సారస్వతములోని గ్రంథము లనుకరింపఁబడుటకన్న, ఆ భాషలోని విధానమును, ఆ సారస్వతములోని వెలుగు జిలుగులు నెక్కుడుగా నాంధ్రమున కవతరింపఁజేయఁబడినవి. ఇట్లవతరింపఁబడిన ప్రక్రియలలో నవల ప్రథమగణ్యము. తరువాత ఉపన్యాసము, కథానిక, విమర్శన, జీవితచరిత్ర మున్నగునవి తెలుఁగుభాషలో నవతరిల్లినవి. వచనస్వరూప మొకవిధముగాఁ జోటుచేసికొనినదనిన నది పందొమ్మిదవ శతాబ్దియందే యని చెప్పవచ్చును.

ఇవ్విధముగా సంస్కృతాంగ్ల సారస్వతముల ప్రభావము ననుగతము జేసికొని, తెలుగురచనలలోని వచన స్వరూపము నారయుట సమంజసము.

అంతకుపూర్వము కావ్యములు కానరాకుండుటచే నజ్ఞాతయుగమునాఁటి గద్య సంప్రదాయము దెలియవలె

నన్న మనకు శాసనములే యాధారభూతములు. నన్నయకుఁ బూర్వము వరలుచున్న తెలుగు శాసనములను బరిశీలించి నచో నవి యన్నియు సంస్కృత శాసనముల వలెనే రచింపఁ బడినట్లు కానఁగును. ఈ శాసనములలోఁ క్వాచిత్కముగాఁ దెలుగు వాడబడియున్నది.[1] దాన మొసఁగఁబడిన భూమి యొక్క యెల్లలను జెప్పు సమయమునఁ దెలుఁగుపదము లుపయోగింపఁబడినవి. మిగిలిన భాగ మంతయు సంస్కృత పద్యభూయిష్ఠము, [illegible] భరితము, శబ్దాలంకార పూరితమునై సంస్కృత శాసనముల కెవ్విధమునను దీసిపోవక వర్ధిలుచున్నది; సంస్కృత [illegible]ముము పోషించుచున్నది 2

ఉదా:… …[వి] జయాది [త్యపాదాను] [ధ్యా] త్రిభు
రాయమాన శ్రీమత్కు యువరాజ గంగాకాభరణుణ్డు [ప]
న కాని ఈ [శ్వ] [ర్వ] మున [రం] గామ్బికేయుండు బోటె చా
మ్యుకె [లా] వినా (శా) రమా (లు) నగంగగులు ఋష్యమ
వెగ్గేమలుంగలి [న]మ్యుకు న్డంగును ఈధమ్మే ని [వ్యా]
[హ] నోద్యోగమ్ము న [కు] బృహస్పతి సమానులయ్న వెగ్గె
డకా [? నయు] గారి [కొం] కు [బ] జెయరాజు నము [స్కా]
ణ్డని అత్మాసమ్మతంబుగం బస్చిన ప్రినా [నం] బని నము స్కరా
[జ్యభ] ర నిరూపిత మహామాత్యాధిపతి [మ] [హే] శ్వర
నకల పాతి దేవబ్రాహ్మణగురు [భ] క్తిపరుణ్డున(శ) త్రి (ల్రియ)

---

1. వాసలో ఎక్కడ ఏ తెలుగుపద మయినను కనబడుట సంభవించిన యెడల మనకు సన్నిధి దొరకినట్లే. —మల్లంపల్లి. ఆం. ఉగాది
2. ముందూరుగ్రామే; చెఱుకుమల్లెశ్వ.

సంపన్నుండును మఱియు విజయరాజు విజయైశ్వర్యంబుగల స (శ)
నివ్వాన(హా) నంబుసేసి దిన (శ) గుజ్జం బ్రాకారంబు
మటంబును నెమియించి.

(రెండవ ప్రక్క)

......[బున్యా]......వర్చిన్నవ (వారు)......
దంబు [సర్ప్రి] నవ (వా)రుది .....[ం] బుగద్యంబుల నలన
(శ్వా) స్వ (శ్వ) తంబు......[యును] ఇ (ఈ) భూమిలోన.

(ధర్మవరము శాసనము)

(మూడవ విజయాదిత్యునినాటి శాసనము)

తెలుఁగు కవితావతరణ మెట్లు సంస్కృతానువర్తియై వరలినదో, అట్లు తెలుఁగు శాసనములపట్లను సంస్కృతిచ్ఛాయపడుట తప్పలేదు. కావున శాసనములందు లభించు తెలుఁగు గద్యభాగములు నామమాత్రికములేకాని, స్వచ్ఛందమైన తెలుగువచనముయొక్క స్వరూపమును బ్రదర్శించునవి కావని సిద్ధాంతీకరింపవచ్చును.♦

ఇఁక నాంధ్ర సారస్వతములో నాదికవియగు నన్నయ రచనను జూచినచో నందు సంస్కృత పదబాహుళ్య సమాససంఘటనములు గాన్పించును. ఆతని భారతము చంపూ కావ్యముగా బయలుదేరినది. (ఇచట చంపూకావ్యమున గద్యపద్యములకు సమానస్థాన మీయఁబడినది.) (కనుక పద్య

♦ 'రెండో మూఁడో పద్యములుగల శాసములుఁతప్ప నన్నయకుఁ బూర్వకాలపు తెనుఁగుభాష స్వరూపమును దెలియఁజేయు నాధారములు గానరావన్నవి.' —డా. చిలుకూరి.

ముతోఁ గూడి యెడమగా నడిచినయీగద్యమంతయుఁ గవితా పదార్థ భూయిష్ఠమే కాని నీరసముగానేరదు; కావున తెనుఁగు వచనము మొదటినుండియే పద్యముతో సరిగా సాగివచ్చుచునే యున్నదని తెలియుచున్నది.)

నన్నయనాఁటినుండియే 'గద్య' మను పదమున కొక విలక్షణార్థము మన కున్నట్లు తెలియనగును. గద్యము వచన మునకుఁ బర్యాయ పదముగా నుపయుక్తమగుచున్నది. కాని 'గద్య' మను ప్రత్యేక ప్రక్రియ మన కొకటి సిద్ధాకార ముతో నున్నట్లు గమనింపగలుగుదుము. కావ్యములలోఁ బ్రతి యాశ్వాసాంతమున 'గద్య' పొడగట్టును. దీని ప్రయోజనము లేవి యనగా, నా కావ్యరచయితయొక్క వంశ గురు నామాదికములను, కావ్యమందా యాశ్వాస ములలోఁ బ్రతిపాదితమైన విషయములను వెలిబుచ్చుటయే. అనగా నేఁటికావ్యములలో 'విషయసూచిక' లను శీర్షికక్రింద వచ్చువస్తువు. గ్రంథోపరిభాగమున నచ్చిడఁబడునట్టి కావ్యకర్తృ నామాదికము లీగద్యము ప్రాచీనకాలములోఁ జివరనిర్వర్తించెడివన్నమాట. కావున వీనియందు కవితాభావ ముండుటకు వీలు లేదు. విషయబోధనయే ప్రధానోద్దేశ్యము.' అందువలన నీగద్యమందు కవిత్వ ముండకపోగా, కేవల వచనముయొక్క స్వరూపము కించిద్వ్యక్తమగును కాని, యీగద్యములు కేవల వచనములు కానేరవు.)(గద్యభాగము సమాసభూయిష్ఠమై యనుప్రాసాలంకారయుక్తమై పద్యములోనుండు ధాటి (Rythm) దీటైన లయ కలిగి విరాజిల్లుచుండును.)(ఈ శబ్దాలంకార, సమాస

సంగీత లయలు గద్యకావ్యములో బొందిన సాత్త్వావకాశములు. చెప్పిన సిరియున్నియు బ్రత్యేకగద్యలోను కానరావు. కొన్నికొన్ని యున్నటులున్నను చెప్పుకొనుచుందును.)

గద్యము నిపుణసూచికగా నన్నయ ప్రయోగించిన నన్నయ గద్య మాదిరి:—

ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీ మహాభారతంబునందు సభాపర్వంబున ధర్మరాజునకు సభాప్రాప్తియు, నారదాగమనంబును, నారదు వలన లోకపాలుర సభాశ్రవణంబును, రాజసూయ మహాధ్వరారంభంబును, జరాసంధ వధయు, నిరుద్ధులైన రాజులం గృష్ణుండు విడిపించుటయు, రాజసూయంబునన్నవి ప్రథమాశ్వాసము. (భా.)

ప్రబంధగద్యలు ముఖ్యములుగా బురాణముల ననుకరించుట సహజము. మార్కండేయపురాణము, సహారకుమార విజయము, భాగవతము. మున్నగు కథాకథన పద్ధతి (Narrative) గల గ్రంథము లిందులకు నుదాహరణములు లగును.

ఇంక వంశనామాదికముల వచించుటలో శబ్దాలంకారములు గలవి కొన్నిగద్యలు చూడుడు:—

''శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విధేయ తిక్కన నామధేయ ప్రణీతంబైన... ...''

''శ్రీ కమలనాభ పౌత్ర మారయామాత్య పుత్ర సుకవిజన విధేయ శ్రీనాథ నామధేయ ప్రణీతంబైన...''

11

"సకల గుణసనాథ సోమనాథ ప్రణీతంబైన..."

"శ్రీమదఖిల కవిమిత్ర పెదయన్నయామాత్య పుత్ర శారదా దయావిధేయ జక్కన నామధేయ..."

ఇట్లే చాలమంది కవులు తమగద్యలను రచించిరి.

కవులు తమ ఆశ్వాసాంతగద్యములలో నిష్టదేవతా సూచనమును జేయుచుందురు. ఇందులకుఁ గొన్ని:—

"శ్రీమత్కాళహస్తీశ్వర చరణకమల సేవాపరాయణ సింగమ రమానారాయణ జక్కయనారాయణ తనూభవ పరాఙ్ముఖధూర్జటి..."

"శ్రీమత్పరమపదనాథ నిరవధిక కృపాపరిపాకపరిచిత సరసకవితాసనాథ రామకృష్ణకవినాథ..."

ఇట్లే రామరాజభూషణుడు, కూచిమంచి తిమ్మకవి మున్నగు కవు లనేకులు తమ యుపాస్యదేవతలగూర్చి గద్యమం దుల్లేఖించిరి. ఈ గద్యభాగములవలనఁ గవి జీవితమునుగూర్చి ఇసుమంత చరిత్ర తెలియుట యుపయోగము. ఈ గద్యరచయిత కొన్నియెడల కావ్యకర్తయే కావచ్చును. కొన్నిపట్ల నా కావ్యముయొక్క ప్రతుల వ్రాసికొనిన వారే వ్రాసియుండవచ్చును. ఈ రెండవయంశమును స్థిరీకరించుట కాయా వ్రాతప్రతుల యాశ్వాసాంతగద్యలలో విలేఖకుల నామాదికములుగూడ కన్పట్టుచున్నవి. ఇట్టి 'గద్యము' అను ప్రక్రియ ప్రతి గ్రంథమందును పొడగట్టె మన సార

స్వతములోఁ బ్రత్యేకస్థానమును గడించినది. ఈ గద్యస్వరూపము కేవల వచనమునకును, కేవల పద్యమునకును మధ్యస్థితినాక్రమించుచున్నది. వీనిలోఁ గొన్నిగద్యలను బాడుదురు. ఆ చదువు పద్ధతియే భిన్నము. (తెలుఁగుసారస్వతపు తొలిదినములకే 'రుద్రగద్య' మొదలైనవి యున్నవి. వీనిలో లయ (Rythm) ఉన్నదనియే తలంపవలెను. *)

మన సారస్వతములో 'దండకము' లనునవి కన్పించుచున్నవి. ఏవిధముగా కవితాభావములేని పద్యమువచనముగా ముందు కాంచితిమో, యట్లే 'దండకము' వచనముగా భాసించినను, లయ (Rythm) కలదిగనుక పద్యతుల్యమగుచున్నది. (ఈ దండకములు సమస్తార గద్యలకు తుల్యములు.) నన్నయతరువాత పాల్కురికి సోమనాథుని కాలముననే గద్య ప్రబంధములు విరివిగానుండి సంస్కృతపద బాహుళ్యము వలన జనసామాన్యమునకు రుచింపకపోయినట్లు పండితారాధ్య చరిత్రలో—

'ఆరూఢగద్య పద్యాదిప్రబంధ,పూరితసంస్కృతభూయిష్ఠరచన మానుగా సర్వసామాన్యంబుగామి, జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు.

మఱియు బసవపురాణములో—

'ఉరుతరగద్య పద్యోక్తులకంటె, సరసమైపరగిన జాను తెనుంగు చర్చింపగా సర్వసామాన్యమగుట.'

---

* "కావ్యము లనిపించుకొనిన వచనములు గద్యములు. కావ్యేతర వచనములు వచనములే!" —శ్రీ పింగళి లక్ష్మీకాంతం.

నిటుఁ జెప్పిన గద్యగ్రంథము లేనూయెనో మృగ్యముగా నున్నవి. లేక, 'గద్యపద్యోక్తి' అనియు, 'గద్యపద్య ప్రబంధపూరిత సంస్కృతభూయిష్ఠరచన' అనియుఁ జేర్కొ న్నపుడు గద్యపద్యములచేఁ జెన్నొందు చంపు వనియేమో యుద్దేశము!

స్థూలముగాఁ దెలుఁగు సారస్వతమును జూచినచో రెండుగా విభాగింపబడినట్లు తెలిపితిమి. (సంస్కృతప్రభావము భాసించిననాటినుండి వరలిన సాహిత్యమును రెండుశీర్షికల, క్రింద విభాగింపవచ్చును; మొదటిది పురాణరచన (The Narrative) రెండవది ప్రబంధరచన (The Descriptive) ఈరెండు ప్రక్రియలలో నొకేకథ, రచనాశక్తిచే, నవకాశాను గుణముగ వైవిధ్యమును బొందగల్గును. ఇందులకు పురాణస్థ గాథలను ప్రబంధవస్తువుగా స్వీకరించి, నిర్వహింపబడిన ప్రబంధములగాంచిన తెలియును.

ఇఁక పురాణప్రబంధవచనములను పరిశీలింపవలయును. అపుడు వచనమాంధ్రమున నభివృద్ధిపొందెనో, లేదో తెలియ వచ్చును.

పురాణములోను, ప్రబంధములోను గన్పించు వచ నము భిన్నస్వరూపమును బొందినది. పురాణవచనము పద్య ములమధ్య నెడనెడ గన్పట్టును. ఈవచనము కేవలము రెండు పద్యముల నడుమగాని, రెండు సన్నివేశములకు సంబంధ వాక్యముగాగాని వినియోగపడును. ఒక్కొక్క

యెడ నిరుపుర సంభాషణము పద్యములలోఁ జిత్రించిన, నా యా పాత్రలను సూచించుటకై వచన ముపయుక్తమైనది. ఇట్టి విధానముతో వచనము పురాణములోను, ప్రబంధమందును విరివిగా గన్పించుచున్నది. (పురాణవచనము పురాణ పద్యమువలెనే సుబోధకము (ఆఖ్యానాత్మకము) అల్పపద్య వాక్యమయము. అయ్యది నిరాడంబరముగను, నాతిదీర్ఘముగను, విషయప్రధానముగను, కథాగమనవేగముతోడను నడచుచుండును.) (కాని, ప్రబంధములలో వచనమున కొక ప్రత్యేకత యున్నది. ప్రబంధవచనము దీర్ఘముగను, ఆలంకారికముగను, వర్ణనాత్మకముగను, సమాసగుంఫిత ఫణితితోడను, పద్యమునందువలె శబ్దాలంకారములతోడను విజృంభించియుండును.) కాని, భాగవతముమాత్ర మిడ సరితూగదు; పురాణవచనమువలె భాసిలక, ప్రబంధరీతి ననుసరించినది. ప్రబంధవచనములో కథావేగమునకై త్వరపడుట లేదు. మీదుమిక్కిలి కథాస్రవంతి యావచనమను పర్వతమునొద్ద నొక్కుమ్మడి యాగి, తదుపరి యా వచనపర్వతము నధిగమించి చనుచుండును. కథలోని సన్నివేశముల నెక్కుడుగా వర్ణించుటయే ప్రబంధకవిత్వ లక్ష్యము. కనుక, కథావేగమున కాతని పద్యరచనగాని, వచనరచనగాని పూనుకొనదు. సన్నివేశ (incident) ప్రస్తారమే కవియొక్క యుద్దేశ్యము. ఇట్టి ప్రబంధవచనములలో నెక్కుడు స్వభావోక్తి యొప్పును.

ఈ విధముగా పద్యమునకు భిన్నమైన వచనరచనము మనకు తొలుదొలుత శాసనములం దంకురించి, తరువాత చంపుకావ్యమైన భారతములో పద్యముతో నెడనెడ నడ

చుచు వచ్చుచు కావ్యాంతములందు విలక్షణముగా 'గద్య' లను పేర బరగుచు, కావ్యము లనిపించుకొను గద్యలలో పౌడసూపుచు, ప్రబంధ యుగమునాటికి నలంకారముల గ్రహించి విశిష్టరూపమును పొందినట్లు తెలియుదుము. ఎట్లైనను ప్రబంధయుగముతర్వాతనే వచనప్రయోగము సంపూర్ణముగా గుర్తింపబడినట్లు నమ్మవలసియున్నది. ఆంగ్లవిద్యాప్రభావము కారణముగా గత రెండు శతాబ్దములనుండి వచనరచన సర్వోపభోగ్య మగుచున్నట్లు గమనింతుము. ఈ క్రమపరిణామము నోపికతో ముందు గమనింతముగాత!

ఆంధ్ర వచన స్వరూపము

అన్వయము

★

రెండవ భాగము

నన్నయ భట్టుగాని, తిక్కన యెఱ్ఱనార్యులుగాని వచనమును కథాకథనపద్ధతికి ననుగుణమై గౌణమైన వాహిక (medium) గాస్వీకరించినట్లు ద్యోతిలును. ఇఁక వారి రచనలో మాత్రము భేదము వర్తించుచున్నది. ఇది వారి వారి యాత్మీయత (Personality)లను పురస్కరించుకొని వచ్చిన శైలీవైవిధ్యవిన్యాసవిలసనమే. (భారతరచనలో నన్నయ యేవిధమైన యాఖ్యానాత్మక శైలిని ప్రదర్శించెనో, తిక్కన యెట్టి నాటకీయ శైలిని నడిపించెనో, ఎఱ్ఱన యేవిధమైన వర్ణనాత్మక శైలిని పుణికిపుచ్చుకొనెనో, యట్టి శైలీవైవిధ్య మాకవుల వచన రచనలందును తగుమాత్రముగ గన్పించుచునేయున్నది.) అనఁగా నన్నయ వచనమునకు కథాకథనశక్తి యున్నట్లు, తిక్కయజ్వ వచనమునకు సంభాషణాశక్తి యున్నట్లు, ఎఱ్ఱనామాత్యుఁడు వచనమునకు వర్ణనాశక్తి యున్నట్లు మొట్టమొదట

చూచిన ద్రష్టలు. ఈ విధముగా వచనము త్రిముఖముగా తిరుగగలదని తీర్చిదిద్దినవారా కవిత్రయమువారే. కాని ముఖ్యముగా వచనమునకు వారి రచనలలో ప్రాముఖ్యత లేదనుటకు వీలులేదు. వచనగ్రంథము లానాఁటికే యున్నట్లు శైవకవుల పొత్తములలో హాస్త్రింపబడియున్నది. ఆ తర్వాత వచ్చిన తిక్కనామాత్యునకు తన యుత్తరరామాయణమును రచించు తలఁపు పుట్టినపుడు వచనరహితముగా రచనసాగింప వలెనను దీక్షవహించుటనుబట్టి యానాఁటి వచనస్వరూపము ద్యోతిలగలదు. నాటి దీర్ఘవచనములను సాగించుట ఎఱ్ఱనామాత్యుఁడు తీసినదారియే. ప్రబంధోచిత వర్ణనలను నృసింహపురాణ హరివంశములందు విలోకించినవాఁడాతఁడే. వచనములో భావస్పష్టీకరణశక్తి యున్నట్లు నన్నయ వచనములలో తెలియును; సంభాషణాచాతురి వచనరచనలో నున్నట్లు తిక్కన పరిశీలించె; భావప్రస్తారమునకుగాని, భావవ్యాఖ్యానమునకుగాని వచన ముపయుక్తమగునని శంభుదాసుఁడు కనిపెట్టె. ఇవ్విధముగా కవిత్రయ వచనరచన మూఁడుచిన్నెలు పొంది చెలువారుచున్నది.

కవిత్రయమువారి ననుగమించిన కవులలో ననేకులు వారి మార్గముల ననుసరించినవారే. అట్టి యనుసరణమే వచనమందును గన్పించుచున్నది. కాకపోయిన, వచనమునకున్న మూఁడుశక్తులను (పైఁ జేర్కొనిన శక్తులు) పరిశీలించి, ముగ్గురి ఛాయలను సంక్రమింపఁజేసికొన్నవా రనేకులున్నారు.

మరల కవిత్వములోగాని వచనములోగాని ప్రత్యేక విశిష్టతలు వచ్చిన వసిన శ్రీనాథుని హస్తములందే యని చెప్పవలయు.

శ్రీనాథుని కవితలో నొక మార్పు వచ్చినట్లు సూచించితిని. కవిత్రయముచే దిద్దిపెట్టబడిన పురాణ లేక ఇతిహాస వైఖరి కొంతకాలము వర్ధిలి, శ్రీనాథునినాఁటికి కావ్యఫణితి లోనికి పరివర్తనము పొందినది. ఈవైఖరీభేదముతోఁబాటుగ రచనాపద్ధతిలోను భేదము వచ్చినది. స్వతంత్రాలంకారములచే నాకావ్యయోష నలంకరించుట శ్రీనాథునితో మొదలు పెట్టబడె. మూలమును యథాతథముగా ననుసరించుట లీతని రచనలో స్వల్పము. శ్రీనాథుఁడెటనున్నను తన వ్యక్తిత్వమును జూపెట్టును. నైషధకావ్య మందలి పద్ధతి యిందుల కుదాహరణము. కొన్ని శ్లోకముల ననువదించుటలో వచనముగా నవతరింపఁజేసినాఁడు. దానిలో నాతని యశక్తత గాక, యీ మూలశ్లోకములలోని వాచ్యత (Baldness) యే కారణ మనవలసియున్నది.

ఉదా. కిమస్యరోమ్ణాం కపటేన కోటిభిః విధిర్న రేఖాభిరజీగణ
ద్గుణాన్ నరోమకూపౌఘమిషా జగత్కృతా కృతా
శ్చకిం దూషణ శూన్య బిందవః ॥

మొదలైన శ్లోకములను వచనమందుంచె జూడుడు:

"… …రోమకోటి కపటంబున హాటకగర్భుండు పాటించిన సుగుణగణనా రేఖ లవయవంబులం బొలుపారె"

శృం. నై.

ఇవ్విధముగా శ్రీనాథుఁడు వచనముయొక్క ప్రయోజనమును గ్రహించెను. కథాకథనమున నెక్కుడుగా వచనమే యుపయుక్తమని తెలిపినాఁడు. అందుచేతనే శ్రీహర్షుని శ్లోకములను వచనమందు దింపినాఁడు. ఇదిగాక శ్రీనాథుఁడు కావ్యధోరణి ననుసరించినవాఁడు కనుక, యది వచనమందును దొరలినది. దీర్ఘసమాసములతో వచనము నలంకరించినాఁడు. వర్ణనలను మఱింత బరువు గావించెను. అనుప్రాసాలంకారముల చొప్పు, శ్రవఃపేయతకు పాటుబడినాఁడు. ఈ క్రింది వచన ముదాహరణ మగును.

"వెండియు నవఖండమండలంబగు మహీమండలంబునకు మకరకుండలాలంకారంబునుంబోలె భీమేశ్వరమండలంబు పొరుగునఁ ద్రిలింగోత్కలతలంబులనంది, వింధ్యాచల పాదంబునఁ గేదార కుంభకోణార్కస్థానంబుల కుపమానం బనఁజాలి, యేలేటి మేటికాలువలవలన నదీమాతృకంబులగు పంటవలంతులు సలిలధౌతకలధౌతశలాకాశకలసంకోచకరణంబులై యంకురించినవియు......"

శ్రీనాథుఁడు కాశీఖండంబున 'సదాచారనిరూపణము' 'స్త్రీలక్షణ నిరూపణము', 'యోగ నిరూపణము' లను జేయునపు డెక్కుడుగా వచన ముపయోగించి వచనప్రాశస్త్యమును నిరూపించెను. అట్టి నీతిబోధలకు, శాస్త్రవిషయములకును వచనమే యుపాదేయమని గ్రహించినట్లు స్పష్టముగదా! ఈతని జటిల వచనరచనఁ జూడుఁడు:

[illegible] జంభవిదారపురందరాది బృందారక మకుటసంవాసితవికచమందార కుసుమమాలా మకరంద బిందుధారా స్నపితచరణారవింద మందరాచలమంథాన సమ్మథ్యమాన దుగ్ధజలధిగర్భనిర్భూత కాలకూట స్ఫురితభయంకర గండూషకళంకితకంఠమూలోపకుంచిత సకలాంగ భువనరక్షా దాక్షిణ్యదాక్షాయణీకుచకలశపాళీకేళీ''   కా. ఖం. చ.

అనఁగా శ్రీనాథునిచేతిలో వచన మొక నూతన మర్యాదా శ్రయి యైనదని సిద్ధాంతము. పోతన శ్రీనాథుని సమకాలీనుఁడైనను, 'భాగవతము' కావ్యము కాదు గనుక యితిహాస వైఖరినే తన రచనలో ప్రతిపాదించి ప్రయోగించినాఁడు. (కాని పోతన కవిత్వములో గడించుకొనిన ప్రత్యేకత, గద్యమందును పొందినాఁడని చెప్పవలయును.) అంత్యప్రాసయమకములతో రచించు పద్ధతి యీతనిసొమ్ము. వర్ణనలందు దీర్ఘసమాసయుక్తముగను, కథాకథనమందు లలిత పదములతోడను రచనను సల్పగల సవ్యసాచి పోతన.♦

ఇఁక శ్రీనాథుని తరువాతివారు గతానుగతికంబుగ నాతని రచననే యనుకరించిరని చెప్పవలెను. పినవీరన శాకుంతల కథను స్వీకరించినపుడు శ్రీనాథుని భాషాంతరీకరణ పద్ధతినే యనుసరించెను. జక్కన, అనంతామాత్యులు తమ రచనలలో కథాకథనపద్ధతికి ననువైన రచనసల్పి, వచనములను తదనుగుణముగా నిర్వహించిరి. జక్కన తన 'విక్రమార్క చరిత్రము'

♦......"జలధర నినదశంఖ శార్ఙ్గ సుదర్శన గదాదండ ఖడ్గాక్షయ బాణతూణీర విభ్రాజితుండు......" 8 స్కం.   (భాగవతము)

లో ప్రథమాశ్వాసమున పురవర్ణనమును వచనంబులో నిలిపినాఁడు. దీనిఁబట్టి వర్ణనాత్మకమైన శైలి వచనములో నెంతవఱకు నెగ్గునో నిరూపితమగును. ఇక్కడి వచనములు సమాససంభరితములు, శబ్దాలంకార విలసితములును. శ్రీనాథుని వచనరచనము ననుగమించినా రాతని తర్వాతికవులు.

కవిత్రయమువారి తరువాతమరల శ్రీనాథుఁడే తెలుఁగు సాహిత్యమున కొకతీర్పు దిద్దినాఁడు. అది పెద్దనకాలము వఱకు సాగినది. పిమ్మట పెద్దన పెద్దవాఁడైనాఁడు. కృష్ణరాయులదర్బారు సాహితీరంగస్థలమైనది. ఎర్రాప్రెగడచే శంకుస్థాపన చేయఁబడి, శ్రీనాథునిచే పరికరములు సమకూర్పబడి పెద్దనచే ప్రబంధ సౌధనిర్మాణము గావింపఁబడినది. తరువాతి పంచరత్నకారుఁడు సౌధాంతర్భాగములకన్న సౌధోపరిభాగముల నలంకరించినాఁడు. తరువాతి కవులందఱు ఆ సౌధములలోనే వర్తించిరిగాని, మరేమియు జేయలేదనవలెను. ఇట్లు పదునెనిమిదవ శతాబ్దమువఱకు సాగినది. ప్రబంధములలోని వచనము, పైన సూచినట్లుగా, పరిబంధ పద్యసరణినే నడచినది. అట్లనుగుణముగ లేనిచో సమత (Balance) యుండ నేరదు. పెద్దన పెట్టిన యొరవడిని కథాకథనమందును, కథాసన్నివేశ కల్పనమందును, అంగాంగిరసనిర్వాహణములందును, విషయ విభజనమందును, తరువాతికవులు చాల వఱకనుకరించిరి; ఇట్టి రచన గతానుగతికమై కవిసమయము (Convention) వలె పరిణమించినది. (ఈ ప్రబంధములలో ద్వితీయాశ్వాసము (సించుమించు) తప్పక యొకదీర్ఘవచనము పొసగియున్నది.) దీని వైశిష్ట్యమే మన:-శబ్దాలంకారము తప్పక

యుండుట; యమకము, అనుప్రాసములు వరలుచుండుట; ఇవి సమాసములో నుండి వర్ణనాసందర్భములో రచింపబడుట: ఉదాహరణములుగా జూపుదుము:—

కోలాహల పర్వతవర్ణనమును జేయుచు వసుచరిత్రకారుడు:—'మఱియు సిక్కులాచల సంతానంబు, సంతాన కుసుమ వాసనా సమాగత సారంగసంగీత భంగీతరంగంబు లుపాంగంబులుగాఁ బాడు వేల్పుగాణీల పాణీరితమాణిక్య వీణా మధురరావామృతంబులఁ గరఁగి, . పెచ్చుపెరుగు నచ్చపు బచ్చలచాయలు మెచ్చులుసేయఁ బచ్చికల మచ్చికల విచ్చలవిడిఁ గ్రొచ్చుకొని మెసవ నుంకించు నంకపు రాజంకి జంకించి...' మనుచరిత్రలో వేటను వర్ణించు సమయంబున పెద్దన పెద్ద వచన రచనమున కుద్యుక్తుఁడాయె. ఈ వచనము అనుప్రాసాలంకారములతో నున్నది. ముక్కు తిమ్మన యొద్దికగా తన ముద్దుపలుకులతో గద్యమును దిద్ది పెద్దనాదుల కుద్ది యనిపించె:

'అంధకారబలీంద్ర నిర్బంధన ధురంధర సమయమధుమథన చరణాంగుష్ఠనిష్ఠ్యూత గగనసరిదంబుపూరంబుల కను బింబంబులై ... ...' అను రచన యుదాహరణము చాలును.

పింగళి సూరన ఆఖ్యానశైలిలో రచనను సల్పినాఁడు. ఆతని కళాపూర్ణోదయమందుల కుదాహరణ మగును. ఇందలి వచనములలో ముఖ్యముగా నెన్నదగినది కథలోని కల్పనల యావిష్కరణ సమయమందు విరచించిన వచనము. సరస్వతీ చతుర్ముఖుల విలాసమును విప్పిచెప్పి

నపుడు వచనమే యుపాదేయమని తలంచినాడు సూరన. ఇట్టి క్లిష్టవిషయము పద్యమునకన్న వచనమందు విపులముగా వివరింపనగునుగదా!)

ఇట ధూర్జటిని గూర్చియుఁ జెప్పవలసియున్నది:

ధూర్జటి చాల స్వతంత్రుఁడు. కృష్ణరాయలకాస్థానములో నున్నను, ఆతని కంకితము చేయక కాళహస్తీశ్వరునికే కృతి సమర్పించిన ప్రత్యేకతగలవాఁడు. ఈతఁడు తన కవిత్వమందును స్వాతంత్ర్యము వహించెను. ఇతఁడు తన వచనరచనలో యుద్ధమును వర్ణించుటలేదు. వేటను వెన్నెలవంటి సందర్భములందును, సహజప్రతిభతో స్వభావోక్తి ప్రధానముగా రచించె.

రామకృష్ణుఁడు తన పాండురంగమాహాత్మ్యములో వచనరచన సన్నివేశములను వర్ణనోచితపద్ధతుల కంటెను క్లిష్టముగ నట్లుచేసెను. నిగమశర్మ యక్క వచ్చిన సందర్భమున నాయింట జరిగిన విశేషములను చక్కగా వచనంబున పొందుపఱచినాడు. 'పాండురంగవిభుని పదగుంఫనము' ప్రతిఘట్టమున గన్పించును. ఈ పైసందర్భమున నూత్నవచనములో రామకృష్ణుఁడు నిగమశర్మ శరీరముయొక్క కర్కశత్వమును కుకవిపదబంధమునకు బోల్చి తన యాధిక్యమును ప్రకటించె. పాత్రచిత్రణమందు వచనమెంత దోహదభూతమో యుదాహరించినాఁడనవలెను.

ఆంధ్రకవికులభోజుఁడైన శ్రీకృష్ణరాయలు రచించిన ఆముక్తమాల్యదలో ననేక వచనములు గన్పించును. కృష్ణ

రాయలు వర్ణనలం దుత్తమోత్తమ రచయిత యని ప్రాజ్ఞుల తలంపు. ఆముక్తమాల్యదలోని విషయమున కుదాహరణములు మిక్కుటము. మతసంప్రదాయ సిద్ధాంతములను రాయలు చక్కగా నెఱింగియుండెను. వానిని తన గ్రంథమం దంతటను వెదజల్లినాఁడు. (ఆముక్తమాల్యదలోని వచనరచన జూచినచో తత్త్వవిషయికమైన శోధన మంతటిని వచనమే చక్కగా నిర్వహించునదని తేలును.) ప్రత్యేకముగా ప్రబంధములలో వర్ణనలకు, తత్త్వవిషయములాదిగాగల శాస్త్రవిషయములకు వచనమే యుపాదేయముగాని పద్యము కాదని ఋజువయినది.

ఇఁక దక్షిణాంధ్ర వాఙ్మయములో వచనస్థాన స్వరూపములను గమనింతము. వచనములోఁ ప్రౌఢతరముగా కావ్యసృష్టి యీ నాయకరాజ యుగమునందే జరిగినది. పద్యకావ్యముకన్న వచనకావ్య మెక్కువగా సులభగ్రాహ్య మని కవు లెఱింగిరి. అనేక ప్రక్రియాభేదము లీయుగమం దుద్భవించినవి. యక్షగాన మీనాటిదే. గీతికి (Lyric) ప్రాధాన్యమువచ్చిన దీ దినములందే. ఆనాఁటి కవులు గతానుగతికముగా గాక, ప్రత్యేకమార్గమును ద్రొక్కి తమ ప్రతిభను అసమానముగా నందజేయవలెనని సంకల్పించిరి. తదనుగుణముగా సార్వభౌముల సాహితీ పిపాస చేతుల గలిసినది. కృష్ణరాయలవలె రఘునాథరాయలు సాహితీద్రష్ట; స్రష్టకూడ. నాయకరాజయుగమున వెలువడిన గ్రంథములలో ప్రబంధములున్నను నవి పిల్లవసుచరిత్రలవలె గతానుగతికములుగాక ప్రత్యేకస్థానమును బొందగల్గినవై వెలుఁగుచున్నవి. వచనము

...త క్లిష్టములుగాక సుబోధ వచనరచనకు మార్గదర్శకములై వ్యావహారిక ప్రయోగములతో పొసగుచున్నవి.

This prose is interesting contrast with the classical prose, and is full of colloquial idiom (cf. Taylor's Oriental Historical Manuscripts.)

—S. Kuruganti

వచనరచనకు గడంగినవారిలో ‘రాయవాచక’ కర్తను,♦ ఏకరూచి బాలసరస్వతిని పేర్కొనవలెను. బాలసరస్వతి ‘వ్యాఖ్యాన’ ముఖ్యప్రక్రియను తెలుగులో ననుకరించినాడు. కళువె వీరరాజు, సముఖము వేంకటకృష్ణప్పనాయకుడు ముఖ్యముగా వచనగ్రంథములు రచించిరి. కంకంటి పాపరాజు ప్రబంధసరణిలో రామాయణకావ్య విరచనము సల్పెను. తన కాలమునాటి వచనశైలి యీతని గ్రంథములలో ప్రతిఫలింపక పోలేదు.

ఈయుగమందు వెలసిన రచయితల రచనములలోని వచనమును సూచించెదను: కంకంటి పాపరాజు వ్రాసిన యుత్తరరామాయణములో వచనము స్వాభావిక ప్రధానముగను, పాత్రచిత్రణమున కనుగుణముగను పొడసూపుచున్నది. ఉదాహరణముగా, జానకీశోకఘట్టమున జానకి లక్ష్మణునిచే

♦ రాయవాచకము మధుర సేనాపతిచే రచింపబడినది. ఇందలిభాష వ్యవహారసిద్ధమైనది. “రథోత్సవమునకు విజయంశాయవలెను; అని విన్నపం శాయంగ దగ్గరవున్న దళనాయకులు ఆతీరున్నే రాయలవారు విచ్చేసి వున్నారు”

రామాజ్ఞ నెఱిఁగి, యుపశ్రయై చేడ్పడియున్నతఱి నాపె యవ
స్థను వచనములో నెట్లు చిత్రించెనో కానఁగును.♦

(ఇక్లే రంభను రావణుఁడు మానభంగ మొనర్చిన పిమ్మట రంభయొక్క దుర్దశ వర్ణించినాఁడు వచనమందు:—

'బెబ్బులివాతికిం జిక్కియు జిక్కక మగిడిన హరిణికరణి రాహుముఖగహ్వరంబునం బడి బయలు దేఱిన చంద్రకళ చందంబున .... చెదరిన ముంగురులతో బెదరిన బెళుకుచూపులతోఁ బ్రిదలిన నివిబంధంబుతో వదలిన కేశపాశంబుతోఁ బగిలిన బింబాధరంబుతో నొగిలిన చెక్కుటద్దంబులతో ...... వాడిన విరిసరులతో వీడిన భూషణంబులతో ...... ఆకారంబు దాల్చి వచ్చిన శోకరసాధిదేవతవలె'నున్నదని వర్ణించె. ఇటు వర్ణితములైన యవస్థలను సూచించుటకు సంతరింపఁబడిన క్రియావిశేషణంబులు రెండు రెండుగా ననుప్రాసాలంకారసహితములుగానుండి నడకలో బిగువును జాటుచున్నవి)

(సముఖము వెంకటకృష్ణప్పనాయకుఁడు తెనుఁగు వచనస్వరూపము తిన్నగా తెలుపుటకై సారంగధరచరిత్ర, జైమినిభారతము లను వచనకావ్యముల రచించెను. ఈతని

♦. "...పడి చేడ్పడి బడిబడిం బొడము బడలిక నొడలెఱుంగక రెండుగడియలుండి కొండొక తెలిసి వెండియుఁ గలసి యవశయై దీనదశం బొరసి, కృశాంగి మరలఁ గన్నుదోయి విచ్చి, విచ్చలవిడి వెడలెడి యశ్రుధారాప్రవాహంబులు చెక్కుటద్దముల నైజాలువాఱ,......పుఱ్ఱపుఱ్ఱఁ బొక్కుచుఁ దాల్మిమాలి, క్రుక్కుచు లేచి కూర్చుండి... వెక్కి వెక్కి యేడ్చుచు.....తలయూచుచు, దలయూచుట విడిచి, ముక్కునఁ వ్రేలు గీలుకొలుపుచు... హాహాకారంబు సలుపుచు......"

13

వచనరచన సులలితపదసమన్వితమై క్లిష్టాన్వయములు లేక, 'కులుకు కోకిల నణంచు గళరవంబు, పలుకుల సౌరు' గలిగి తెనుఁగు తీయదనమును, తేటదనమును, తీర్చిదిద్దినట్లుండును. సంభాషణావిధానమును చిత్రించుటలోసైత మీ వచనము నిరాడంబరముగా సరసముగా నుండును.)

'జననీ! తక్కినవారికింబలె యింత యుపచారంబేమిటికి? ఏను నీకుమారుండనుగానే' యనుటయు నాపువ్వుబోఁడి, బొమ్మంచు కెమ్మోవిచిగురునం జిరునగవు మొలకలు గులుక, కప్పురంపువీడియంపు తావి ఘుమ్ముమన, తేనియ చినుకులొలుక నిట్లుపలికె; 'ఓజగన్మోహనాంగ! నా కుమారుండవగుదువు; నిక్కంబు పలికితివి. నీదు సుగుణత్వంబును, నీచక్కఁదనంబును నీయొయ్యారంబు నిచ్చెలులు నిచ్చలు పలుక విని వీనులకు విందులయ్యె. ఇప్పుడు కనుంగొనుటచే కన్నులకుం బండువయ్యె...'

(కళువె వీరరాజు రచించిన వచనభారతము,)మఱి కర్తలెవరో తెలియని వచనములు, 'భారతచిత్రకథలు', 'బేతాళపంచవింశతి', మొదలైనవియనేకములున్నవి. విజయరంగ చొక్కనాథుఁడు 'మాఘమాహాత్మ్యము', 'శ్రీరంగమాహాత్మ్యము' లను వచనకావ్యములు రచించెను.) రామాయణ భాగవతములును వచనములోని కవతరింపఁబడినవి. శ్యామరాయకవి వచనరామాయణమును, పుష్పగిరి తిమ్మన వచనభాగవతమును గూర్చిరి.)

ఈ విధముగా వచనరచనవిరివిగా, పదునేడు పదునెనిమిది శతాబ్దులలో జరిగినది. వ్యావహారిక భాషా ప్రాధాన్యము చాల గ్రంథములలో నున్నట్లు తెలియగలము. (నాటి యక్ష గానములలోని వచనముగూడ వ్యావహారికమే.) వచనగ్రంథములకు ముఖ్యముగా సుబోధకత్వమే ప్రోద్బలమిచ్చినది. ప్రజలకందుబాటుగా సాహిత్యము నుంచుటకుగాను దక్షిణాంధ్ర వాఙ్మయము పుట్టినట్లు ద్యోతిలును.) భారతభాగవత రామాయణములను వచనమునం దుంచుట, యక్షగానము ద్వారా ప్రజాభిరుచిని చూఱగొనుటలు తార్కాణములు గదా!

పూర్వోక్తప్రకారముగా నాంధ్రభాషమీఁద నాంగ్ల భాషాప్రాబల్యము పందొమ్మిదవశతాబ్ది మధ్యకాలమునకు బాగుగావచ్చినది. ఆంగ్లవచనరచన యాంధ్రుల ననేకుల ముగ్ధులనుజేసినది. అట్టివాఙ్మయ మాంధ్రభాషలో నిర్మింప కుతూహలము సాహితీసేవకులకుజనించినది. ఇట్టిస్థితిలో చిన్నయ సూరి సర్వాతిశాయియైన గుణము కలిగించి వచన రచన చేసినాఁడు. (ఆంగ్లపాఠశాలలలోఁ దెలుఁగుచదువు విద్యార్థుల కుపయుక్తములగు సులభవచనములను రాయదుర్గము వేంకట నరసయ్య ప్రారంభించెను.) చిన్నయసూరిదృష్టియు నట్టిదే. కాని సూరి యీప్సితము పెద్దది! ఆలంకారికమైన వన్నె చిన్నెల నాపాదించి, శైలీసంపద ఘటించి, విరచించిన 'నీతి చంద్రిక' పిన్నలకేగాక పెద్దలకునాదరణీయమైనగ్రంథమాయెను. వచనరచనములో మకుటాయమానమైనది 'నీతిచంద్రిక.' ఆంగ్ల చనరచన ననుసరించి, వాక్యవిరామాదులను బాటిం

[illegible] సంస్కృ
తాంధ్రములను సొగసుగా పొందింపగలశక్తిమంతుఁడు సూరి. భావముగాని, భాషగాని, త్రొట్రుపడకయే గంభీరముగ నడిపింపగల ప్రతిభాశాలి. నన్నయభట్టు పద్యరచనమం దెట్టిదిట్టయో, వచనరచనమందు సూరి యంతటి దిట్టరి.

చిన్నయసూరి ప్రారంభించిన గ్రంథమును బూర్తి చేయుతలంపుతో వీరేశలింగము పంతులు, కొక్కొండ వెంకటరత్నముపంతులు ప్రయత్నించిరి. వెంకటరత్నముపంతులు రచన బిరుసుపాకమునఁబడినది. వీరేశలింగముపంతులు చిన్నయసూరివలెనే వ్రాయుటకై యత్నించి చాలవరకు మరపింపగల్గెను; కాని యది వీరేశలింగముపంతులు సహజశైలి కాదని, యాతని యితరవచనమును జూచినచో బోధపడగలదు. వచనమును సర్వోపభోగ్యమైన వస్తువుగాఁజేసి కేవల, మాధునికమగు వచనమునకు మార్గదర్శియయ్యెను. కావున ఆధునిక వచనమునకు మూలపురుషుఁడు వీరేశలింగముపంతులే యనవలెను. ఆంగ్లప్రభావము పూర్తిగాఁ బ్రతిఫలించినదాతని రచనయందంతటను; ఆంధ్రమున 'కథానిక'ను తప్ప మిగిలిన వచనమార్గముల ననుసరించినవాఁడు పంతులే. నవల, విమర్శనము, చరిత్ర, ప్రహసనము, వ్యాసము, ఉపన్యాసము, మొదలైన వచన ప్రక్రియాభేదముల నన్నిఁటి నవతరింపఁజేసిన గురువు శ్రీ వీరేశలింగముపంతులు. వీరి గ్రంథములన్నియు గావ్యములుగాక, విజ్ఞానోపలబ్ధి కక్కఱకు వచ్చునవిగా నున్నవి. స్వీయచరిత్ర వీరేశలింగముపంతులు వారితోడనే యాంధ్రమున నవతరించినది. పూర్వమున్న యాలంకారిక,

శాబ్దికవిమర్శనమును మాని, గ్రంథములపై నాధునికవిమర్శనలు సల్పిన యాదిగురువు పంతులుగారే! నవలావాఙ్మయమునకు శ్రీకారము పెట్టిన మహానుభావులుకూడ వారే! విమర్శనమందు పంతులుగారితోపాటు గురజాడ రామమూర్తి పంతులుకూడ నెన్నదగినవాఁడు, కాని వీరేశలింగముపంతులకున్న నిష్పాక్షికాభిప్రాయము, పరిశీలనాదృష్టి రామమూర్తి గారికున్నట్లు తోచదు.

ఇట్లీవిధముగా నూతనమార్గమున వచనము వీరేశలింగముపంతులవారి ముంజేతిమణికటకమున నాధునిక యుగమున వర్తిలినది. ఆధునిక యుగమునందలి వచనస్వరూపము నెఱుగుటకు ముఖ్యముగా విషయ విభజన మవసరమని తోచును. వచనములోవచ్చిన వివిధశాఖలక్రింద వివిధసేవకుల కృషి, తత్స్వరూపముల నెన్నుట యుచితము గదా!

వచనము బహువిషయముల కాలవాలమైనది. నవల, ఉపన్యాసము, విమర్శనము, చరిత్ర, శాస్త్రము, వ్యాసము- ఇవి వచనముయొక్క ముఖములు. వీనినాదరించి రచనసల్పిన వారి నెఱుంగుదము.

ఆనాఁడు వీరేశలింగము పెట్టినభిక్ష నేటికిని నవలవిషయమున పొసఁగుచునేయున్నది. కాని, రచనములో, స్వరూపములో, కథాసన్నివేశ కల్పనములో మార్పు లగుపించుచున్నవి. 'నవల' అను పదముమాత్ర మట్లేయున్నది.

(చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు రచించియున్న నవలారచయితలలో ప్రథమగణ్యులు.♦ వీరి రచనము మృదువైనది. వీరేశలింగముగారి రచనలోని సారళ్యముతో పాటు వీరి రచనకు సౌకుమార్యమబ్బినది. హాస్యముకూడ కడు మేలైనదే. రామచంద్రవిజయము, గణపతి, సౌందర్యతిలక, [illegible], సుధాశరచ్చంద్రము వీరి గొప్ప నవలారచనలు.) చారిత్రక నవలలో చిలకమర్తివారి ద్వితీయులేమో యనునట్లు 'హేమలత', 'రాజస్థానకథావళి' వెలుగుచున్నవి.

నవలారచయితలసంఖ్య బాగుగా నాంధ్రమున పెరిగిపోయినది. ఇట్లు తండోపతండములుగా వచ్చుచున్న వీరిలో మంచిచెడ్డ లేరుట కర్తవ్యముగాదు. ఈరచయితలందఱు వచన రచనమునకు తోడ్పడిరనియే చెప్పవలయును. కొందఱు భాష చాల జటిలముగా నుపయోగించిరి. కొందఱు ద్రాక్షా పాకములో పొంకముగా రచించిరి. (వేంకట పార్వతీశకవులు పేరెన్నికగన్న నవలారచయితలు. వీరి 'ప్రమదావనము' చక్కని ఆంధ్రనవల.) వేంకట పార్వతీశకవులు నవలకొక విశిష్టమైన వచనరచన నాపాదించి, పండితపామరహృద్యముగా రచనసాగించిరి. జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి వచన రచన చాల క్లిష్టమై వచన ప్రయోజనమునకు సుదూరమై వర్తిలును.

♦ "కవులప్రతిభకు నికషాయమానమగు గద్యప్రబంధరచనమున వన్నెకెక్కిన యల్పసంఖ్యాకులగు నాంధ్రకవులలో గణనీయులు......"

—ఆంధ్రవిశ్వవిద్యాలయపట్టప్రదానోత్సవము.

(నవలా రచనలో వచనము చాల కాలము వఱకు, అనగా గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషావాదము నుద్ఘాటింపక పూర్వము, గ్రాంథికములోనే భాసిల్లినది.) గ్రాంథిక వచనమును వశ్యము జేసికొనినవారు కృతక భాషగాక, వ్యాకరణసాధ్యములౌ పదములను, కారకములను ప్రయోగించునట్టి భాష కాక, వ్యవహారమునకు సమీపముగా నుండు భాష ప్రయోగించిన నది చాల హృద్యముగా నుండును. వ్యావహారికము పేర వ్రాయబడుచున్న నేటి గ్రంథములలో గాని, భాషించు ఉపన్యాసములలోగాని ఉన్న భాష సామాన్య జనుల కంతవరకు సుబోధకముగా నున్నదో ప్రాజ్ఞులు, ద్రష్టలు తెలియగలరు. మాండలిక భేదములతో మూర్తీభవించినట్లు దురవబోధ మగుచున్నట్లును తెలిసిన విషయమే గదా! క్రియాపదములను మాత్రము త్రుంచి, సమాసభూయిష్ఠ రచన సల్పుచున్నవారనేకులున్నారు. జమ్మలమడక మాధవ రాయశర్మ రచన మిందులకుదాహరణ మగును. ఇట్లుగాక, సామాన్యమానవుని కర్థమగు లలితశైలితో గ్రాంథికము నారాధించినవారు వీరేశలింగము, విశ్వనాథులని చెప్పవలెను. ఇయ్యది వారి రచనలలో గానగును. ఈరచన నవలోకించిన సామాన్యులకును సుబోధకముగా రచించుటకు వ్యావహారికమే యక్కర లేదనియు, గ్రాంథిక వచనములో గూడ పండిత పామర హృద్యముగా రచనసల్ప వీలున్నదనియు తెలియగలదు. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులువారి 'మాలపల్లి' లోని వచనము సుబోధమే; దీనినే నేటి తెనుగందుము.

మాండలికములను గూర్చి Ernest Hornwitz—

"Books written in a dialect are slow to travel beyond the pale of the province where it is spoken, but, a classical tongue like Sanskrit spreads quickly over a wide geographical area"

అని వచించినారు.

అయితే, యీ మాండలిక శబ్దములకు గతి కల్పించు టెక్కడకో వచ్చినగాని చేసినను వచ్చు నష్టము మేమియునులేదు.

(ఇక యుపన్యాస రచనయందు, పానుగంటి లక్ష్మీ నరసింహారావు పంతులుగారు పేర్కొనదగినవారు. వారి 'సాక్షి' వ్యాసములలో గానవచ్చు వచనస్వరూప మనన్యసాధారణము.) ధారాశుద్ధి, విషయనిగ్రహము, ఉపన్యాసశక్తి, వచన రచనల పరిమాణములు. అందఱికిని సుబోధముగా నున్న రచన యిది. 'ఆంధ్ర ఎడిసన్' అనిపించుకొనిన సమర్థుడు.

(విమర్శనములో వచన రచనమే యుపాదేయమైనది కాని కొందఱు — వజ్ఝల సూర్యనారాయణశాస్త్రి, మధునాపంతుల రామలింగస్వామి వంటివారు — విమర్శకూడ పద్యములలో రచించిరి.) వచనరచన సల్పిన విమర్శకులను చారిత్రక విమర్శకులనియు, సాహిత్య విమర్శకులనియు విభజింపవలెను. సాహిత్య విమర్శకులలో పూండ్ల రామకృష్ణయ్య, కట్టమంచి రామలింగారెడ్డి, కాశీభట్ట సోదరులు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పురాణం సూరిశాస్త్రి, శే. వెం. రాఘవయ్యంగారు మున్నగువా రెందఱో యున్నారు. వీ రందఱిలో ముట్నూరి కృష్ణరావుగా రగ్రగణ్యులు. వారి 'సమీక్ష' యిందులకు నిదర్శనము. నిర్దుష్టమైన, యుదాత్త

మైన వచనరచన స్వరూపమును వస్తువున కనుగుణముగా రచించిచూపిన మేధావి కృష్ణరావుగారు. డికెన్సు మొదలగు రచయితలతో ఇంచుమించు చేతులుకలిపినా డనవలెను.

మన పురాణగ్రంథములను వచనములోనికి దింపి, సర్వోపభోగ్యముల గావించిన నోరి గుర్లింగశాస్త్రి, నాగపూడి కుప్పుస్వామయ్య, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి మున్నగువారు స్మరణీయులు. (అనేక పండితులు గ్రంథపీఠికారూపమున విమర్శనల సల్పుచువచ్చిరి.) ఈ వచనరచన క్లిష్టముగాదు; అయినచోఁ బ్రయోజనము చెడునుగదా! మేడేపల్లి వేంకటరమణాచార్యులు, దేవరాజసుధి, జయంతి రామయ్యపంతులు, వేటూరి ప్రభాకరశాస్త్ర్యాదు లనేక పీఠికలు రచించి వచనోపాసకులైరి.

చారిత్రకులలో కొమఱ్ఱాజు, మల్లంపల్లి, మారేమండ, భావరాజు, కురుగంటి, మల్లాది, పింగళి, దువ్వూరి, భోగరాజు, టేకుమళ్ళ, నల్లూరి, దిగవల్లి, మానికొండ, కవిత్వవేది, వంగూరి, చిలుకూరి, రాయసము, కోరాడ, గంటి మున్నగువా రున్నారు. వీరిలో కొందఱు సాహిత్యచరిత్రకు, కొందఱు భాషాచరిత్రకు, కొందఱు రాజకీయచరిత్రకుఁ గడంగి, సేవచేయువా రున్నారు. కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు స్మరణీయులు; పరిశోధనాపద్ధతికి దారితీసిరి. శాస్త్ర రచయితలలో సి: ఆర్. రెడ్డి, ఆత్మకూరి గోవిందాచార్యులు, గుళ్ళపల్లి నారాయణమూర్తి, కాశీపట్నం కొండయ్య, వఝులవారు, అప్పన్నశాస్త్రి మున్నగువా రల్పసంఖ్యాకు లున్నారు.

వ్యాఖ్యాత లనేకులు వచనము నారాధించుచున్నారు.

వ్యాసరచనమునకు వచ్చినచో సిగ్గగునని చెప్పక తప్పదు. ప్రతికాముఖముగా వెలువడు వ్యాసములు వ్యాసములు కానివి యనవి. వ్యాస మనఁగా కేవల విషయప్రాధాన్యము కలది కాదు. ఏ చిన్న విషయమునైనను రచయిత భావాధిక్యముచే కేంద్రీకరించి, విస్తరించి, అంగాంగీభావ నిర్వహణముచేసి, యుదాత్తమైన శైలీసంపదతో విరచనచేసి కావ్యత్వ మాపాదింపవలెను. (పద్యమువలె వ్యాసమునకు గూడ రసమే ప్రధానము.) (ఈ కారణముననే ఆంగ్లసాహిత్యమున వ్యాసకర్తల రచనములను విమర్శకులు కావ్యముక్రింద జేర్చిరి.) ఇట్టి వ్యాస మను ప్రక్రియ లేని లోపమును మన యాంధ్రసాహితీసేవకులు తీర్పవలసియున్నది.

మనకు 'కథానిక' నూతనముగానే వచ్చినదని పలువుర యాశయము; కాని పూర్వమిది వర్ధిలినటుల మథించిన వారు తెలియగలరు. మన యాంధ్రగృహములలో ముసలివారు చెప్పుపద్ధతి, వచనమాధుర్యము లప్రతిమానములు. ఆ సాంప్రదాయమును విస్మరించరాదు. 'కథానిక' నేఁటి సారస్వతమున ముఖ్యస్థాన మాక్రమించి వచనరచయితల ననేకుల ప్రేరేంచుచున్నది. చింతా దీక్షితులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరరావుమున్నగువారు ప్రసిద్ధులలో కొందఱు. కథాకథన పద్ధతికి వచనమెంతవఱకుపాదేయమో

— — ... ... పత్రికల వచనావళికలు బయలు
దేరి వచనరచనకు దోహదభూతము లగుచున్నవి.)

పత్రికలు వచనము నుపాసించు నిలయములు. 'Journalism' ఇతర ప్రాంతములలో గొప్ప విషయము. అది ప్రత్యేక శాస్త్రము. అట్టిది తెలుగులో బాగుగా ప్రవేశింపవలసి తెలియవలెను.

నేడాంధ్రమున శాస్త్రవాఙ్మయము వచనములో దారసిలవలెనని యత్నములు జరుగుచుండుట ముదావహము. అన్నిట వ్యావహారిక రచన యుపాదేయ మగుచున్నది. దీని విషయమై ముందే తెల్పితిని.

ఆంధ్రవచన వాఙ్మయము నొక్కమారు సింహావలోకనము చేసినచో నెన్ని విధములైన విభజనము చేయ వచ్చును :

1. పద్యములతో వేఱుపఱుపరాని పురాణవచనము.
2. ప్రబంధమందాలంకారిక శైలీవిన్యాసములతో వ్రాసిన వచనము.
3. ప్రజానీకమున కందుబాటులో నుండునట్లు రచింపబడిన వ్యావహారిక వచనము.
4. చిన్నయసూరి, కొక్కొండ వెంకటరత్నంపంతుల వారి జటిల గ్రాంథిక వచనరచనము.
5. వీరేశలింగము, విశ్వనాథుల సుబోధము, సులలితముగు వచనరచనము.

రూపక వికాసము

౧

సాహిత్య[illegible] [illegible]వ్యప్రధానమైనది. కావ్యము దృశ్య శ్రవ్య భేదము[illegible]నది. దృశ్యకావ్యమునే రూపకమని లాక్ష[illegible]చినారు. ధనంజయుని నిర్వచనము ప్రకారము [illegible], రూపక మను పదములు దృశ్యకావ్య[illegible]మున్నవి. అవస్థానుకృతి నాట్యమనియు, న[illegible]బడుట నది రూపకమైనదనియు, నటులయందు పాత్ర సమారోపముచే వర్తిలునది గాన రూపకమైనదనియు, దశరూపకమం దాతని సూత్రము. నే డీ మూడు పదములు మరుగుపడిపోయి నిత్యవ్యవహారములో నాటకమను పదముమాత్రము రూఢమైనది. కాని నాటకమనునది 'ఆపంచాంక మాదశాంక'మను ప్రత్యేక లక్షణముగల దశవిధ రూపకములలో నొకటిగా ధనంజయుడు పరిగణించినాడు. ఈనాడు వ్యవహరింపబడు రూపకములు పైలక్షణమున కవ్యాప్త్యతివ్యాప్తిదోషములకు గురియగునవే యనుట నిశ్చయము. కాని నాటకమను పదమును సామాన్య రూపక వాచకముగా గ్రహించుచున్నట్లు గమనించిన నే దోషమును పట్టదు.*

* ఈ విమర్శకు దావులేకయుండు రూపకశబ్దమునే శీర్షకయం దుంచితిని.

సాహిత్యములలో రూపక మున్నతస్థాన మాక్రమించు చున్నది. మన ప్రాచీన విమర్శక శిఖరములు కీర్తించి, అమరాది నిఘంటువులు బట్టీపట్టి, కావ్యములు చదివిన విద్యార్థి గాని నాటకముల జేపట్టకుండెడివాడు. అందుచేతనే 'నాటకాంతం హి సాహిత్యమ్' అను సూక్తి వచ్చినదనుకొందురుగాక. వసానివి కావ్యమును విచారించినచో శ్రవ్యకావ్యరచనయందు సాధన మొనర్చిన పిమ్మటనే దృశ్యకావ్య రచన చేయుచుండిరని బోధపడుచు తెలియుచున్నది. ఈ సిద్ధాంతానుసారమే 'నాటకాంతం కవిత్వ' మ్మను నార్యోక్తి. ఆధునికముగా సాహిత్యసృష్టియందును, సాహిత్యాస్వాదనములోను దృశ్యకావ్యమునకే ప్రశస్తియైనది. శ్రవ్యకావ్య రచనకన్న దృశ్యకావ్య నిర్మాణము కష్టతర మని దీనివలన తెలియుచున్నది. రూపకము సర్వాంగసుందరమై యుండుటయే యిందలి రహస్యము.1 కవితారచనయందు కవికి శబ్దభావాధికారములే విశిష్టముగా వలసియున్నవి. శ్రవ్యకావ్యమందు కథాచమత్కృతియు శబ్దమాధుర్యమును ప్రాధాన్యము వహించును కాని రూపకనిర్మాణము కవితా కళపై ననే కాక, సంగీతాభినయ రంగస్థాపనములపై నాధారపడియున్నది. ఆయా కళలలో ప్రత్యేకముగా ప్రవేశము లేనిదే రూపకనిర్మాణము విజయవంతముగాదు. పైగా రూపకరచనములో కవి పాత్రలతో తాదాత్మ్యము పొందగలుగు మానసికశక్తి సంపాదింపవలసియుండును. ఇతి

---

1 Literature is an art dependent upon words, but the drama is a multiple art, using words, scenic effects, music, the gestures of the actors, and organizing talents of a producer. — B. IFOR EVANS.

వృత్తము సంఘర్షణములోగాని తత్పరిష్కారములో ముగియవలెను 1 ఆఖ్యానములోవలెగాక రూపకకావ్యము కథను కుదించుకొనవలసియుండును. రూపకములో కథాకథనము సంభాషణముద్వారా జరుగవలసియున్నదిగాన కథాగమన వేగము, కాలసంకోచము రాని సహజచతుర సంభాషణల సహాపుటయందు దాను నిపుణుఁడైయుండవలెను; కథా, పాత్ర, రసాదిశుల చాటించు సామర్థ్యము వారలు అలవరచుకొనవలెను. నాటక ప్రయోజనమును జెప్పుచు భరతాచార్యుడు—

దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినాం ।
విశ్రాంతి జననం కాలే నాట్యమేతన్మయా కృతమ్ ॥
న తచ్ఛ్రుతం న తచ్ఛిల్పం న సా విద్యా న సా కలా ।
నాఽసౌ యోగో న తత్కర్మ యన్నాట్యేఽస్మిన్న దృశ్యతే ॥

అని సూత్రించినాఁడు. ఇంతటి పరమప్రయోజనసాధనమున కధికారానుభవములు విస్పష్టముగా వలసియున్నవి. ఇన్ని పొసగినను దృశ్యకావ్యముగాన సిద్ధప్రేక్షకుల పదనుగలిగినదై దృశ్యశ్రవ్యగౌరవములు రెంటికి సంతకపోయినచో లాభము లేదు. ఈ రెండుప్రయోజనములలో నేది లోపించినను దాని సంపూర్ణత చెడినట్లే యెంచవలెను.2 ప్రేక్షకుల మెప్పువడయుటకు మంది మనస్తత్వ మెఱిఁగియుండుట యత్యంతావశ్య

1 The essence of drama is crisis. A play is more or less a rapidly developing crisis in destiny or circumstance and a dramatic scene is a crisis within a crisis.

— William Archer.

2 చూ: పింగళి లక్ష్మీకాంతముగారిచ్చిన నాటకకళాపరిషదధ్యక్షోపన్యాసము

కము,¹ ఆఖ్యానమునకును రూపకమునకు నున్న ముఖ్యభేద ములలో నిది యొకటి. ఇన్ని కట్టుదిట్టము లుండుటచేతనే రూప[illegible]నము కష్టసాధ్యమైనది. కావుననే సాహిత్య ము[illegible]న కగ్రస్థానము లభించినది!

[illegible]ను కావ్యత్వసిద్ధిహొందిన రూపకముల రచిం చు[illegible] సంస్కృతమున కాళిదాసు, భవభూతులు— ఆంగ్ల[illegible]రును, బెర్నార్డుషాలు జగత్ప్రసిద్ధులైనారు. నే[illegible] కవు లనువారు రూపకకారులే యనవలసి యు[illegible] సాహిత్య[illegible]మున కప[illegible]ది. తెలుగుసాహిత్యములో రూపకము లు[illegible]ము లున్ననే పొడసూపినవి. కవిత్వము చెప్పు టలో భిన్నభిన్న మార్గములు త్రొక్కుచువచ్చిరిగాని, మన వారు రూపక ప్రక్రియనేలకో సాధింపరైరి. ఆంధ్ర సాహిత్య ముపై సంస్కృత సాహిత్య ప్రభావము మొదటను, ఆంగ్ల సాహిత్య ప్రాబల్యము తరువాత నున్నట్లు గుర్తింతుము. ఈవిధముగా రెండు భాగముల జేకొని మన సాహిత్యమును పరిశీలించినచో నాంగ్ల సాహిత్య ప్రభావము సోకిన తరువా తనే యించుమించుగా రూపక రచనాప్రయత్నములు తెలుగు నాట జరిగినట్లు స్పష్టమగును. సంస్కృత సాహిత్య

---

1 What appeals to the individual will not appeal to the multitude, and vice versa, so that a knowledge of the psychology of the multitude is a necessary part of the equipment of the dramatist. —E. W. Downs.

2 It is enough to remember that world's greatest poets are also its greatest dramatists. — Ashley Dukes.

ములో ననేక రూపకములున్నను మనవారి నా[illegible]
నుట కాయా కాలములం దాయా ప్రభువుల [illegible]
నీయకుండుటే హేతువగునని యూహింప[illegible] ఘు
నకు సమకాలికులైన పిల్లలమఱ్ఱి పినవీరన [illegible]
మును శ్రవ్యకావ్యముగా ననువదించుట [illegible]
ఘుని శృంగార నైషధము యాపద్ధతియే ననుస[illegible]
వలసి వచ్చును. లేనిచో దృశ్యకావ్యముగా [illegible]
వేఱు హేతువు కానరాదు. ఆయా యుగధర్మ[illegible]
యభిరుచుల ననుసరింపకపోయినచో తదాశ్రితు[illegible]
జీవితములు తెల్లవారుట యెట్లు? ప్రాచీన ధ[illegible]
ములో నున్న గ్రంథము లన్నియు ప్రభువుల ప్రోత్సాహముచే
రచింపబడినవిగాని ప్రజా బాహుళ్యము బహూకరించి
వ్రాయించినవి కావు. అందులకే యాసాహిత్యమంతయు [illegible]గా
త్త్వమై యేకసూత్రానుసారి (Typical) గా నున్నది.

పామరుల యభిరుచులను, వ్యవహారములను దెలిసి
కొని వారి కానందముగూర్చ రచనల జేసిన కవులకు సాహి
త్యములో సముచితస్థానము లేకవచ్చినది. కావుననే యట్టి
వారి రచన లనేకములు కాలగతిలోపడి మృగ్యమైనవి. రూపక
మనగనే పండిత పామరులను మెప్పించునదై యుండవలెను.
రాజాస్థానములం దాసనముల వాంఛించు కవుల కీదృష్టి
యుండుట సాధ్యముకాదు. అయినను పామర జనానందము
గూర్చు దేశికవిత మన యాంధ్రమందు పొడసూపుచునే
వచ్చినది. పదకవిత్వమంతయు నట్టిదిగా పూర్వము గమనించి
నాము. దేశీయ వృత్తములలో నాదవ్యక్తిగల సులభపద

సంఘములోని ...త్రలను దేశికవిత పామరుల ప్రబోధించి సంస్కరించుటకే యుద్దేశింపబడినది.

అట్టి దేశికవితలో రూపక ప్రక్రియగూడ నంకురావస్థ నొందిన ట్లూహింప వీలున్నది.1 మన దేశములో ప్రచారమందున్న తోలుబొమ్మలాటలు ప్రదర్శనమునకు ప్రాతిపదికలేమో యని యనుమానింప నవ్వును.2 ఈ దేశిసరణికి చెందిన నాటకమే 'యక్షగాన'మను పేరుతో వర్ధిల్లినట్లు కనుగొందుము. యక్షగాన మనునది సంస్కృత పదమైనను సంస్కృతమున నిట్టిదిగానరాదు, పండితులీ ప్రక్రియనే పెద్ద పేరుతో బిలువదలచి 'జక్కులపాట' యనుదానికి సంస్కృతీకరించి యుందురు. జక్కులవారు వృత్తి సంఘములలో నొక తెగకు చెందినవారు. వారికిష్టమైన గానమును పాడుచుండుటచే నది 'జక్కులపాట' యైనది. వారే దేశిరూపకముల బాడుచు నభినయించెడివారు కాబోలు!

ఈయక్షగానములు శ్రీనాథుని కాలమునాటికేయున్నట్లు తెలియుటకు తత్ప్రణీత భీమేశ్వర పురాణమందు గన్పించుచున్నది.3 క్రీడాభిరామమును వీధినాటకమని యనుచున్నారేగాని, తల్లక్షణము లెవ్వియు దాని కన్వయింపకుండుట.4

---

1. గ్రీకునాటకముకూడ నాగరకులైన పల్లీయుల వినోదార్థమంకురించినట్లు తెలియుచున్నది.

2 The simple puppet- show is everywhere the most recent form of dramatic representation and it was in India. — Pihael

3. కీర్తింతు రెద్దాని కిన్నర గంధర్వులు, గాంధర్వమున యక్షగాన సరణి.
భీ. ఖం. 3. 63.

4. శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి దశరూపక టీక.

చేసిన మన కేవిధముగాను దోడ్పడును పెద్దన కాలమునకు నాటకశాల లున్నట్లు తెలియవచ్చుచున్నది గాని యితరములైన యాధారములు లేకున్నవి. తుదకు నాయకరాజుల కాలములో గీతికి ప్రాధాన్యము వచ్చినదిగాన యక్షగానములను నవి కుప్పతిప్పలుగా నాటి కవులు వ్రాసినారు. ఈ యక్షగానముల స్వరూపము విచిత్రమైనది. కథను బోధించు కీర్తనల గైకొని వానికి మధ్య మధ్య నటులు తమ వచనములను గలుపునట్లు నిర్మితములైనవి కొన్ని యున్నవి; కీర్తనలతో బాటు దేశీయ గేయవృత్తములు జేరి కొన్ని యున్నవి. తరువాత వచ్చిన కవితాప్రౌఢిమచేతను, తదితరాంగ శోభచేతను యక్షగానములు ప్రత్యేకత గడించినవిగా తెలియుచున్నది. ఆనాడు ప్రోత్సాహమందిన నటకులలో ప్రధానముగా పల్లీయులే యుండిరనుటకు మొన్న మొన్నటివఱకు ప్రచారములోనున్న వీధి భాగవతులే నిదర్శనము. కావుననే ఏనాదివా రభినయించు దానిని 'ఏనాది భాగవత'మనియు, కూచిపూడివారాడుదానిని 'కూచిపూడి భాగవత'మనియు ప్రజలు వ్యవహరించుచు వచ్చినారు. ఇప్పటికిని వీని స్వరూపము నచ్చటచ్చట గానగల్గుదుము. కూచిపూడివారి భామకలాపము గొల్లవేషములు సుప్రసిద్ధములు! వానినుద్ధరించి యభినయకళను నిల్పుకొనవలసిన కర్తవ్యమీనాడు మనపై నున్నది. ఇట్లు పదునేడవ శతాబ్ది మొదలు పందొమ్మిదవ శతాబ్దివఱకు యక్షగాన రచన సాగుచునేవచ్చినది. ఈయక్షగానము లెక్కు డముద్రితములుగా తంజాపుర పుస్తక భాండాగారముననే నిలిచియుండుటచే నివి

[illegible]న్నవి. [illegible] యక్షగాన సరిక్రొత్త రూపముగా మారి 'హరికథా' రూపమును ధరించినది. బహుపాత్రాభినయమునకు యక్షగానములోవలె తావులేక హరికథ లేక పాత్రాభినయమునకు అవకాశ మిచ్చునదై వరలి నది ఈ హరికథ మన జాతికున్న విశిష్ట ప్రక్రియగా నెన్నబడెను.

[illegible]ముగా దాదాపు గత శతాబ్దాంతము వరకు నాంధ్రదేశములో దేశినాటకములు కన్పించుచున్నవి గాని మార్గ నాటకములు లేకున్నవి. ఆంగ్ల సాహిత్య ప్రభావము క్రమముగా మనలను లోగొనినది. ఉత్తర దేశమునుండి గత శతాబ్ద మధ్యకాలములో నాటక కంపెనీలు వచ్చి మన యాంధ్ర ప్రాంతమున ప్రదర్శనముల నిచ్చుటచే మనవారిలో క్రొత్త కదలిక బయలుదేరినది. ఇవి కారణములుగా రూపక రచనా ప్రయత్నములు విరివిగా సాగినవి. రాజమహేంద్రవరములో గుంటూరులో, బళ్ళారిలో, విజయనగరములో, నెల్లూరులో కంపెనీలు వెలసినవి. వారు ప్రదర్శించు నిమిత్తము కవులు నాటకముల రచించుటకు పూనినారు; తొలిదినములలో సంస్కృతాంగ్ల నాటకముల ననువదించుటతో ప్రారంభమైనది. వావిలాల వాసుదేవశాస్త్రిగారు షేక్స్పియరు వ్రాసిన 'సీజరు'ను, భవభూతి వ్రాసిన 'ఉత్తర రామచరితము'ను తెనుగున కనువదించినారు; అట్లే వీరేశలింగము పంతులు 'వెన్నిసు నగర వర్తకుడు', 'అభిజ్ఞాన శాకుంతలము' 'మాళవికాగ్నిమిత్రము', 'ప్రబోధ చంద్రోదయము'ల ననువదించి

నారు. వేదము వేంకటరాయశాస్త్రిగారు 'ఉత్తరరామచరిత' 'శాకుంతలము' 'రత్నావళి', 'నాగానందము' ల ననువదించిరి. తిరుపతి వేంకటకవులు ముద్రారాక్షస మృచ్ఛకటికల ననువదించినారు; వడ్డాది సుబ్బరాయకవి వేణీసంహారము రచించినారు. ఈవిధముగా నెందరెందరో సంస్కృత నాటకముల ననువదించినారు; అనువదించుచున్నారు; ఆంగ్ల నాటకానుకరణ మంత విరివిగా జరుగలేదు. దీనికి కారణము సంప్రదాయ భిన్నతయే కావచ్చును.

తరువాత ననువాదములకన్న స్వతంత్ర నాటకముల రచింపవలెనను కుతూహలము పొడముకొనది. తత్ఫలముగా పురాణగాథలను, చారిత్రకాంశములను తీసికొని నాటకరచన సాగుచువచ్చినది. ధర్మవరము కృష్ణమాచార్యులవారి సారంగధర, చిత్రనళీయము, ప్రహ్లాద, ప్రమీలార్జునీయము, చంద్రహాస మొదలైనవి; కోలాచలము శ్రీనివాసరావుగారి తల్లికోట యుద్ధము; బలిజేపల్లి లక్ష్మీకాంతముగారి హరిశ్చంద్ర; శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి బొబ్బిలి; తిరుపతి వేంకటకవుల ఉద్యోగ విజయములు; వేదము వేంకటరాయశాస్త్రిగారి ప్రతాపరుద్రీయము; పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి రాధాకృష్ణ, విప్రనారాయణలు; చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి గయోపాఖ్యానము, పారిజాతాపహరణము. మొదలైనవి పై శ్రేణికి చెంది ప్రయోగార్హతను బొందిన ప్రసిద్ధ స్వతంత్ర నాటకములు. తరువాత సాంఘికసమస్యల నెదుర్కొనెడి నాటకముల వ్రాయ సంకల్పించినవారిలో గుర

జాడ అప్పారావుగారు కన్యాశుల్కము వ్రాసి స్థిరకీర్తి వడసినారు. వీరేగాక, శ్రీయుతులు బళ్ళారి రాఘవాచార్యులు, విశ్వనాథ సత్యనారాయణ, గుళ్ళపల్లి నారాయణమూర్తి, ముద్దూరి శ్రీరామమూర్తి, కొప్పరపు సుబ్బారావు, శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి, దామరాజు పుండరీకాక్షుడుమున్నగువారెందరెందరో పలువిధములైన వస్తువులతో, శైలులతో నాటకములు రచించినారు. 1

కాని, నాటక నిర్మాణమునకు గావలసిన వివిధ శక్తులలో సంపూర్ణముగా నన్నిశక్తులుండి రచింపబడిన నాటకమూర్తి నేటికి నవతరింపలేదని చెప్పవలెను. రమణీయమైన కవితయుండి, చతురమైన సంభాషణములుండి, నిబిడమైన కథాసన్నివేశము నేసుకొని, చక్కని పాత్రోన్మీలనము చేసి, కావ్యత్వము నొందగలిగి, ప్రయోగగౌరవము బడసెడినాటకమవతరింపవలసియేయున్నది! నేడుపలభ్యమానములగు నాటకములలో కొన్ని లక్షణము లన్వయించునవే యున్నవి. కాకపోయిన సర్వాంగ పరిపూర్ణమగు రూపకములేని కొఱత యుండనే యున్నది. అసలు సృష్టిలోనే పరిపూర్ణత లేదు గనుక మనము విచారింపరాదేమో!

ఆంగ్లసాహిత్యపు సంపర్కమువలన మన నాటక నిర్మాణములో కొన్ని సంప్రదాయములు తొలగిపోయినవి.

---

1. శ్రీ వావిలాల సోమయాజులు రచించిన నాయకురాలు, శ్రీ పింగళి నాగేంద్రరావు రచించిన 'వింధ్యరాణి'యను నాటకము లీనాడు ప్రశంస నందుచున్నవి.

దశరూపకములోని లక్షణముల కేనాఁడో మనము దూరుల
మైనాము. స్వాతంత్ర్యము ప్రబలిన కొలఁది సంగీతము హెచ్చ
యినది; దశాంకములు, పంచాంకములు క్రమముగా క్షీణింప
జొచ్చినవి. 'మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని
కావ్యాని' అను సంప్రదాయము ప్రాతవడి యాంగ్లములోని
'ట్రాజడీ' (కరుణము) పై భ్రమపుట్టినది. అరిస్టాటిలు ప్రతి
పాదించిన యైక్యత్రయ సూత్రము (Three Unities) నెఱిఁగి.
సూత్రప్రకారము సాధనమును సాగించుచు వచ్చినారు. రంగ
స్థల నిర్మాణములోఁగూడ పాశ్చాత్యులే మనకును దిద్దు
చున్నారు. వారి గురుత్వము సంపూర్ణముగా నేటి మనరూప
కములమీఁద నున్నట్లు తెలియఁగలము. ఇకనైన ప్రాచీనలాక్ష
ణికులు ఏర్పఱచిన సూత్రముల ననుసరించి భారతదేశపు ప్రత్యే
కత చాటుటకు పూనుకొని భరతశాస్త్రమందలి రంగస్థల
మును తెలిసి తదనుగుణములైన నాటకముల రచించుటకు
మనవారు శ్రద్ధ వహింపవలసియున్నది. దేశినాటకములైన
యక్షగాన వీధిభాగవతముల నాదరించుచు మార్గనాట్య నిర్మా
ణమునకై పరిశ్రమ జేయవలసియున్నది. అట్లు చేసినచో
సాహిత్యములో నుత్తమ ప్రక్రియను సాధించి తల్లోపమును
తొలగించినవా రగుదురు.

రూపకవికాసము

౧

మానవులు నిత్య నవ్యతా గవేషణులు. ఈ ధర్మము కవులందును వర్తించును. సాహిత్యములో నే యుగమున కా యుగము నూతనముగా కన్పించును. ఒక్కొక్క యుగములో నొక్కొక్క ప్రత్యేకత, విశిష్టత గడించినది సాహిత్యము. రాను రాను నేటికి నవ్యయుగము వచ్చినది.

ఈ యుగములో వచ్చిన నవ్యసాహిత్యములో మూడు విశిష్టరూపము లున్నవి. అవి ఖండకావ్య, కథానికా, ఏకాంకికలు. లోతుగా పరిశీలించిన నీమూడును మనకు క్రొత్తవి కావనినట్లును, పూర్వము మనకున్న కావ్యభేదముల కివి ప్రాతిపదికలనునట్లు గోచరించును. ఎట్లనగా-ప్రబంధమునకు ఖండకావ్యము, నవలకు కథానిక, నాటకమున కేకాంకిక సూక్ష్మరూపములు.

ప్రబంధము-నవల-నాటకము- ఈ మూడును విస్తృతమైన వస్తువుకల్గి. వీని లో ప్రాసంగికములు, ఉదాహరణములు చిత్రకథలు, అధికవర్ణనములు మొదలైనవి యెన్నియో యిమిడి వస్తువిస్తృతికి దోహదము చేయును. కాని, నవ్యయుగములో వచ్చిన ఖండకావ్యము, కథానిక, ఏకాంకిక లట్లుకావు.

వీనిలో వస్తువు సూక్ష్మమైనది. రచనమే చాల ప్రధానమైనది. ఈ రచనములో నుద్వేగము, ఔజ్జ్వల్యము కలిగి, ప్రధానవిషయమును సూటిగా, సరళముగా, సులభముగా బోధించుశక్తి యుండవలెను. వీనిలో నుండునదియొక్క సన్నివేశమే. ఆ ఒక్క సన్నివేశము రచనా ప్రభావమువలన హృదయమును చప్పున నాకర్షించి, రసానుభూతిని పొందజేయవలెను. నవ్యయుగములో వచ్చిన యీ మూడురూపములు స్వల్పకాలపరిమితులు. అల్పాల్ప వస్తువులో ననంతమగు రసనిధిని పొందింపవలెను. సూక్ష్మములో మోక్షము పొందించుట వీనిసూత్రము; నవ్యులయత్నమును.

పూర్వము మనకీ విధమైన సాహిత్యమున్నదా యను ప్రశ్నకున్నదనియే సమాధానము. కాని యీ యుగములో తిరిగినన్ని మలుపులును, వచ్చినన్ని మెరుగులు నపుడు లేవనియే యొప్పుకొనవలెను. మనపూర్వ ప్రబంధములలో నున్న వర్ణనలన్నియు ప్రత్యేకముగా గ్రహించిన ఖండ కావ్యములుగను, పురాణములలోనున్న ప్రాసంగికములన్నియు కథానికలుగను, రూపకభేదములలో ధనంజయాదులు లక్షీకరించిన వీథి, అంకము, భాణము, ప్రహసనముల నేకాంకికలుగను పరిగణింపవచ్చును. ఇవి యీ విధముగా మనకు విజాతీయములుగాక, సజాతీయములే యున్నట్లు తెలియుచున్నది. ఇప్పుడున్న స్వయం సంపూర్ణత, కళావిషయ కైక్యతలు పూర్వము లేవు. అనగా, నాయా కావ్యములలో నవి యంగములుగ నున్నవి కాని, ప్రత్యేక కళాసిద్ధి పొంద

గలుగు 'అంగి'గా నిలువలేకపోయినవని స్పష్టముగా దెలి యును. ఆయాఘట్టముల నే నవ్యులు గ్రహించి చిత్రించినపుడు పూర్వసాహిత్యములో లెక్కకుమీరి యిట్టి సన్నివేశము లున్న వని ద్యోతకమగును. కనుక పాశ్చాత్య ఏకాంకికా లక్ష ణములను వీనికి ననువర్తింపజేయవలసివచ్చును. ఇప్పుడు నవ్య సాహిత్యోద్యానమున వికసించిన మూడుపువ్వులు పాశ్చా త్యాలంబన పురస్కృతములు.

ముందు మనవిచేసినట్లు ఏకాంకనాటికలో నొక్క సన్నివేశమే యుండవలెను. నాటకకారు డన్ని యంకము లలో తీసికొని రాగలుగు విభావానుభావ సాత్త్విక వ్యభి చారీ భావ సంయోగమును, ఏకాంకనాటకకారు డొక్క యంకములోనే తీసికొని రావలయును. ఉదాహరణమునకు చిన్నపిల్లలు చిన్న చిన్న తాటియాకుబొమ్మలలో జీవితము లోని ఘట్టములను సూచించుచు నాడుకొందురు. అనగా వారు మానవజీవిత మంతటికిని సూక్ష్మాకార మిచ్చు చున్నారన్నమాట. అట్లే ఏకాంకిక మహా నాటకమునకు సూక్ష్మరూపమైనను, వస్తువిస్తృతి లేకఉన్న ఒక్క ఘట్టము భావపూరితముగాను, హృదయమును కదలించి కరగించు నదిగా నుండవలెను. పాత్రౌచితి, సంభాషణాచాతురి, కథా కథనపద్ధతి, పౌర్వాపర్యముల సమత, వస్తువుయొక్క బీజగర్భ నిర్వహణములు మొదలైనవి యన్నియు మహా నాటక కారునివలెనే ఏకాంకికా కారుడు ననుసరింపవలెను. ప్రయోగ, పఠనయోగ్యత లను రెండు ధర్మము లేకాంకి

కథను వర్తించును. కాని ప్రదర్శనము పైపునకే యెక్కువ మొగ్గు నేకాంకిక ఆ ప్రదర్శనములో అనకొనని కొత్త మనుపులతో వస్తువు ముగిసి సామాజికులను భయ సంభ్ర మాశ్చర్యములలో ముంచివేయవలెను.

ఏకాంకికా నిర్మాణమంతయు కథానికా నిర్మాణ మును పోలియుండును. కాకపోయిన నాకథనే నాటకీయము చేయుట యుచట ధర్మము. అందుచేతనే " In dramatic composition, the equivalant of the Short-story is the One-act play" అనినాడు. బ్రాండరు మా థ్యూస్. ఏకాంకిక నక్కగా రచింపగల సమర్థుడు మహానాటక నిర్మాణమున కర్తుడు కాగల డనుటలో సందేహము లేదు. నిజమున కుత్తమ ఏకాంక నాటకమే సామాజికులు మహానాటక ప్రదర్శనము నానందించునట్లు తర్ఫీతిచ్చునని మారియెట్ అన్నాడు.

స్టీవెన్సన్ కథానికను గురించి చెప్పిన సూత్రము ఏకాంకికను వర్తించునని చెప్పవచ్చును.

1 పాత్రములనుబట్టి, వాతావరణమును, సందేశ మును చిత్రించుట.

2 సందేశమును బోధించు నిమిత్తము, పాత్రములను వాతావరణమును సృష్టించుట.

3 వాతావరణమును చూచి పాత్రములను, సందేశ ములను కల్పించుట.

ఏకాంక నాటకము ముఖ్యముగా సంభాషణమీద నాధారపడి యుండును గనుక సంభాషణములు, సూటిగా, చిత్రముగా, వ్యంగ్యముగా. పదునైనవిగ నుండి పాత్ర చిత్రణములోను, కథావేగములోను దోహదము చేయవలయును. భాషా విషయములో పాత్రోచిత భాష తప్పక ఉపయోగింపవలెను. దీనికి ననుభవము చాల నవసరము. నాటికయంతయు నొక సందేశము నందించుచు ప్రతియంశము నా ధర్మోన్ముఖమై యుండవలెను.

ఏకాంకికా స్వరూపమునుగురించి చెప్పిన దాని సారాంశమును సూత్రప్రాయముగా చెప్పవలెననిన చో నిట్లుండును:-

1. భావనైశిత్యము 2. ఏకాగ్రత 3. సమగ్రత 4. ఏకైక సన్నివేశము 5. పరిమితపాత్రసంఖ్య 6. అర్థబంధురత 7. పాత్రోన్మీలనము 8. సరసంభాషణములు 9. రచనాసౌలభ్యము 10. ఐక్యత్రయసత్త్వము 11. సందేశదాయకత్వము 12. ప్రయోగగౌరవము—ఇవి యన్నియు నుండవలెను. ఇన్ని యుండియు వస్తువు సార్వజనీనమైనది కాక పోయినచో, అది ఎంతయో కాలము నిలువను నిలువదు; ఉద్దిష్ట రసానుభూతిని కలిగింపను కలిగింపదు. కాబట్టి విశ్వజనీనముగా నుండుట కావ్యధర్మము.

ఇక తెలుగులో నేకాంకికా రచయితలను, వారి రచనలను పరికింతము. ఖండకావ్య కథానికలు పెరిగిపోయినవి. ఏకాంకికారచన యిటీవలనే బయలుదేరి సాగుచున్నట్లు కన

బడుచున్నది. లెక్కకు చాల కన్పించినను, పరీక్ష కాగనవి చాల తక్కువ. ఒక్క విషయము చెప్పవలెను. ఖండకావ్యములలో మనవారు సిద్ధహస్తులైనారు. కథానికలలో యత్నించు చున్నారు. ఏకాంకికలలో ప్రాథమికావస్థలో నున్నారు.

ఏకాంకికా సాధకులలో — నోరి, తల్లావజ్ఝల పితృపుత్రులు, చింతా, చిలుకూరి, అబ్బూరి, విశ్వనాథకవిరాజు, మల్లాది అవధాని, రామకృష్ణశాస్త్రి శర్మలు, శ్రీపాద, ముక్కపాటి, భమిడిపాటి, ఇంద్రగంటి, ముద్దుకృష్ణ, చలం, విశ్వనాథ, గిరి, రజనీ, జానకిరాం, సాధనసమితి సభ్యులు కొందరు మొదలైనవా రున్నారు.

వీరి రచనల నన్నిటిని పరిశీలించినచో, ఏకాంకికలు నాలుగు విభాగములుగా కన్పించుచున్నవి. 1. వచననాటిక 2. గేయనాటిక 3. పద్యనాటిక 4. రేడియోనాటిక. ధార్మికిక, సాంఘికములనెడి యంతర్విభాగ మున్నది. ఆయా పథానుసరణము ననుసరించిన విభాగము కన్పించును. వీనిలో వచన మొకటియే ఉత్తమమని యంగీకరించవలెను. గేయము హృదయద్రావక గుణము కలిగినది. కాబట్టి గేయనాటిక రసానుభూతిని సత్వరముగా సమకూర్చునని యే చెప్పవలెను. ' రజనీ ' గేయనాటిక యెన్నదగినది. పద్యనాటికల విషయములో 'సభాపతి' సిద్ధహస్తుడు. రేడియో ఏకాంకికకు చక్కని యాలంబన మిచ్చుచున్నది.

పైన చెప్పిన రచయితల ఏకాంకికలు నే నుల్లేఖించిన సూత్రము లన్నిటి నొప్పించునవికావు. కాకపోయిన నొక్క

క్కరి రచనములో కొన్ని సూత్రములు మాత్రమే కన్పించును. ఉదాహరణమునకు: శ్రీపాద సంభాషణా చాతుర్యములో, చిలుకూరి నాటకమునకైన వస్తువు నేర్చుకొనుటలో, మొక్కపాటి యేకాగ్రతలో ప్రతిభ చూపినారు. అట్లే ఒక్కొక్కరు కొన్ని లక్షణములు పట్టువడిగా వ్రాసినారు. కాని, సర్వాంగ సుందరముగా అన్నిలక్షణములు నొప్పించు ఏకాంక నాటిక ఇంకను తెలుగులో రాలేదనియే చెప్పవలెను. నోరి వారి 'ఖేమాభిక్షుని' అను నాటికమాత్రము చాలవర కన్ని లక్షణములు కలిగి ధర్మనాటికకు సమీపములో నున్నదని చెప్పవచ్చును. సర్వలక్షణ సమన్వితమైన నాటిక తెలుగులో నిర్మించుటకు నవ్యులు ప్రయత్నింతురని యాశయము.

ఈనా డేకాంకికా రచయితలు లెక్కకు మించిపోయినారు. రేడియో నాటికలను శ్రీయుతులు కపిల కాశీపతి, వేమూరి వేంకటరామనాథము, పన్యాల రంగనాథరావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, బుచ్చిబాబు మున్నగువారు సాధించుచున్నారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ, మారేమండ రామారావుగారు చారిత్రకాంశములతో నేకాంకికలు రచించుచున్నారు. ఇంక ఎందరో యత్నించుచున్నారు. నాటికారచనకు భవిష్యత్తున్నట్లు తోచుచున్నది.

8 జూన్ 1948 తేదీన హైదరాబాదు రేడియో యందుండి ప్రసారితము.
హైదరాబాదు సమాచారములో, ప్రజామిత్రలో ప్రకటితము)

— హి. శర్మ

మూడవ భాగము

సాహిత్యపరిణామము

ఓమ్

సహనావవతు సహనౌభునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీత మస్తు
మా విద్విషావహై.

ఆంధ్రసాహిత్యార్చకులకు నమోవాకములు

—కృతజ్ఞత—

మీ రీనాడు నాకు చేసిన యీగౌరవమునకు కృతజ్ఞుడను. ఈయధ్యక్ష స్థాన మలంకరింపదగిన యోగ్యతాధికారములు నాకు లేవు. వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులనేకులుండగా దీనికి తగుదునని, నేనంగీకరించుట సాహసకార్యమే. నాబోటి కించిజ్ఞుని నీసమావేశమున కధ్యక్షత వహింప నాజ్ఞచేసి మీరేమి సాధింప దలచినది నేనూహింపలేను. అకారణముగా పక్షపాత మలవడినచో ప్రతిక్రియ లేదని పెద్దలందరు. శారదాదేవి యాశీర్బలముతో, సహృదయులైన సభాసదుల సానుభూతితో నాకర్తవ్యమును శక్తివంచనలేక కొనసాగింతునని మనవిచేయుచున్నాను.

—అంజలి—

ఆంధ్రులు విలక్షణమైన గుణములను కలిగిన ప్రత్యేక జాతికి చెందిన వారు. విజ్ఞానమున కాంధ్రదేశ మొకప్పుడు నెలవై చెన్నొందినది. ప్రాచీన

రైన నాగులకును ఆంధ్రులకును సంబంధమున్నట్లు వారి యాచార వ్యవహారము లనుబట్టి యూహింప వీలున్నది. తచ్చిహ్నముగా నాదిశేషు వుపాస్యదైవముగా నిల్చినాడు. కావుననే కాబోలు నిప్పటికిని కొన్ని జనపదములలో నాగారు గొమ్మ గ్రామదేవతగా వారాధింపబడుచున్నది. మీదు మిక్కిలి శేషువు విజ్ఞానమున కుపలక్షకుడు. ఆంధ్రులకును, ఆదిశేషువునకు నింతటి చక్కని సంబంధము పొసగుటచే నీసందర్భమున ననంతుని స్తుతించుకొనుట జాతిసంప్రదాయము ననుసరించినట్లగును. ఆదికవియైన నన్నయభట్టారాచార్యుని వాక్యసరణి మన కనుశాసనముగావున నాతని పద్యములలోని పల్కెదను :—

> బహుళవన పాదపాద్రి కుల పర్వత పూర్ణపర స్సరస్వతీ
> సహిత మహా మహీధర మజస్ర సహస్ర ఫణాలి దాల్చి దు
> స్సహతర మూర్తికిన్ జలధి కాయికి పాయక శయ్యయైన య
> య్యహిపతి దుష్కృతాంతకు డనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్.

ప్రవేశిక. భా. ఆ ది. ౧—౧౦౪

ఆంధ్రులది పాలకజాతి. క్రీ. పూ. 234 నుండి క్రీ.త. 207 వరకు నాంధ్రరాజులు దేశమును పాలించినారు. శాతవాహను లాంధ్రులని చారిత్రకుల సిద్ధాంతము. ఈయాంధ్ర రాజుల పోషణమున వైదిక, జైన మతములు వర్ధిలినవి. కాని వైదిక మతమునే వా రనుసరించుచు వచ్చినట్లు వారు చేసిన యశ్వమేధాది యాగములే ధృవపరచుచున్నవి. నాటి సంఘము వర్ణాశ్రమ ధర్మములకు బద్ధమై యొప్పారినది; కావున నే విధమైన సంఘర్షణములు లేకపోయినవి. ఆనాటి ప్రజలు శాంతియుతమైన జీవితమును గడపినారు. శ్రద్ధాభక్తులు, మాటమర్యాదలు, ధైర్యసాహసములు, వినయవిభూతులు వారి మనసులలో సంపూర్ణావకాశము పొందినవి.

సంస్కృత భాషాసాహిత్యములే నాటి పండితుల యాదరము నందినవి. వాని సంప్రదాయ సూత్రాదులే ఆదర్శప్రాయముగా భావితములైనవి. తరువాత హాలుడు ప్రాకృతమునందును, గుణాఢ్యుడు పైశాచియందును గ్రంథముల రచించి రాబోవు తెనుగు సాహిత్యమునకు మార్గదర్శకులైనారు. నాటికి ఆంధ్రభాష రాజస్థాన ప్రవేశమున ఖ్యాతి గడింప లేదు. దైనందిన వ్యవహారములో నుండి జనబాహుళ్యము నాశ్రయించినదే కాని రాచరికమును, ఉత్తమ సాహిత్యము నాధారముగా జేసికొనలేదు; పసితనములో నుండి యున్నట్టి మధురనాదములీను జిలిబిలి పలుకులతో ప్రజలహృదయముల నార్ద్రీభూతము లొనర్చుచుండినది.

సాహిత్యమునకు మతమే ప్రోద్బలము

క్రీ. వె. ఏడవ శతాబ్దికి—అనగా చాళుక్యరాజుల పరిపాలనా కాలములో ఆంధ్రభాషకు క్రమముగా గౌరవము లభించినదని తెలియుటకు వారి శాసనములే నిదర్శనములు. నాటికి బౌద్ధమత ప్రచార ముద్ధతమైనది. బౌద్ధవాఙ్మయము ప్రాకృతమున విరివిగా పెరిగిపో జొచ్చినది. వైదిక మతసంప్రదాయముల నిలువద్రొక్కవలసిన కర్తవ్యము హెచ్చినది. సంఘజీవనము దేశకాల పరిస్థితుల ననుసరించి మార్పుచెందుచుండను. దీని ననుసరించియే యాయా జాతి సాహిత్యములు వర్ధిలుచుండును. పూర్వసాహిత్యములో సంఘ జీవితము ప్రతిబింబించుట లేదని ఇటీవల కొందర అభి ప్రాయపడుచున్నారు. కాని ఇది సరిగాదు. పదునొకండవ

శతాబ్దములో చాళుక్యనృపాలుడైన రాజరాజు వైదిక మత ప్రచారార్థము దీక్షబూనినాడు; ఆంధ్ర వాగనుశాసనుడైన నన్నయభట్టారకుని పవిత్రవచస్సులో నాంధ్రభారతావతరణము పొసగినది. మహాత్ముడైన నన్నయ స్వస్థాన వేష భాషాభిమతులయ్యు, రసప్రలుబ్ధమయిన మనస్సుగలవారయి పెద్దలు దేశభాషా కావ్యముల గౌరవింపవలెనని ప్రబోధించినారు. ఈవిధముగా నాంధ్రదేశ భాషాసాహిత్యములపై నాదరాభిమానము లుద్బుద్ధములైనవి.

దేశికవిత—తత్ప్రభావము.

ఇంతలో వీరశైవమతము విజృంభించినది. తత్ప్రచారము నిమిత్తము వాఙ్మయ మాశ్రయమై వృద్ధికాజొచ్చినది. ప్రజల కందుబాటులో భాషాభావము లుండవలెననెడి యభిప్రాయము బౌద్ధకాలమునాటికే ఉదయించి యీకాలమున నభివృద్ధి నొందినది. సులభబోధకై 'దేశికవిత-జాను తెనుగు' లత్యంతోపస్కారములుగా కనిపెట్టినారు. శబ్దకాఠిన్యము లేక సరసమగు పదములతోకూడి, రాగరంజితమై, ప్రజల ఆచార వ్యవహారములకు ప్రతిబింబమై, జాతీయముల నిమిడ్చికొనినదై పామరుల కష్టములను మరపించి కార్యసాధనములో నుత్సాహమును ప్రసాదించునట్టిదైన పదకవిత్వమునకు బీజ మానాడే నాటబడినది. ప్రజాదరమే కవితకు లక్ష్యమనీ, ప్రజల సంస్కరించుటే కవితాధర్మమనీ ఆనాడే గుర్తింపబడినవి. ఏరాజుల కనుసన్నలకును ఆనాటి పదకవిత బద్ధము

కాలేదు. అట్లు కానిచో నాకవితలో నంతటి యుద్రుతము, స్వేచ్ఛాస్వచ్ఛత లుండుట కవకాశము లెక్కడివి ?

ఈ 'దేశికవితోద్యమ' ప్రభావము తరువాత వచ్చిన తిక్కన కవితలో గన్పించుచున్నది. తెలుగు నుడికారమును మూటకట్టుకొనిన యాతని జాతీయ రచనమే యిందులకు తార్కాణము. పిమ్మట వచ్చిన ద్విపద రామాయణ హరిశ్చంద్ర నలోపాఖ్యానములుకూడ నీ 'దేశి'మార్గమునకు చెందినవే. శ్రీనాథునికూడ నీసిద్ధాంతము లోబరచుకొని యాతనిచే పల్నాటి వీరచరిత్రను వ్రాయించినది. ఇవి తోలుబొమ్మలాటలద్వారా, వృత్తి సంఘములుగా వరలిన జంగముల ముఖమునను ప్రచారమందినవి. ప్రజల కాహ్లాదము గూర్చుచు పౌరాణిక గాథలను బోధించుచుండుట కీ ద్విపదలు తోడ్పడుచువచ్చినవి.

కావ్యములు ప్రభుసమ్మితములు

పిమ్మట చాలకాలమువరకు మన సాహిత్యము ప్రభుసమ్మితమైనది. కవులు సంస్కృత కావ్యానువాదములతో కాలము గడపుచువచ్చినారు. కావ్యములు పాండితీ ప్రకర్షకాలవాలమైనవి. ప్రజల హితముపైగాక ప్రభు వొసంగు కానుకలపై కవులదృష్టిపడినది. ప్రభువులు సహజ సౌందర్య విలసితములగు వనములలో విహరించుటమాని కృత్రిమోద్యానవిహారములకు మురిసిపోవుట పరిపాటయినది. ఈసూత్రమే కవులనుగూడ పరిపాలించినది. ఆద్యసత్కథల గైకొని చిత్రించుట—కల్పనా కథలచే మురిపించుటలు జరిగినవి. రాజాశ్రి

యము లభించిన కవులకు ప్రజలతో నిమిత్తమేమి? వారి కష్ట నిష్ఠురములు కావ్యవస్తువులగుట కవకాశ మెక్కడిది?

క్రమముగా కవులు ప్రభువులకు మిత్రులై పొట్టలో చల్ల కదలక వర్తిలినారు. వాతావరణాను గుణముగా ప్రణయ చింతనము హెచ్చినది. రాజాంతఃపురములు కవులకు సుపరిచితములగుటచే నచటి వస్తువులు, సన్నివేశములు వారి కావ్యములలో ప్రతిబింబితము లగుచువచ్చినవి.

‘నిరుపహతి స్థలంబు, రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడె, మాత్మకింపయిన భోజన, మొయ్యెలమంచ, మొప్పు తప్పరయు రసజ్ఞు, లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్’

దొరకడివారు వారికి. తినమరగినవాడు పస్తుండ గలడా మరి? అంతటి సౌఖ్యముల నందినారు గనుకనే నాడు వారి ప్రాపు సడలినంతనే శ్రీనాథ పెద్దనలు ‘జీవచ్ఛవముల’ విధముగా నున్నట్లు వ్రాసికొని విలపించినారు.

సంపూర్ణ భాషాభావ కల్పనా సౌష్ఠవము

శ్రీకృష్ణరాయల కాలము తెనుగుజాతి వైభవమునకు సర్వవిధముల శిఖరప్రాయము. సాహిత్యమునకు భాషాభావ కల్పనాసౌష్ఠవము నానాటికవులు సంపూర్ణముగా నిచ్చినారు. తెలుగు సాహిత్యక్షేత్రములో విశిష్టమైన ప్రబంధవృక్షము శాఖోపశాఖలై విరాజిలి రసవత్ఫలముల నీనిన దీ కాలమందే.

సాహిత్య సౌధపతనము

కృష్ణరాయల యనంతర మల్పకాలమునకే విజయనగర సామ్రాజ్యము క్షీణించినది. కవు లించుకుంచుగా పొట్టలు

పుచ్చుకొని బయలు దేరవలసివచ్చినది. చిన్న చిన్న సామంతులు రాజులైనారు. వారికి తాము చక్రవర్తుల మనెడి యహంకారము పెరిగినది. విషయలాలసులై ప్రజా పరిపాలనమందలి కాంక్షకంటె బహుకాంతా పాలనమందలి ప్రీతి హెచ్చినది. వీరి ప్రాపు గోరిన కవులు వారి చిత్తవృత్తుల ననుసరించియే మెలగవలసివచ్చినది. అందుచేత పదునారు పదునేడు శతాబ్దములలో సాహిత్యము జుగుప్సావహమగు కేవల శృంగార వస్తుచిత్రణముతో నిండిపోయినది. ప్రబంధమే దిక్కూచి యాటచే గతానుగతికమై పేలవమైపోయినది కవిత. అనుకరణానుసరణములు హెచ్చెనవి. ఈవిధముగా నాంధ్ర రాజ్యవైభవముతో సాహిత్య వైభవ మడుగంటినది.

చెప్పుకొనదగిన అంశములు.

కాని నాయకరాజుల కాలములో చెప్పుకొనదగిన అంశము లేకపోలేదు. దేశికవిత కాదరణము మరల రగులుకొన్నది. సంగీత నాట్యముల కాస్థానములో నధిక గౌరవము లభించినది. ప్రజలమీద దృష్టిమరలినది, జాతీయమైన రూపక ప్రక్రియకు దోహద మీయబడినది. యక్షగానములు విరివిగా రచింపబడి ప్రదర్శింప బడినవి. వ్యావహారిక భాష యుపాదేయమైనది. రఘునాథరాయల పరిపాలనాకాలము నకు కృష్ణరాయల పరిపాలనాకాల ముపమానమగును. ఆతడు సంగీతమును ప్రోత్సహించి పదసాహిత్యపోషకుడై ప్రసిద్ధినొందినాడు. ఆంధ్రులు గర్వింపదగిన క్షేత్రయ్య పదములు, త్యాగరాజు కీర్తనము లాకాలమునకు చెందినవే. వాని ననుసరించి

తర్వాత దీక్షితులు, శ్యామశాస్త్రి మున్నగువా రనేకులు కీర్తనలను, పదములను, రచించినారు. శృంగార భక్తిపరముగా నీవిధమైన కవిత రచింపబడి ప్రజలను మురిపించి సంస్కరించునదై వరలినది. నాయక యుగములో ప్రజలకు విషయబోధ సులభముగా చేయుటకు పద్యముకన్న వచనమే అనుకూలమైన ప్రక్రియగా కనిపెట్టినారు. వచనములోనున్న అన్వయ సౌలభ్యము పద్యములో నుండదుగదా! అందుచే రాయవాచక కర్త కళువె వీరరాజు, సముఖము వెంకట కృష్ణప్పనాయకుడు, విజయరంగ చొక్కనాథుడు మొదలైనవారు వచన రచనకు పూనుకొని ప్రజాసేవ చేసినారు. ఈవిధముగా సాహిత్యమును ప్రజలకు సమీపములో నుంచి వారిని విజ్ఞానవతులుగా చేయుటకు ప్రయత్నము లాకాలమందు జరిగినవి.

ఆంగ్ల సాహిత్య ప్రభావము-నూతన ప్రక్రియలు:

తరువాత బ్రిటిషు పరిపాలనా ఫలితముగా నాంగ్ల భాషా సాహిత్యముల ప్రభావము మనపై బడినది. పందొమ్మిదవ శతాబ్ది మధ్యకాలములో నిది ఉత్కటమైనది. సంఘములో, మతములో, సాహిత్యములో మార్పువచ్చినది. 'క్రొత్త యొక వింత ప్రాత యొక రోత' అన్నట్లుగా కొంతకాలము మనవారా మోహాంబుధిలో తలమున్కలువేసి మన పార్థక్యమును విస్మరించినారు. మనకు గలిగిన మేలునే యెంచుకొందము. ఆంగ్ల సాహిత్యములో మనకు లేని నూత్న ప్రక్రియలకు మురిసిపోయి మనసాహితీసేవకు లట్టివి రచించుట మొదలిడినారు. 'నవల', 'ఉపన్యాసము', 'ప్రహసనము', 'విమర్శ'

తరింపజేసి శ్రీవీరేశలింగముపంతు లాధునికయుగకర్తయైనాడు. తాను సంఘసంస్కారియై స్త్రీజనోపయోగార్థ మనేక రచనల సాగించినాడు. దీనిని పురస్కరించుకొని తరువాత అనేకులు స్త్రీలకు పాటలు, కథలు వ్రాయుచువచ్చి సులభశైలిలో నాంధ్రజాతీయ జీవనమును పాతివ్రత్య ధర్మమును ప్రబోధించినారు. వీరేశలింగముపంతు లవతరింపజేసిన నూతన ప్రక్రియలలో తర్వాత నెందరెందరో కృషిసల్పుచువచ్చినారు. కాని నేటికి ఒక్కదానిలోనైనను పరిణతి పొందలేదు.

వీరేశలింగముపంతులు గద్యశైలీసౌలభ్య కల్పనమునకై చేసిన పరిశ్రమనే తిరుపతి వెంకటకవులు పద్యశైలీసౌలభ్య కల్పనమునకై యొనర్చినారు. వీరి ప్రభావము యావదాంధ్ర దేశముపై బడినది.

భావకవిత్వము.

1910 ప్రాంతమున కాంగ్లసాహిత్యములోని 'రొమాన్టిక్' కవిత మనవారి నాకర్షించినది. ఆవిధమైన ప్రత్యక్షభావ కవిత[1] మన కంతవరకు లేదని యువవిద్యార్థులు గమనించినారు. వారికి వయస్సు, వాతావరణము లనుకూలించినవి. ప్రేయసి, కోకిల, ప్రకృతి నవ్యకవితా ముఖ్యసామగ్రిలో చేర్చినారు. దీనిని అభినవకవిత్వ మనినారు. శ్రీ రాయప్రోలు వారు వరుసగా నావిధమైన కావ్యాలు ప్రచురించినారు.

1 Subjective poetry దీనిని శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు ఆత్మాశ్రయ కవిత్వమని వ్యవహరించుచున్నారు.

సంఘ సంస్కారమును, చుక్కానిగా పెట్టుకొని శ్రీ గురజాడ కవి మాత్రాచ్ఛందస్సులో కవితారచన సాగించినాడు. పతితోద్ధరణము సూత్రముగా గ్రహించి పల్లీయులను నాయకా నాయికలుగా గ్రహించి నండూరివారు 'ఎంకిపాటలు' రచించినారు. పూర్వమార్గమును వదలి, నవీన మార్గమందు విశ్వాసము లేని కొందరిని బౌద్ధవాఙ్మయమందలి సత్యాహింస లాకర్షించి కవితావస్తువులైనవి. సౌందరనందాదు లట్టి రచనలే. దీని సంతతిని అప్పటిలో భావకవిత్వ మనినారు. ఇది మొదట కొంతకాలము దూషణమునకు గురియైనది; కాని తరువాత నిలువద్రొక్కుకొనినది.

వ్యావహారిక భాషావాదము

ఈకాలముననే శ్రీ గిడుగు రామమూర్తి పంతులువారి వ్యావహారిక భాషావాదము ప్రచారములో నున్నది. మన సాహిత్యములో వచనబీజ మంకురించి పెరిగి పెద్దదైనకొలది యాలంకారిక శైలి పుణికి పుచ్చుకొనుచు వచ్చినది. వ్యాకరణముపై నక్కరలేని మోజుపెట్టుకొని పాండిత్యమునంతయు దీర్ఘ జటిల సమాసములలో ప్రదర్శించి కొందరు వచనమును దురవగాహ మొనర్చినారు. అది కృతకభాష యైపోయినది. పద్యమును వదలి వచనమును గ్రహించిన హేతువును విస్మరించినారు. ఈసత్యమును దర్శించి శ్రీ గిడుగువారు భాషావాదమును లేవదీసినారు. ఆంధ్రసాహిత్యపరిషత్తు దీనినిఢీకొనినది. **రామమూర్తిపంతులు** శత్రుకోటి నెదుర్కొనినాడు. ప్రజామోదము, నవ్యకవుల అనుసరణమును బడసి విజయుడైనాడు. దీనికి

వ్యాప్తిలోనున్నది. పై రాయప్రోలు, గురజాడ, గిడుగుల ఉపజ్ఞకమైన భాషాభావ సంస్కరణ ప్రచారము చేయుటకై సాహితీసమితి పుట్టి, పత్రికను స్థాపించి, మిక్కిలి సేవచేసినది. తత్పరిణామముగా వచ్చిన సాహిత్య ప్రక్రియలగు ఖండకావ్య కథానికా ఏకాంకికాదులకు సాహితీపత్రిక దోహద మొసగినది. తర్వాత 'ప్రతిభ' పుట్టి ఆపనిని నిర్వర్తించుచున్నది; ఇది యంతయు నవ్యసాహిత్యమనుపేర నేడు పరగుచున్నది.

పరిశోధనము-చారిత్రక విమర్శ.

1912 ప్రాంతమునకే ప్రజలందు విజ్ఞాన వ్యాప్తికై శ్రీకొమర్రాజు లక్ష్మణరావు పంతులవారు పాటుపడుచుండిరి. ఆంగ్ల సాహిత్యములో పరిశోధనము, విమర్శ లత్యంతముగా పెరిగినవి. ఏభాషాసాహిత్యమునకైన నివిలేనిదే ప్రశస్తి లేదు. ఈసత్యమును దర్శించి పంతులుగారావిధమైన కృషిచేయు నారంభించినారు. చారిత్రక విమర్శకు మార్గదర్శియైనారు. తర్వాత కట్టమంచివారు సాహిత్య విమర్శనమునకు బీజావాపముచేసి తమ ఉపాయనము నొసంగినారు. ఇట్లే సాహిత్య చరిత్రలుకూడ వెలసినవి. ఈవిధమైన విమర్శన సారస్వతము మన కీనాటికిని విరివిగా పెరుగలేదు. అక్కడక్కడ చిన్నచిన్న యత్నములు జరుగుచున్నవికాని యేకముఖముగా కొనసాగుచు నిర్మాణపరిణతి నందుటలేదు. ఈకాలమునకే విశ్వదాత గారు ఆంధ్రపత్రిక స్థాపించి విజ్ఞానవ్యాప్తికి కారకులైనారు.

గత యుద్ధానంతరము మనకు ప్రత్యేక విశ్వవిద్యాలయము వచ్చినది. కాని రాష్ట్రము రాలేదు. ఇది ప్రజలలో చాల నిరుత్సాహమును కారణమైనది. ప్రజల హృదయాలలో నంతటనుండే ఆంధ్రోద్యమము బాగుగా పాదుకొన్నది. ఉపన్యాసములద్వారా ఉద్బోధ చేయుట యారంభమైనది. ప్రాచీనాంధ్ర గ్రంథములు క్రొత్తవియు ప్రబోధకావ్యములు రచింపబడినవి. ఆనాటిదే—

'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు'

మొదలైన రాయప్రోలువారి పద్యములు. కాని 1921 లో అసహాయోద్యమము వచ్చి దేశమంతట వ్యాప్తమైనది. అందులో మన రాష్ట్రోద్యమము మరుగుపోయినది. జాతీయ గీతము లనేకములు వచ్చినవి. వానిని రచించినవారిలో శ్రీగరిమెళ్ళవారు ముఖ్యులు. ప్రజాప్రబోధమునకు ఆంధ్రరత్న మొదలైన వక్తలు పాటుపడినారు. ఈవిధముగా ప్రబోధ వాఙ్మయము పెరిగినది. నేటికిని ఆంధ్రరాష్ట్రగీతము విన్పించు చునేయున్నది. కొడాలివారి 'హంపీక్షేత్రము', విశ్వనాథవారి 'ఆంధ్రప్రశస్తి', తుమ్మలవారి 'రాష్ట్రగానము' మొదలైన విందుల కుదాహరణములు.

ఇట్లుండగా యుద్ధానంతరము యూరపు సాహిత్యము మన దేశమునకు దిగుమతి యయ్యెను; తత్పరిణామముగా శ్రీ శ్రీగారి 'అతివాస్తవికత' అంకురించినది. ఈమార్గమిపుడంత ప్రబల ప్రచారములో లేదు.

నేటి సాహిత్యస్థితి.

ఇంతలో రెండవ ప్రపంచయుద్ధము రానేవచ్చినది; దీనితో మన దేశమునకు దెబ్బతగులునను భయము హెచ్చినది. రష్యా యుద్ధప్రవేశము ప్రజాయుద్ధమను భావమంకురింపజేసినది. ఆత్మ ప్రణయపరమైన నవ్యసాహిత్యముపై తిరుగుబాటు పొసగినది. ప్రేయసిని, కోకిలను విడిచి మన దేశస్థితిని పర్యాలోచింపవలసిన కాలము వచ్చినది. ప్రభువు, పాలేరు సమానమను భావ మంకురించినది. దేశాభ్యుదయమే నేటి మన రచయితల పరమాశయమని గ్రహించినారు. ప్రజా వాఙ్మయము కావలెననెడి యూకాంక్ష పొడమినది. రష్యా వాఙ్మయసూత్రములాదర్శములైనవి. అక్కడి సామ్యవాదము కృషి ఘనత్వ సిద్ధాంతములు మన దేశమున కనూదితములైనవి; కాని నియంతృత్వరేఖ లీలగా పొడసూపుచున్నది. వీనికన్నిటికి ఫలితముగా 'అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘము' స్థాపితమైనది. అన్ని భాషలలో నుపసంఘము లేర్పడినవి. మన దేశములో వివిధ భాషాసాహిత్యముల నేకముఖముగా నడుపవలెనని వీరి కుతూహలము. వైమనస్యములు లేక దేశస్థు లంతా చెట్టపట్టాల్ పట్టుకొనినడవవలెనని వీరి సంకల్పము. ఆదర్శము లుత్తమములైనవే; కాని యూచరణ

ములో బెట్టుటకు ప్రయత్నము లత్యంతముగా జరుగవలసి యున్నవి.

నూతనచైతన్యము.

ఆంధ్ర సాహితీలోకమున నేడు నూతనచైతన్యము కలిగిన దనక తప్పదు, దేశభాషాసేవకులను గుర్తించి వారిని గౌరవించుచున్నారు. ఇది శుభసూచకము. ప్రజలలో సాహిత్యాభిరుచి, గ్రంథపఠనాసక్తి యధికముగా నున్నవి. ఎచ్చట చూచినను సాహిత్య సమావేశములు, కవి సమ్మేళనములు కన్నులపండువుగా జరుగు చున్నవి. ఎన్నెన్నియో ప్రచురణ సంఘములు, సారస్వతసమితులు పుట్టుచున్నవి. గ్రంథ ప్రచురణ మత్యంతముగా జరుగుచున్నది. పత్రికలు హెచ్చినవి. తదనుగుణముగా రచయితలకు లెక్కయే లేకున్నది. ఈవిధముగా వాఙ్మయము విరిగా పెరుగుచున్నది. ఏజాతిసంస్కృతియైన నాభాషాసాహిత్య ప్రచారము ద్వారా జరుగుచుండును. ప్రజలు తమ సాహితీరోచిస్సులను ప్రజ్వలిత మొనర్చినచో జాత్యభ్యుదయకారక మగును. ఈయభిప్రాయమునే మాలవ్యాజీ—

Literature was the best medium for improving the character of a nation, and by improving the vernacular literature, you will elevate the nation.

అను వాక్యములో పొందుపరచినాడు. కావున జాత్యభ్యుదయ కారక మగు సాహిత్య మీనాటి మనవాఙ్మయములో నెంత యున్నదో పరిశీలించుకొనవలసియున్నది.

సహృదయులారా! మిమ్ము నేను విసిగించితిని. సమగ్ర సాహిత్యస్వరూప సంగ్రహమును సంక్షిప్తముగా కాలానుగుణముగా మీకు నివేదించినాను. నావి రెండు మాటలు కొరవడినవి. వాని నాదరముతో గ్రహింతురని విశ్వసింతును.

— సాహిత్యార్చకుల కర్తవ్యము—

ఈనాడు సాహిత్యోపాసనము ప్రజలపై నెక్కువగా నాధారపడియున్నది. నేటి ప్రజలలో కేవల సాహిత్యాభిరుచి కలిగినందువలన ప్రయోజనము పెద్దగా లేదు. ఉపన్యాసములను వినోదములుగా గ్రహించుచో నవి నిష్ప్రయోజనము లగును. “ఆంధ్రుల కనైకత్వ” మను ప్రవాద మొకటి" మనకున్నది. దీనివలననే మన సంస్థలు, ఉద్యమములు వృద్ధి నొందకున్నవి. వర్గవైషమ్యములు లేక సహృదయులై ప్రజలు సానుభూతితో తిలకించు దృష్టి నలవరచుకొనవలసియున్నది. వివాదముల ఫలమును మనము రుచిచూచియేయున్నాము. కావున ప్రతి ఆంధ్రుడును విద్యావంతుడై, లోకకావ్యాన్వేషణముతో వ్యుత్పన్నుడు కావలెను. తనజాతిభాషాసాహిత్య సంప్రదాయములను పవిత్రముగా నెంచవలెను. సాహిత్యములో వివిధమతములను చారిత్రకదృష్టితో చూడవలెనే కాని పాక్షికదృష్టి పనికిరాదు.

ఉత్తమమైన మానవ జన్మము లభించినందులకు సద్వినియోగ మొనర్పవలెను. ఇదితర జీవులవలె గాక మానవున కాత్మభావ వ్యక్తీకరణమునకు యోగ్యత యున్నది. అతనికి విజ్ఞాన సముపార్జనమునకు నలయుశక్తి బీజ భూతముగా నున్నది. కాని మానవ జీవితము పరిమితమైనది;

వి... సాహిత్య... కాలముయొక్క పిలుపును గ్రహించి, ...మారక వృత్తి ... సాహిత్యమును వెలిసికొనుటకు సాహి త్యార్చకుడు ... కాలము సంపాదించవలెను.

ఏది మానవ లోకమునకు హితము బోధించుచు సార్వకాలికమై సార్వజనీనమై సత్యమై సాహిత్యమో, ఏది సమస్త ప్రయోజనములనిచ్చునదై మానవాళి కాలమునకు నిల్చు ... ఉత్తమమైన ... కాలములో సాహిత్యము ... గ్రంథముల ... ప్రయోజనము ...

అట్టి కాలము లేనిదే రసజ్ఞత్వము ప్రవేశము లభించదు. స్వర్గలోక ములో ప్రవేశము మానవులకు ధనముతో గాని, లంచముతో గాని పొందగలుగుటకు వీలుకాదు, కావ్యజగత్తులో నానంద మట్టి సులభముగా లభింపదు. దీనినే—

'It is open to labour and to merit but to nothing else. No wealth will bribe, no name overawe, no artifice deceive the guardian of these Elysian gates.'

అని రస్కిన్ పండితుడు ప్రవచించినాడు.

కావున ప్రతిభాసంపన్నుడు తమసాంబుధినుండి వెల్వరిల్లి, కాలముయొక్క పిలుపునుగుర్తించి, వ్యుత్పన్నుడై, ఉత్తమ సంస్కారియై, స్వస్థాన వేషభాషాభిమానము కలిగి, సాహిత్యార్చనము చేసి ఆత్మపరిశోధనము పొంది తపస్వి గావలెను. సాహి త్యార్చకుడు తా మధుకారముచే మథించి పక్వించిన రస తత్వమును విమర్శలద్వారా తిరిగి లోకమునకందజేయవలెను.

ఆంధ్రసాహిత్యములోని వెలుగుజిలుగులను విప్పి చూపునట్టి గ్రంథములు నేడు విరివిగా రావలసియున్నవి. తాత్కాలిక ప్రయోజనమును దీర్చుకార్యములకన్న శాశ్వతముగా మన జాత్యభ్యుదయమును జాటుకార్యములలో ప్రజాసంస్థలు, సాహిత్యపరిషత్తులు పాటుపడవలెనని సవినయముగా మనవిచేయుచున్నాను. ఏనాడు ప్రతి ఆంధ్రుడట్టి కార్యాచరణమునకు దీక్షవహించి దానిని సాధించునో ఆనాడే తెలుగుజాతి సంపూర్ణావకాశమును పొంది సర్వాంగసుందరముగా విరాజిలును; అంధతమసము లడఁగంటి జ్యోతిర్లోకమునకు సుగమమైనమార్గ మప్పుడుగాని యేర్పడదు. ఆశుభప్రదమైన ముహూర్త మనతి కాలములో రాగలదని విశ్వసింతును.

'అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ'

(17-6-45 నా డీయబడిన ప్రథమ హైదరాబాదు జిల్లా మహాంధ్ర సభా సారస్వత సమావేశపు టధ్యక్షోపన్యాసము.)

సాహిత్యార్చనము

మానవునకు హితమును బోధించునదియు, లోకము లోని దృశ్యముల నుదాత్తములుచేసి, సకలశాస్త్రములతో సమన్వయించి యాత్మబోధచే నుత్తమ సంస్కారమును కలిగించునదియు, సాహిత్యమని మహితాత్ములు నిర్వచించు చున్నారు.[1] కావ్యప్రపంచ మంతటిని సాహిత్యముక్రింద పరిగణించినారు. నిత్యవ్యవహారములో జరుగుచున్న రచనా వ్యాపార మంతయు విశాలావకాశము కలిగిన వాఙ్మయములోనికి వచ్చును.[2] సాహిత్య మను పదములో విశిష్టత యున్నది. మహాకవి యెంతటి పూర్ణుడో సాహిత్య మంతటి పూర్ణత్వము కలిగినది. సాహిత్య మాలోచనామృతమును ప్రసాదించునట్టిదని శ్లోककారుడు సూత్రించినాడు :

సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః కుచద్వయమ్
ఏక మాపాత మధురం అన్య దాలోచనామృతమ్.

ఇంత మహిమగల సాహిత్యమునకు సృష్టికర్త కవి. అత డుపాసకుడై, ప్రజ్ఞావంతుడై, విశ్వమానవకల్యాణార్థమై ప్రవక్తగా ప్రతియుగమున నవతరించుచుండును. ఈ కవి తాను సృజించిన సాహిత్యము ద్వారా బ్రహ్మానంద సహోదరమగు రసానందానుభవమును ప్రసాదించును.

---

1. 'హితేన సహితం సాహిత్యం' 'సహిత్యభావః సాహిత్యం'
2. చూ. 'సాహిత్యోద్దేశము'లో ప్రథమభాగము.

మానవుడు నిరంతర సౌఖ్యాన్వేషి. లోకములో తాను చేయు ప్రతికార్యములో నీసూత్రమనుసరించును. సుఖము లౌకికమైన కారణములచే కలుగు చిత్తరంజక స్థితికి చెందినది. ఈ లౌకిక సుఖమునే కవి చిత్రించి దానిని లోకోత్తరమైన యానందముగా పరివర్తనము చేయును. ఆనందము సుఖమువలె, లౌకికము, వస్తుగతము గాక ఆత్మగతము, శాశ్వతము నగు మనోరంజకస్థితికి చెందినది. లౌకికానందమునకును పారలౌకికానందమునకును మధ్యస్థితి కావ్యానంద మాశ్రయించుచున్నది. లౌకికానందమునకన్న నుదాత్తమై, పారలౌకికానందమునం దాసక్తిగొల్పునది కావ్యానందము. విజ్ఞానవంతుడైన మానవుడు లౌకిక సుఖములను విడిపోవక శాశ్వతానంద ప్రదాయినియగు రసమూర్తి నన్వేషించుటకు సాధన చేయ సంకల్పించును. సాహిత్యార్చనముచే మానవుని చిత్తము సంస్కృతమై బ్రహ్మజ్ఞానసముపార్జనమునకు సుముఖమగును. ఈ విధముగా సాహిత్యార్చనము మోక్షసాధనముగా పర్యవసించును.

సాహిత్యార్చనమునకు గడంగుటకు మున్ను మానవుడు కొంత యధికారము సంపాదింపవలెను. దేవతార్చన మొనర్చుట కేవిధముగా భక్తి లేక నమస్కారము కుదురవలెనో యట్లే సాహిత్యార్చనమున కభిరుచి,1 కవివాక్యమందు ప్రామాణ్యము లలవడవలెను. ఈ యభిరుచి లేనిదే సాహిత్యావరణములో ప్రవేశించుట నాస్తికుడై దేవాలయ ప్రవేశ మొనర్చినట్లగును. వినోదముకొఱకు నర్చనము చేసిన

---

1 Literary taste ...Arnold Bennett.

సవివేచనమునకు గురియగును. కావున నిష్కళంకమైన మనసు కలిగి విజ్ఞాన చక్షుస్సులందుకొని పవిత్రభావముతో సాహిత్యము నర్చింపవలెను.[1] సాహిత్యాభిరుచి యలవరచుకొన్నపిమ్మట మానవుడు లోకకావ్యాల పరిశీలనమువలన, పండితుల యుపన్యాసాకర్ణనము వలన సంప్రదాయజ్ఞులైన మహాత్ముల సంసర్గమువలన, చక్కని సంస్కారి కావలెను. కేవల పండితుడై శబ్దసాధుత్వాసాధువుల నెన్నుట పాడిగాదు. రసపిపాసియై తాను, భావమునకు శరీరములు పదములవంటివని యోచించి యా రసభావము నందుకొనుటకు సహృదయుడై యత్నింపవలెను. కవిహృదయ ప్రవేశముచేసి యాతని భావమును గ్రహింపవలెనేకాని కవియొక్క దేశకాలమానసిక పరిస్థితులను త్రోసివేయరాదు.[2] సాహిత్యార్చకుడు ముఖ్యముగా గమనింపదగిన సూత్రమిది. ముందుగా కవిపై నేవిధమైన కలుషభావము నుంచరాదు. గుణగ్రహణపారీణు లగుటయే సాహిత్యార్చకుల పరమధర్మముగా పరిగణింపవలెను. బ్రహ్మానందము ననుభవించుటకెట్లు మానవు లుత్తములై యుపాసకులు కావలయునో యట్లే కావ్యానందము ననుభవించుటకు సాహిత్యార్చకులు తపస్వులై యుండవలెను. అధికారము నార్జింపనిదే ఆనందాప్తి లేదు. సాహిత్యము మానవ లోకమునకే యుద్దేశింపబడినది. ఈ యమృతభాండము నుప

---

1 You must love them (Poets) and show your love

2 To enter into theirs (thoughts) observe ; not to find your own expressee complete. ... Ruskin

యోగించుకొని ఫలమందుట మానవుల విధి. భగవదర్చ మున కెంత చిత్తస్వాస్థ్యము, ఆస్థ కావలెనో యంతటి కేంద్రీకరణము, రసతృష్ణ సాహిత్యార్చన మొనర్చుటకు వలసి యున్నవి.

అర్చనా ఫలితముగా సాహితీలోకములోని పాత్రములతో గాఢస్నేహము కలుగును. వారితో క్రమముగా తాదాత్మ్యము పొందుట తటస్థించును. అచటి యాదర్శ శీలవంతులతో సాహచర్యమబ్బి వారితో సానుభూతినుంట పొసగును. ఇది కవియొక్క పాత్రచిత్రణా వైశిత్యమునుబట్టి అర్చకుని యాత్మశుద్ధి బుద్ధితీక్ష్ణతల ననుసరించి, కలుగుచుండును. ఈ విధముగా సాహిత్యార్చనము జాత్యభివృద్ధికి కారక మగుచుండును.

సాహిత్యములోని యమృతము సామాజికుని పాండిత్య పరిశీలనాశక్తుల ననుసరించి తదనుగుణముగా పొడముచుండును. మథించినకొలది యానంద మధికముగా వెలువడుచుండును. కృషి లేనిదే ఫలముండదు. లౌకిక సౌఖ్యము పొందినట్లు లంచములతో మోసములతో నీ సాహిత్యామృతమును పొందజాలరు. సాహిత్యము కావ్యపరమైనది.

కవిత్వము లయాన్వితమైనది. ఛందస్సనునది లయను పురస్కరించుకొని వచ్చినదే. కవితలో నాద మంతర్వాహినిగా ప్రవహించుచు శబ్దముల రూపులతో బయటికి కన్పించుచుండును. కవి యా శబ్దములకుండు నర్థములద్వారా భావస్పందనము కల్గించును. మనకున్న సాహిత్యము భావరాగ తాళ యుతము. భావసౌకుమార్యమును, నాదమాధు

ర్యమును శబ్దవైచిత్రిని ప్రత్యేకముగా పాసగించుచు నలరించు కవు లున్నారు.

మన తెలుగుభాష సహజముగా గానయోగ్యమైనది. ల, న, స అను అక్షరములు వివిధసంపుటులలో మేళనము పొంది మధురమంజుల నాదము నీనుచుండునని తెలియుచుము. కొన్ని యక్షరముల పౌనఃపున్యము దరువు వేసినట్లు గతికలిగి యుండును, 'నానాసూనవితాన వాసనల నానందించు సారంగ మేలా' అనుపాదములో 'అభంగ తరంగ మృదంగ' అను పదములో పై రెంటికి నుదాహరణము లగుపించును. శబ్ద వైచిత్రి మనప్రబంధములలో బహుళముగా కన్పించుచున్నది. భావోపాసకు లనేకులున్నారు. పోతనకవితలో భావప్రాధాన్య మగుపించును. నవ్యులు భావకవు లను పేరువడసినారు.

ఎనకజన్మములోన ఎవరమో నంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి!
ముందు మన కేజన్మ ముందోలె యంటి
తెల్ల తెలపోయింది పిల్ల నా యెంకి!
ఎన్నాళ్ళు మనకోలె యీ సుకము లంటె
కంట నీరెట్టింది జంట నా యెంకి!

అను పాదములలో శబ్దమునకన్న భావమునకు గౌరవమున్నది. ప్రణయకీర్తనములో లోకతత్త్వమును కవి పాదిగినాడు. భావప్రకాశము వలననే తత్త్వస్ఫురణము కల్గించుటకు ప్రయత్నించినాడు. పునర్జన్మ సిద్ధాంతమును జన్మ జన్మలకు తోంటి భర్తయే వలయుననెడి యుత్తమ స్త్రీ యభిలాషము జోడించి ప్రతిపాదించినాడు. ఈ విధముగా

నవ్యులు ముఖ్యముగా భావోపాసకులు. కావుననే వారి
రచన భావకవిత్వమనెడి పేరుగాంచినది. ...... సాహిత్యా
ర్చకులు పక్షపాతము లేకయుండి, ప్రతివిధానములో నున్న
విశిష్టతను గ్రహించు శక్తి యలవరచుకొనవలయును.

సాహిత్యము సత్యమును బోధించును; అనుభవ రహ
స్యముల విప్పి చెప్పును. సౌందర్య స్వరూపమును సాక్షాత్క
రించును. ఇంతటి బోధచేయుటకు కవి యెంత ప్రజ్ఞావంతుడు
గావలెనోగదా! ఇట్టి ప్రతిభావంతులు పల్వురు తమజీవితము
లన్నియు ధారవోసి, తపః ఫలితముగా దర్శించిన
విశ్వసత్యములతో గూడిన మహాకావ్య సమూహమైన
సాహిత్యము మానవలోకముపాలిటి పెన్నిధియని వేరుగా
చెప్పవలెనా? ఈ నిధిని భద్రపఱుపవలసిన బాధ్యత
ప్రజలపైనున్నది. దానిని దుర్వినియోగముచేయక, దాని
వలన సంక్రమించు సంస్కృతి నంతటిని పుణికిపుచ్చుకొన
వలెను. గతానుగతికమయిన నిత్యజీవితమువలన ప్రయోజ
నము శూన్యము. ఒకజాతి తన భాషాసాహిత్యములను నిలువ
బెట్టుకొనకపోయిన నాజాతి నిర్వీర్యమగును.[1]

ఇతర భాషాసాహిత్యములమీద మోజుతో మన
భాషాసాహిత్యములను న్యూనతగా చూడరాదు. మన సంప్ర
దాయమును, సభ్యతను పవిత్రముగా నెంచి నిలుపుకొనవల
యును. ఏజాతియొక్క పార్థక్యమైనను భాషాసాహిత్య సంప్ర
దాయములమీద నాధారపడియుండునని తెలియవలెను.
మానవుడు జీవనోపాధి నిమిత్తమై యేమార్గ మనుసరించినను

---

1 " The care of the national language is at all times.

తన జాతిసాహిత్యముతో పరిచయము విధిగా కలిగియుండవలెను. కేవలము పండితులకే సాహిత్యార్చన ముద్దేశితమైనదని తలంపరాదు. సాహిత్యము జాతియొక్క సమష్టినిధిగాని ప్రత్యేకవ్యక్తుల సొత్తుగాదు. లోకములో మానవులే బుద్ధిమంతులు. కా మా బుద్ధిమత్తను సాహిత్యార్చనమునకు వినియోగించి యుత్తమ సంస్కారులు కా నభిలషింపవలెను.

సమగ్ర సాహిత్య స్వరూప సాక్షాత్కారమైనపిమ్మట సాహిత్యార్చకు లొనర్పవలసిన కర్తవ్య మొకటి యున్నది. వ్యాఖ్యాత లేనిదే కవిప్రతిభ వెలుగదని యొక యాంగ్ల సూక్తి[1] యున్నది, విమర్శయే కవిత నుద్దీపింప చేయును. ఆంగ్లసాహిత్యము నవలోకించిన దీని యంతరార్థము వ్యక్తమగును. ఆంగ్లసాహిత్య మెంత యున్నదో దానికి మూడంతలు వ్యాఖ్యాన సారస్వత మున్నట్లు చూడగలము. కావున మనసాహిత్యము ప్రకాశించుటకు సహృదయపూర్వకమైన విమర్శదీపికలు వెలుగొందవలెను. అంతవరకు మన

---

a sacred trust and the most important privilage of the members of a society. Every man of education should make it the object of his increasing concern to preserve his languoge. pure and simple to speak it so far as in his power in all its beauty and perfection. A nation whose language becomes rude and barbarous must be on the brink of barbarism in regard to everything else. A nation which allows her language to go to ruin is parting with the best half of her intellectual independence and testifies her willingness to cease to exist." — Malavyaji

1 It is the critic that makes a poet.